శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక.

కాకినాడ

రెండునెలల కొకసారి ప్రకటింపఁబడును

సంపుటము ౨౭. { ప్రమాథినామసంవత్సరము. మార్గశిర-ఫాల్గునములు. } సంచిక ౫-౬

ఓం.

కీర్తిశేషులైన బ్రహ్మశ్రీ ఓలేటి వేంకట రామశాస్త్రులవారు పండితకవిపుంగవులైన సత్పురుషులు. వీరు సరసకవిత్వలక్షణవిచక్ష ణులైన సుప్రసిద్ధమహాకవిశేఖరులు. సంస్కృతాంధ్రములయం దఖండి పండితులు. సతతము భాషాసేవ సేయుచుండిన కవివతంసులు. వీరు స్వర్గస్థులగుటచే మనసారస్వతమునకుఁ దీరని కొఱఁత ప్రాప్తమయ్యె తెనుఁగు వాఙ్మయమునం దభిమానము గలవారలలో నీ కవివరేణ్యుని మరణమునకై వగవని వారుం డరుదనుటకు సందియము లేదు. విశేష శేముషీవిభవాభిశోభితులైన యీవిద్వత్కవివర్యులు వినయవినమితాం గులై మెలంగిరి. నిష్కల్మషహృదయులు. సత్యవచస్కులు. పరోపకార పరాయణులు. భగవద్భక్తులు. సకలసద్గుణముల కాలవాలమైన యీ యార్యవర్యు లత్యుత్తమచరిత్రులు. సుజనస్తుతిపాత్రులు. బ్రహ్మశ్రీ వేంకటరత్నమహాశయులచే సౌజన్యమున మిన్నగ నెన్నఁబడి మన్ననఁగన్న ధన్యులు. ఇటువంటి మిత్త్రరత్నము నన్ను విచారసాగరమున ముంచి యమరపురి కరిగె. పరమేశ్వరుఁడు వీరియాత్మకు శాంతి నొసంగుఁగాత

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

శ్రీ రాజారావు వేంకట కుమార మహీపతి
సూర్యారావు బహద్దరు.
(శ్రీ పీఠాపురము మహారాజావారు

కీ॥ శే॥ గిడుగు రామమూర్తి పంతులుగారు

రావుసాహెబు, కళాప్రపూర్ణేతి బిరుదాంకితులగు గిడుగు రామమూర్తి పంతులుగారీనడుమఁ గాలధర్మము నొందిరని తెలుపవలసివచ్చినందుల కెంతయు వగచుచున్నారము. పంతులుగారు గంజాము మండలములోని పర్లాకిమిడి నివాసులు. అక్కడి కళాశాలలోఁ జిరకాల ముపాధ్యాయులుగానుండి, ఆపనినుండి విరమించినపిదప భాషావిషయమై అధికముగాఁ బరిశ్రమ చేయుచుండిరి. ఆంధ్రభాషయందును, ఆంధ్రవాఙ్మయమునందును వీరికి మంచి ప్రవేశము కలదు. వీరికిఁగల పాండిత్యము గ్రంథరచనమందు వినియోగించినచోఁ బెక్కుగ్రంథములు రచియింపఁ గలిగియుందురు. అట్లుచేయక శాబ్దికవిచారమే ముఖ్యముచేసికొని దానియందే కాలముగడిపివేసిరి. రమారమి ముప్పది సంవత్సరములక్రిందట అనఁగా, ఈపరిషత్తు ప్రతిష్ఠాపితమైన కాలములో వీరును, వీరిమిత్రులు మఱియిద్దరును చేరి గ్రంథస్థమైయున్న యాంధ్రభాష మిక్కిలి ప్రాచీనమగుటచే నేటివారికి దుర్గ్రాహ్యమనియు, యిఁకముందు గ్రంథరచనము అక్షరాస్యులు సంభాషణమందు వాడుచున్న వ్యావహారిక భాషయందే జరుపవలెననియు నొకవాదమును బ్రతిపాదించి దానిని స్థిరపఱుచుటకే యావజ్జీవము పాటుపడిరి.

ఆవిషయములో వీరికిని పరిషత్తువారికిని మతభేదము అత్యధికముగా నుండెను. పంతులుగారికిఁ గార్యదీక్ష యధికము. పట్టినపట్టు విడుమట వారెఱుఁగరు. ఎవరేమనుకొన్నను సరే యని వారివాదమును వారు ప్రకటించుచునే యుండెడివారు. మొత్తముమీఁద వారిశక్తి చాలవఱకు దీనిక్రిందనే వినియోగపఱచిరని చెప్పవచ్చును.

ఇటీవల 'బాలకవిశరణ్య' మను నొకచిన్ని గ్రంథమును రచించి ప్రకటించిరి. దానివలన గ్రంథరచనయందుఁ బ్రయోగించు శబ్దములకుఁ గేవల వ్యవహారప్రమాణము చాలదనియు, పూర్వకవి గ్రంథప్రయో

గము లావశ్యకములనియుఁ దేలుచున్నది. దీనివలనఁ బంతులుగారు
పూర్వవాదమును గొంతవఱకు మార్చుకొనినట్లు స్పష్టపడుచు
కాని పీఠగ్రహించిన పాఠములలోఁ బెక్కులు ప్రమాణములుగా గ్ర
పఁదగినవి కావు.

రామమూర్తి పంతులుగారు సవరభాషకు నిఘంటు వొకటి
చినారు. వాఙ్మయముమాట యటుంచి లిపియేనియు లేక బహుము
లుగా నున్న యీ యాటవిక భాషలోని శబ్దముల స్వరూపమును
మును నిర్ణయించుట కడుదుష్కరమైనకార్యము. ఈ గ్రంథము
గుణదోషముల నిర్ణయించుటకు నాకధికారము లేదు. గుణదోష
ట్లున్నను యీ యుద్యమమే మిక్కిలి ప్రశంస్యము.

గ్రామ్య గ్రాంథిక భాషావిషయమైన వాదములలో నే
రామమూర్తి పంతులుగారును అన్యోన్య ప్రత్యర్థులముగా నుంటి
తక్కినవిషయములలో మాకు మైత్రి యధికముగా నుండెడిది.

పంతులుగారి యాత్మ శాశ్వతసుఖమును బొందుఁగాక.

జ. రా.

కీ. శే. పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారు.

పీఠికాపురాస్థానకవిశేఖరులును, అనేకాంధ్రనాటకకర్తలు,
ర్యకాగ్రేసరులు నగు మహారాజశ్రీ పానుగంటి లక్ష్మీనరసింహ
పంతులుగారు తే 1-1-40 దిని యశశ్శేషులయినారని తెలుసి
పరిషత్తెంతయుఁ జింతిల్లుచున్నది.

పంతులుగారు చిరకాలమునుండి పరిషద్గౌరవసభ్యులై
చియు, 1922 సం॥నఁ బీఠికాపురమున జరిగిన యాంధ్రసాహిత్య
దేశాదశ వార్షికోత్సవమున కధ్యక్షపదవి నలంకరించియుఁ
కింతేని యభ్యుదయ మొనఁగూర్చినారు. ఆవార్షికోత్సవ సంద

వీరలోనఁగిన యథార్థోపన్యాసము నేఁటికిని నిత్యనూతనమై యలరారుచున్నయది.

సాక్షిసంపుటములు వ్యాపించినంతవఱకు శ్రీ పంతులుగారి నెఱుఁగని యాంధ్రు లుండరని యనవచ్చును. అచ్చొత్తింపఁబడిన యీసాక్షి సంపుటము లాఱు. వీనిలోఁ బంతులుగారు హాస్యయుతముగ సాంఘిక దురాచారములను దెలుపుచు, వానిని సవరించుకొను మార్గములను బాగుగఁ బ్రదర్శించియున్నారు. ఈగ్రంథములఁ జదువుచుఁ గడుపుబ్బ నవ్వని వారుండరు. ఈరీతిగనే, సాంఘికాచారములను, అందలి గుణదోషములను దెలుపుకథలను ఆఖ్యాయికలను హిందీభాషలో రచియించిన 'ప్రేమచంద్' అను నాతఁడు 'ఉపన్యాససమ్రాట్' అను బిరుదము నందినాఁడు. ఆంధ్రదేశమునం దుండుటచే వీరికట్టి బిరుదము లభింపలేదు.

పంతులుగారు పీఠికాపురాస్థానమున నాటకరచయితలుగాఁ బ్రవేశించి రచియించిన నాటకము లమూల్యములు. వీరు రచియించిన నాటకము లించుమించుగ ముప్పదిగలవు. ఇందిరువదియాఱు ముద్రితములైనవి. అముద్రితములింకను నాలుగుగలవు. సాక్షిసంపుటములందలి యుపన్యాసములకంటె నీనాటకములయందే పంతులుగారి ప్రతిభావిశేషము, కల్పనాపాటవమును బ్రకటితములగుచున్నవి.

ఈనాటకములలో 'కల్యాణరాఘవము' 'పట్టభంగరాఘవము' 'వనవాసరాఘవము' 'విజయరాఘవము' 'రాధాకృష్ణ' 'సారంగధర' 'సరోజిని' 'నర్మదాపురుకుత్సీయము' 'విప్రనారాయణ' మున్నగునవి పౌరాణికములు. కథాభాగము పురాణాదులనుండి సేకరించినను స్వతంత్రభావములతో నీనాటకముల నలంకరించినారు. 'ప్రచండచాణక్యము' 'చూడామణి' మున్నగునవి చరిత్రాత్మకములు. 'కోకిల' 'సరస్వతి' 'వృద్ధవివాహము' 'మాలతీమాల' 'రాతిస్తంభము' మున్నగునవి కల్పితనాటకములు. వీనియందు హాస్యరసము బాగుగ వెలయుచున్నది.

ఈనాటకముల కన్నిటికి 'కంఠాభరణము' కంఠాభరణమే. 'బు
బోధసుధ' యను నాటకము బౌద్ధమతమున వీరికిఁగల భక్తితాత్పర్యము
స్ఫుటీకరించుచున్నది. ఆయుర్వేద మన వీరికాదరాభిమానములు మెండు
'సాక్షి' ఉపన్యాసములలో నీవిషయమును బలుతావుల నుగ్గడించుట
యేగాక, 'అభినవచికిత్సారత్నాకరము' మున్నగు గ్రంథములకు వీర
పీఠికలు వ్రాసిరి.

మఱియు 'కథాలహరి' 'హాస్యవల్లరి' మున్నగు చిన్ని చిన్
యుపన్యాసములఁ గూడఁ బంతులుగారు రచియించి యాంధ్రలోకమ
నకు మహోపకృతి నొనరించియున్నారు. ఈనాటకరాజములన్నియు
పీఠికాపుర మహాప్రభువులకు, వారికుటుంబమునకు నభ్యుదయమును గో
అభ్యుదయసమయములఁ బంతులుగారు రచియించినారని పీఠికాభా
ముల నటనటఁ దెలుపుచు వచ్చిరి. వీరు రచియించిన నాటకముల కన్నిటి
కూచి నరసింహము పంతులుగారు నాందీప్రస్తావనలను వ్రాయుట యా
వాటుగవచ్చినది. పంతులుగారు తమగ్రంథములన్నిటియందు సర్వజన
మోదదాయకమగు గ్రాంథికభాషాశైలినే రచనలసాగించిరి. పద్యముల
గూడ వచనమురీతిని సుబోధముగ నడపించుట వీరలకభిమతము. 'స్వప్న
ననూయ' మున్నగు గ్రంథరాజములకుఁ బీఠికలు రచియించి పంతుల
గారు తమయసాధారణవిమర్శనపాటవమును దెలిపియే యున్నార

వీరు సారస్వతమున నేగాక వ్యవహారనిర్వహణమునందును గడ
జెద్దలు కొంతకాలము ఆనెగొంది యాస్థానమునను, కొంతకాలవ
ఉర్లాము సంస్థానమునను, మఱికొంతకాలము లక్ష్మీనరసాపురము చల్లా
మ్మారావుగారి యాస్థానమునను మంత్రిపదవుల నలంకరించి కడుదక్షత
రాజకీయవ్యవహారములఁ గొనసాగించిరి. పిమ్మట శ్రీ సూర్యరాయ ప్ర
వర్యుల కరుణాకటాక్షపాత్రులై, వారివలన గౌరవవేతనమునందుచు సా
స్వతచర్చలకే తమజీవితసర్వస్వమును ధారవోసి ధన్యతను బడసినా

ఇట్టివీరల నిర్యాణము ఆంధ్రసారస్వతమునకుఁ దీఱనికొఱఁత నాపాదించినది. భౌతికదేహమును వీడుసరికి వీరలవయస్సు 75 వత్సరములు. వీరల యాత్మకు భగవంతుఁడు శాంతినొడఁగూర్చుఁగాక.

ఓంతత్సత్

పానుగంటి లక్ష్మీనరసింహరాయకవిస్మృతి.

దాసరి లక్ష్మణకవిగారు.

సీ. అభిరూపభూయిష్ఠమగు సత్పవిత్రఁ గాళి
దాసుఁడీతఁడనంగఁ దనరినాఁడు
హాస్యప్రధాన కావ్యచణుండగుచు సర్వ
జనుల కుత్సాహంబొసంగినాఁడు
సాక్షిరూపమున వ్యాసము లెన్నొ రచియించి
యాంధ్రావనిని యశం బందినాఁడు
పలుకుపల్లునకు స్తబ్ధులఁ జేయఁగల మహో
పన్యాసకుండయి వఱలినాఁడు
గీ. పానుగంటివంశభవుఁడు ప్రథితయశుఁడు
ఆర్యనుతుఁడు లక్ష్మీనృసింహకవివరుఁడు
అవనివీడి దివంబున కరిగినాఁడు
అకట! మనదేశజుల యభాగ్యమున నేఁడు.
క. పుట్టినవారలలోనే
తట్టున లేఁడిట్టి కోవిదప్రవరుఁ డికం
బుట్టఁగఁ బోవం డెప్పటి
కిట్టిఁడు సముఁ డితని కితఁడె పృథివీస్థలిలోన్.
గీ. అమలగుణుఁడు శ్రీవత్సవాయకవిరాజు
మొన్న నేగాదె చనె స్వర్గపురికిఁ ? బిదపఁ

జర్ల నారాయణగురుండుఁ జనియెనటకె.
చనియె మొనమొన్న నే వారిజాడఁబట్టి
శతవధానవిధాన విచక్షణుండుఁ
పిఠకాపురాస్థాన కవిప్రభుండు
శ్రీ మదోలేటి వేంకటరామగురుఁడు.
వీరియెడఁబాటునకె మేము వెత మునుంగ
నింతలోనె నీవేఁగు టేటి న్యాయ
మయ్య? లక్ష్మీనృసింహరాయకవివర్య !.

ఉ. ఏగతి రాగభోగముల నెల్లఁ ద్యజించి సురేంద్రుపీఠికి
వేఁగితి వింతలోనె,? నిను నేకరణిన్ మఱవంగనేర్తు మే
మేగతి నింక నీరచన లేర్పడఁ గాంచెద మెప్పు డట్టి బా
గోగులు జెందఁగావలయునో యెఱుఁగన్ వశమౌనె యేరికిన్ ?.

ఆ. వె. ఎంతపరితపింప నేమిలాభము, దైవ
కృత మి దిట్టు లుండె నింక నీవు
గురుగణంబుతోడఁ గోర్కెమీఱఁగ స్వర్గ
మెనయుమయ్య సత్కవీంద్ర సతము.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

మిత్రస్మృతి.

(శతావధాని కావ్యకలానిధి చిదంబర శాస్త్రిగారు)

ఉ. చంద్రికవోలె నల్దెసలఁ జాయలువాఱెను నీయశంబు భూ
మీంద్రుని నెమ్మనమ్మునకు నెక్కెటి వేమి కొఱంత గల్గి నీ
వింద్రుని జూడ నేఁడు దివి కేఁగితి వేంకటరామశాస్త్రి యా
యింద్రుఁడు సూర్యరాయధరణీంద్రునికన్నఁ దలంప మిన్నయే.

ఉ. ధీయుతుఁడై సరస్వతికి దిద్దెను వన్నెలు నీగురుండు నా
రాయణశాస్త్రి నీ వలని కాతఁడు నీకును దోడునీడలై

పాయనియట్లు దేహములు వాసియుఁ బాయకయుండు రంచు మా
కీయెడఁ దెల్లమయ్యె సుకవీ దివి కిర్వురుఁ గూడి యేఁగుటన్.

కవిస్మృతి.

ఉ. మానితకీర్తిశాలి మతిమద్గణనీయుఁడు పానుగంటి ల
క్ష్మీనరసింహరావు దివికిన్ జనినాఁ డని విన్న నాఁడె యీ
మానవలోకమం దొకటమాత్రమె చాటక సూర్యరాయభూ
జాని గుణంబు లచ్చటను జాటుటకే చనె నంచు నెంచితిన్.

ఉ. చేసినవాఁ డనేకపరిశీలనముల్ బహులోకవేత్తయై
వ్రాసినవాఁడు గ్రంథములు వన్నెలుచిన్నెలు గుల్కునట్లు కై
సేసినవాఁడు భారతినిఁ జిత్రకథామణిమాలలన్ ధరం
బాసినవాఁడు నేఁడు మతిమంతుఁ డొకండు నృసింహుఁ డక్కటా!

స్మృతి.

(విద్వాన్ పిసుపాటి విశ్వేశ్వరశాస్త్రిగారు)

సీ॥ కల్పనాగరిమ చేఁ గడుపుబ్బనవ్వించు
సరయు నెవ్వానికంఠాభరణము
ఒకమాఱు చదివిన నకలంక లోకవి
జ్ఞానమ్ము నొసఁగు నెవ్వానిసాక్షి
పాత్రౌచితీ రమ్యభావపరంపరల్
ప్రకటించు నెవనినాటకచయంబు
బ్రహ్మఁ దిమ్మని దిమ్మ బ్రహ్మనిగాఁ జేయు
ననువరియెవ్వాని వ్యాసరచన,

గీ. ఆతఁ డాత్మీయసామర్థ్య మాంధ్రదేశ
మెల్లఁ గొనియాడ దానితోఁ దృప్తిపడక
త్రిదశ సంఘము మెప్పు లార్జింపఁ దలఁచి
యరిగె లక్ష్మీనృసింహరాయండు దివికి.

కావ్యాలంకారచూడామణి.

కొన్ని పాఠభేదములు.

వ్యాకరణ విద్యాప్రవీణ —చిలుకూరి పాపయ్యశాస్త్రి

ఆంధ్రసాహిత్యపరిషత్పుస్తక భాండాగారమున సుమారు 4600 తాటియాకుప్రతులు గలవు. ఈప్రతులలోఁగొన్ని తెలుఁగు గ్రంథములు, మఱికొన్ని సంస్కృతగ్రంథములును. వీనిలో నేఁటికిని నముద్రితములు హెచ్చుగనున్నవి. వీనినన్నిటిని ముద్రింపుటకుఁ దగినధనము పరిషత్తునకుఁ జేకూరకపోవుటచేఁ గ్రమక్రమముగఁ గొలదిగ్రంథములు మాత్రమే ముంద్రిపఁబడినవి. నేఁటికి ముద్రితములైన గ్రంథములు యేఁబది. ఇంకను నముద్రితములు ప్రకటింపవలసినవి సుమారు రెండువేలుండును. ఇంతవఱకు ముద్రితములయిన గ్రంథములు పురాణములు నమూల్యములని పాఠకలోకమునకు విదితమే. ఈగ్రంథముల స్వరూపమును, నందలి విషయమును దెలుపుటకై పరిషత్తువారు 1931 వ సం॥ లో 'పరిషత్పుస్తకభాండాగారము' (Descriptive Catalogue)అను గ్రంథమును బ్రకటించినారు. తిరిగి యిప్పుడాగ్రంథమునకుఁ దరువాతిభాగమును బ్రకటింప నుద్యమించి, తొలుత లక్షణగ్రంథముల స్వరూపనిరూపణ మావశ్యకమనియెంచి, యాగ్రంథములఁ బరిశోధించుచుండ నముద్రితములు నమూల్యములునగు గ్రంథములు గోచరించుచువచ్చినవి. ఇందు, 1. లక్షణశిరోమణి (పొత్తపి వేంకటరమణకవి.) 2. లక్షణశిరోమణి (గణపవరపు వేంకటకవి.) 3. సకలలక్షణసారసంగ్రహము (రత్నాకరము గోపాలకవి.) 4. 'సుకవికర్ణామృత'మను 'సుకవికర్ణకఠోరము' (కొలూరి ఆంజనేయకవి.) 5. లక్షణమంజరి (నైషధము తిమ్మకవి.) 6. కవితాలక్షణసారము (రామయకవి.) 7. చిత్రబంధదర్పణము (నడిమింటి వేంకటకవి.) 8. లక్షణదీపిక (గౌరన) యును ప్రధానములు. *

---

* ఈగ్రంథరాజములందలి విశేషములఁగూర్చి యీసంచికలో నచ్చొత్తింపఁబడిన పరిషత్పుస్తకభాండాగారము 1-16. పుటలను జూడుఁడు.

ఇంతియగాక ముద్రితగ్రంథములందలి సందిగ్ధఘట్టములకుఁ బాఠభేదములను దెలుపుచు, ప్రక్షిప్తములను గవికల్పితములను నిర్ణయించుటకుఁ దగియున్న ప్రతులనేకములు గలవు. ఈలక్షణగ్రంథముల యుపయోగమునుగూర్చి రెండుమాటలిటఁ బొందుపఱుతును.

మానవల్లి రామకృష్ణకవిగారు నన్నెచోడుని కుమారసంభవమునకుఁ బీఠిక వ్రాయుచుఁ జేర్కొనిన 'అథర్వణచ్ఛందస్సు' అను గ్రంథము కలదని కొందఱు, లేదని మఱికొందఱును దెలుపుచున్నారు. కాని, పొత్తపి వేంకటరమణకవి లక్షణశిరోమణియందును, గౌరన లక్షణదీపికయందును, లింగమకుంట తిమ్మన సులక్షణసారమునను నీ ఛందస్సునందలి పద్యములుదాహృతములైనవి. ఇంతియగాదు, పద్యములలో మార్పేమియు లేదు. చూడుఁడు.

గీ. పర్వతములందు మేరువుభాతియగుచు
సర్వసురలందు శంకరుచందమునను
అడవిమృగములయందు సింహంబుకరణి
గణములం దెల్ల నగణంబె గరిమఁ దాల్చు.

పరిషత్పుస్తకభాండాగార సంఖ్య 1297 గల లక్షణశిరోమణియందును, సంఖ్య 3439 గల లిం॥ తి॥ సులక్షణసారమునను నథర్వణునిదని యీపద్య మొకేరీతిగ నుదాహరింపఁబడినది.

క. అనలానిలసంయోగం
బనుపమకీలాకలాపమగు వహ్నిభయం
బొనరించుఁ గర్తగృహమున
కనుమానము లేదు దీని నండ్రు కవీంద్రుల్.

ఈపద్యము సంఖ్య 1391 గల లక్షణదీపికయందును, పైసంఖ్యగల సులక్షణసారమునను నొకతీఱుననే యున్నది. ఇట్లు మూఁడిట నొకేరీతిగనున్న యనేకపద్యములున్నను గ్రంథవిస్తరభీతిచేనిటఁ జూపమానితిని.

దీనింబట్టి చూడ, వేఱ్వేఱుకాలములలో రచియింపఁబడి, వేఱు వేఱు ప్రాంతములనుండి వచ్చిన విభిన్నగ్రంథములలోఁ బేర్కొనఁబడి, విషయతౌల్యముతోఁ గూడిన యథర్వణచ్ఛందస్సు లేదనుటకంటె, నింతకు ముందొకప్పు డితరలక్షణగ్రంథములవలెఁ బ్రసిద్ధిఁబొంది క్రమముగఁ గాలగర్భమున నణఁగినదనుటయే యుక్తమని తోఁచును.

ఇటులనే యీ లక్షణశిరోమణి మున్నగు గ్రంథములం దాకాలమునకుఁ బ్రచారమునందున్న లాక్షణికులనందఱిఁ బేర్కొని, తత్తల్లక్షణములు పరిగ్రహింపఁబడినవి. వీనియం దుదాహృతములైన భీమనఛందస్సు, అనంతుని ఛందస్సు, లక్షణసారసంగ్రహము మున్నగు గ్రంథములందలి పద్యములను బరిశీలించినచోఁ బ్రక్షిప్తపద్యములు లక్షణగ్రంథములందున్నవేమో యనుశంక తొలఁగుటయేగాక, ప్రసిద్ధలాక్షణికులు సేకరించిన యీలక్షణములు ప్రమాణములే కావచ్చు నను ప్రత్యయముగూడఁ గల్గును.

ఇది యిటుండ, సులక్షణసారము వెల్లంకి తాతంభట్టు రచియించినాఁడని కొందఱును, లింగమకుంట తిమ్మన రచియించినాఁడని మఱి కొందఱును వివదించుచున్నారు. తాటియాకుప్రతులఁ దడవినచో నీసంశయము కొంతవఱకుఁ దీఱునని నానమ్మకము. 'సులక్షణసార'మను పేర నచ్చొత్తింపఁబడి నేఁడు ప్రచారములోనున్న ప్రతిలోఁగాని, దానిం బోలు నాఱు లిఖితప్రతులలోఁగాని యెచ్చటను కవిపేరు కానరాదు. లింగమకుంట తిమ్మన రచియించినాఁడని తెలుపుకృత్యాదిపద్యభాగముతోఁ గూడిన ప్రతియొకటియు, దానితోఁ దుల్యరూపముగల సులక్షణసారపుఁబ్రతులు మఱి రెండును పరిషత్తునందుఁగలవు. ఇందలి విషయమునకు, ముద్రిత సులక్షణసారమునందలి విషయమునకుఁ బోలికయే లేదు. వీనింబట్టిచూడ లింగమకుంట తిమ్మనయే సులక్షణసారము రచియించినాఁడనుట నిశ్చయము.

మఱియు కందుకూరి వీరేశలింగముపంతులుగారు లిం॥ తిమ్మన సులక్షణసారమును రచియించినాఁడని తెలుపుచుఁ జేర్చొనిన; కవిసర్ప గారుడము, శ్రీధరచ్ఛందస్సు, ఉత్తమగండచ్ఛందస్సు మున్నగునవి యీ మూఁడు ప్రతులందును జేర్చొనఁబడినవి. మఱియు వారు నిరూపించిన కృత్యాదిపద్యములు నిందలిపద్యములును సరిపడియే యున్నవి. చూడుఁడు.

సీ. శ్రీవైష్ణవహితుండఁ జిక్కాయభట్టరు
శిష్యుఁడఁ గవితావిశేషశేష
తులితసర్వార్యపౌత్రుఁడ లక్ష్మణయకుఁ దిమ్మాంబకు సుతుఁడఁ బెద్దనకుఁ మాచ
నకు రామకవివరునకు ననుజన్ముఁడ
నా రామకవి చెప్పినట్టి మహిత
మత్స్యపురాణ వామనపురాణాది
సత్కవితలకెల్ల లేఖకుఁడ వృద్ధ
గీ. కండికాతీర లింగమకుంటనామ
పట్టణస్థితికుండ సౌభాగ్యయుతుఁడ
నాదిశాఖాప్రవర్తన నమరువాఁడఁ
గాశ్యపసగోత్రుఁడను దిమ్మకవిని నేను.

క. లక్షణశాస్త్రములెల్లఁ
బరీక్షించుటఁ గొంతకొంత యెఱిఁగినవాఁడన్
లాక్షణికానుగ్రహత సు
లక్షణసారం బొనర్తు లక్ష్యము లమరన్.

మఱియు తాతంభట్టు రచియించినది కావ్యచింతామణియే యనుటకును నాధారముగలదు, ప్రా. వెం. లక్షణశిరోమణి, లిం॥ తి॥ సులక్షణసారము మున్నగువానిలో తాతంభట్టును జేర్చొని యాతనిపద్యముల నుదాహరించినారు. ఆపద్యములన్నియుఁ గవిచింతామణిలోనే యగ

పడుచున్నవిగాని ముద్రితసులక్షణసారమునఁ గాని, దానింబోలు లిఖిత ప్రతులలోఁగాని కానరావు. కవిచింతామణిలోఁ గృత్యాదిని, ఆశ్వా సాంతగద్యములలోఁ గూడ తాతంభట్టు రచియించినాఁడనుటకుఁ దగిన పద్యములు గద్యములు గానవచ్చుచున్నవి

ఇట్టియమూల్యములగు నంశములతో నిండిన యీలక్షణగ్రంథ ములను ధనికులై సారస్వతాభిరుచిగల యుదారులెవ్వరేని ప్రకటించి ప్రచారమునకుఁ దెచ్చుటకై పరిషత్తునకు సహాయమునొసఁగినచో నిట్టి యనేకసంశయములు తొలఁగుటయేగాక యాంధ్రభాషకొక నూతన వికాస మేర్పడుననుట నిశ్చయము.

ఇది యిటుండ నీతాటియాకుప్రతులయందలి పాఠభేదములు ముద్రిత గ్రంథపరిశోధకుల ప్రమాదములఁదెల్పుచు లక్షణలక్ష్యతాత్పర్యనిర్ణ యమున కెంతేని సహకారులగు ననిగూడఁ దెలుపవలసియున్నది. ఈ పరిశోధనఁ జేయుచుండగనే నాదృష్టి కావ్యాలంకారచూడామణిపైఁ బ్రసరించినది. కావ్యాలంకారచూడామణి వ్రాఁతప్రతులు పరిషత్కార్యా లయమున మూఁడుగలవు. వీనిలో నొకటి 75, రెండవది 871, మూఁడ వది 3826 సంఖ్యలుగలవై యున్నవి. ఈమూఁడు వేర్వేరు జిల్లాలనుండి తేఁబడినవియే. పాఠభేదములఁ దెలుపునపుడు క్రమముగ వీనిని 'క' 'గ' 'చ' యని వ్యవహరింతును.

కావ్యాలంకారచూడామణి యను నీలక్షణగ్రంథమును రచి యించినవాఁడు విన్నకోట పెద్దనకవి. ఈగ్రంథరాజము చాలకాలము వఱకు ముద్రణభాగ్యమునందకయే కాలగర్భమున నణఁగియుండి, తు దకు వేదము వేంకటరాయశాస్త్రిగారి దృక్పథమునఁబడి యాంధ్రలోక మున కనుపాటులోనికి వచ్చినది. ప్రథమమున నీగ్రంథమం దేడాశ్వా సములు మాత్రమే శ్రీ శాస్త్రులవారు తమ జ్యోతిష్మతీముద్రాక్షర శాలయందుఁ బ్రకటించినారు. పిమ్మట నాంధ్రసాహిత్యపరిషత్తువారీ గ్రంథమందలి యెనిమిది తొమ్మిదవ యాశ్వాసములను బ్రత్యేకముగ

1920 సం॥న ప్రకటించినారు. మద్రాసు విశ్వవిద్యాలయమువారు, ఆంధ్రవిశ్వవిద్యాలయమువారును 'విద్వాన్' మున్నగుపరీక్షలకీ గ్రంథమును బాఠ్యముగా నిర్ణయించుటచేతను, ఇందుఁజారిత్రాంశములు హెచ్చుగనుండుటచే విమర్శకుల కత్యంతోపయోగి యగుటం జేసియు నేఁటికి దీనిని నాలుగుమాఱులు ముద్రింప నవకాశము గల్గినది. వీనిలోఁ బ్రథమముద్రణము 1893 వ సం॥నను ద్వితీయముద్రణము 1909 వ సం॥నను, ... చతుర్థముద్రణము 1938 వ సం॥నను జరిగినవి. నాల్గుముద్రణములందును 'మ్రుక్కికి మ్రుక్కి' యనే యున్నవిగాని పాఠములం దెచ్చటను మార్పుగానరాదు. తొలుత నీ యేడాశ్వాసముల గ్రంథమును బరిష్కరించి ప్రకటించిన వేదము వేంకటరాయశాస్త్రిగారి పాండిత్యవిశేషమాంధ్రలోకమునం దెల్లెడలఁ బ్రసిద్ధమే. వీరలు రచియించిన గ్రంథరాజములు, పరిష్కరించి యాంధ్రవివరణముతోపాటు ప్రచురించిన గ్రంథములును సర్వథా నిర్దుష్టములు నిరుపమానములును శాస్త్రులవారు పరిష్కరించిన గ్రంథమునందలి దోసఁగులెంచుట నాపనిగాదు. అద్దానికి నేను సమర్థుఁడనుగాను. కాని, ముద్రితమైన కావ్యాలంకారచూడామణిలోఁ బలుతావులందలి పద్యములు లక్ష్యలక్షణవిరుద్ధములుగ నుండుటం జేసి, యివి యిన్నియుఁ గవిలోపములేనా? లేక యిందేవేని పాఠభేదము లుండునా? యను సందేహముతోఁ బైమూఁడుప్రతులను దీసి పరిశీలించితిని. వీనిలోఁ బెక్కుతావుల నొకేరీతిగ భిన్నమైన పాఠములుండుటను, ఆపాఠములకు ముద్రితగ్రంథమునందలి పాఠములకు విక్కిలి భేదము పొడసూపుటవలనను, పరిశీలించినచో వ్రాఁతప్రతులందలి పాఠములే రమ్యములని తోఁచుటవలనను వానిని గొన్నింటి నిటఁ బ్రకటింపఁగడఁగితిని.

1

క. రస మాకోప్యంబగుటన్

బొసఁగదు నాట్యములయందుఁ బొల్పగుఁ దత్త

ప్రసర స్మరణము చేతఁ
నెనసామాజికుల యందు వేడ్కకు నెలవై.

కా. చూ. ౨ ఉ. ౭ ప

"రస మాకావ్యము గాన నాట్యములయం దా రస ముండ నేరదు." అని యీపద్యపూర్వార్థమునకు భావము. ఇట 'నాట్యములందు' అను చోట వ్రాఁతప్రతులు మూఁడింటిలోను 'నర్తకుల యందు' అని కలదు. దీని కవ్యవహితపూర్వమునం దున్నపద్యసందర్భమును బట్టి యీపాఠ మే యుక్తమని తోఁచును. చూడుఁడు.

"ప్రౌఢులకుఁ గావ్యములయందుఁ బొందు రసము
ద్రష్టలకు నాట్యములయందుఁ దనరు రసము ... ..."

సాహిత్యరత్నాకరము. "అష్టావేవ రసా నాట్యేష్వితి కేచిదచూచుదన్."

రసగంగాధరము. పుట. ౩౦

ఆలంకారికసిద్ధాంతమిట్లు ప్రసిద్ధముగనుండ 'పొసఁగదు నాట్యములయందు రసము' అనుట పొసఁగు టెట్లు ?

అదియుఁగాక కవియిటఁ జెప్పఁబూనినది "రసము నటాశ్రయము కాదు. ఆనటుఁడు ప్రదర్శించు విభావాదులస్మరించుటచే సామాజికుల యందే యీరస ముండును." అనునదియే. చూడుఁడు. ప్రతాపరుద్రీయమున విద్యానాథుఁడు, రసము నాయకాశ్రయమని చెప్పి, పిమ్మట "అథవా మాలత్యాదిశబ్దైః మోహిన్మాత్రప్రతీతౌ, రావణాదిశబ్దైశ్చ శత్రుమాత్రప్రతీతౌ, స్మృత్యారూఢేన తత్తద్వ్యపదిష్టవిశేషేణానుకార్యేణ సామాజికాశ్రయత్వమపి న విరుద్ధమ్... ...నటస్యానుకరణమాత్రపరతయా నైవ రసాశ్రయయోగ్యతా. అనుభావాదీనాం ప్రకాశనం శిక్షాభ్యాసపాటవేనైవ ఘటతే."

ప్రతా. రసప్ర. ౯౯.

అని రసము నటాశ్రయము కాదని వ్యాఖ్యానించియున్నాఁడు.

2

క. అసితంబగు రత్నాది
ప్రసరణచేఁ దేజరిల్లి ప్రథమరసాదుల్
పొసఁగఁబడునెచట నదివో
రసవదలంకారమనఁగ రసికుల కెన్నఁ గ.

కా. చూ. ౧౮. ౧౯. ప.

ఇట మూఁడు ప్రతులలోను 'లసితంబగు రత్యాది' అని కలదు. ఈపాఠమే యుక్తము. ముద్రితపాఠ మనన్వితముగ నున్నది. ఏలయన, అసితరత్నప్రసారములకు శృంగారాదిరసములకు సంబంధమేమి ? ఇచటఁ గవి చెప్పఁబూనినది "విభావాదులచేఁ బరిపుష్టి నందిన రత్యాదిస్థాయి భావములచేఁ దేజరిల్లి శృంగారాదిరసము లెచ్చట సహృదయహృదయాహ్లాదకముగఁ బొసఁగఁబడునో యదియ రసవదలంకారము" అనునదియే.

మఱియు విన్నకోట పెద్దన, ఇందలి యలంకారలక్షణముల నన్నిటిని దండికావ్యాదర్శమునుండి సేకరించినాఁడు. అచ్చట లక్షణమీరీతినే యున్నది. చూడుఁడు.

"ప్రేయః ప్రియతరాఖ్యానమ్ రసవ ద్రసపేశలమ్.

కావ్యాద. ౨ ప. ౨౭౫ శ్లో.

"రసపేశలమ్=విభావాదిభిర్వ్యక్తః చిత్తవృత్తివిశేషః రత్యాది రూపఃస్థాయిభావః రసః తేన పేశలం సహృదయహృదయాహ్లాదకత్వం యత్ తత్ రసవదలంకారః"

కావ్యాదర్శవ్యాఖ్య. కుసుమప్రతిమ. 211 పుట.

ఇచటఁ దాటియాకుప్రతిలో సంయుక్తవర్ణమగు 'స' కు, 'య' కుభేదము గుర్తింప ననువు కాకపోవుటచే నచ్చులో 'రత్నాది' యని పడియుండెనేమో యనిపించుచున్నది. ఇటులనే 'ల' కు మాఱుగా 'అ' కూడ ముద్రింపఁబడి యుండవచ్చును.

(సశేషము.)

రవీంద్రుఁడు.

కొమాండూరి శఠకోపాచార్యులుగారు.

ఆధునిక కవిసార్వభౌముఁడు రవీంద్రనాథుఁడు 1861 లో కలకత్తా లో జనించెను. వీరివంశము సుప్రతిష్ఠితము. వీరిపూర్వికులు రాఢాకృష్ణ శాఖకుఁజెందిన పశ్చిమవంగీయబ్రాహ్మణులు.వీరిది "ఠాకూరు" (=మాన్య) వంశము. పూర్వమునుండియు వారిలోఁజాలమంది విద్వాంసులు; కొందఱు రాజకీయ సాంఘికాదిరంగములయందుఁ బ్రముఖులైరి; సర్ ప్రద్యోతకుమార ఠాకూరు మున్నగు కొందఱకుఁ బెద్దజమీందారీలున్నవి. రవీంద్రుని పితామహుఁడు ద్వారకనాథఠాకూరు గొప్పవ్యాపారము చేయుచు, ఆర్థికసాంఘికరంగములఁ గృషిఁజేయుచు, రాజా రామమోహనరాయలకు మిత్రుఁడును, ఆయనస్థాపించిన బ్రాహ్మసమాజమునకుఁ గార్యదర్శియునై యుండెను. వారికుమారుఁడు దేవేంద్రనాథుఁడు గొప్ప విద్వాంసుఁడు, మహాభక్తుఁడు, రామమోహనరాయలకు సహకారియై, తరువాత నాదిబ్రహ్మసమాజమునకు నాయకుఁడయ్యెను; వేదవాఙ్మయమంతయు బండితుఁడై, పవిత్రజీవనుఁడై, "మహర్షి" యని ప్రసిద్ధిచెందెను; వంగభాషలో "తత్వబోధిని" యను ధార్మికపత్రికను నడపెను. లక్ష్మీసరస్వతు లత్తకోడండ్రతత్వముతో మైత్రిలేనివారై, ఉభయులు నొకేయెడ నుండరని ప్రతీతి. మనదేశమున విద్యావంతులు శ్రీమంతులై యుండుట యరుదే. కాని ఠాకూరు కుటుంబమునకు మాత్రము లక్ష్మీసరస్వతు లుభయులు ప్రసన్నులైరి. ఈ వంశమున శౌరీంద్రమోహనుఁడు గొప్ప సంగీతవిద్వాంసుఁడు, స్థితిమంతుఁడు.

దేవేంద్రనాథుని సంతతివారందఱును విఖ్యాతులు, ప్రతిభావంతులు నైరి. వారిలో జ్యేష్ఠుఁడు ద్విజేంద్రనాథుఁడు గొప్పతత్వవేత్త; బంగాళీభాషలో నాతఁడు రచించిన "స్వప్నయాత్ర" యను పద్యకావ్య

మత్యుత్తమమగు నాధ్యాత్మికగ్రంథము. వంగవాఙ్మయమం దది యొక రత్నము. రెండవకుమారుఁడు సత్యేంద్రనాథుఁడు స్వభాషలో మంచి రచనలఁ జేయుటే కాక, ఐ.సి.ఎస్. పరీక్షలోఁ గృతార్థులైన భారతీయుల మొదటిజట్టులో నొకఁడై, తరువాత జిల్లాజడ్జియై, ఉన్నతోద్యోగముల నిర్వహించెను. నాల్గవపుత్త్రుఁడు జ్యోతీంద్రనాథుఁడు ధీమంతుఁడు, గొప్ప కళాభిజ్ఞుఁడు. విశ్వవిఖ్యాత చిత్రలేఖకులు, అవనీంద్ర, గగనేంద్రు లితని కుమారులే. దేవేంద్రుని యేడవకుమారుఁడగు రవీంద్రుఁడే కనిష్ఠుఁడు. ఠాకూరుకుటుంబమున స్త్రీపురుషు లెల్లరు విద్వాంసులు, ఉదారులు. దేవేంద్రునికుమార్తె స్వర్ణకుమారి యద్భుతమగు నవలల రచించెను.

రవీంద్రునికి బాల్యమందే తండ్రి, ఉపనిషత్తులు, భక్తిగీతములు నేర్పెను. కవులు, గాయకులు, చిత్రలేఖకులతో నిండిన వారియిల్లు కళామయము. ఈ సన్నివేశమున రవీంద్రుని సహజప్రతిభ క్రమముగ వికసించుచుండెను. అతఁడు బాల్యమునుండియు స్వతంత్రబుద్ధికలవాఁడు; అధికారుల పాఠశాలలలోని సంకుచితపద్ధతులకు లోఁబడలేకపోయెను. సర్కారుబడులలోని ప్రస్తుతకార్యక్రమము మనస్సును హృదయమును వికసింపఁజేయుటకు బదులు సంకుచితమొనరించుచున్నది. జ్ఞానాభిరుచి గల్గుటకు బదులు, విధిలేక నిర్బంధముగఁ జదువులే తఱుచుగఁ దట్టించుచున్నది. అట్టిపాఠశాలలోఁ జదువకున్నను, ఇంటనే యాప్యాయముగ విద్యనేర్చిన రవీంద్రుని మనోవికాసమున కెట్టినష్టమును గలుగలేదు. శైశవమునందే, అతనికి విద్యాభిరుచియుఁ గళాభిజ్ఞానమును గల్గినవి. అతఁడు గురువులకడ, ఇంటనే, సంస్కృతములోను, వంగభాషలోను గల ప్రాచీనమహాకావ్యములఁ జదివెను; మధుసూదనదత్తు, రమేశచంద్రుఁడు, బంకించంద్రుఁడు మున్నగు నవ్యులరచనలఁ గూడ నాసక్తితోఁ బఠించుచుండెను.

బాల్యముననే రవీంద్రుఁడు కవిత్వరచన లారంభించెను. అతని సోదరులును కుటుంబములోనివారును నాతనికిఁ దగుప్రోత్సాహమిచ్చు

చుండిరి. రవీంద్రునికిఁ బండ్రెండవయేట నుపనయనమాయెను. ధార్మికప్రవరుఁడగు దేవేంద్రుఁడు వెంటనే యాతనిని కలకత్తాకుఁ గొలఁదిదూరములో విశ్రాంతమైన బోల్పురమున సుందరారణ్యములనడుమఁ దాను స్థాపించిన శాంతినికేతనాశ్రమమునకుఁ దీసికొనిపోయి, అటనుండి హిమాలయగిరులకును గొంపోయెను. ఈ యద్రిరాజు ప్రకృతిశోభ యద్భుతము, విశ్వరూపుఁడగు నీశ్వరునిముఖ్యలీలారంగము; ఎందఱో మహర్షుల కాధ్యాత్మికరహస్యముల గోచరింపఁజేసిన దీ నగమే. పూర్వమహర్షుల కావాసమైన యీపర్వతస్థలమందు రవీంద్రునికి బాల్యమందే యీశ్వరమహత్త్వమును, ప్రకృతికళావిభవమును గోచరించినవి. అప్పటినుండియు రవీంద్రునకుఁ బ్రకృతిసౌందర్యమం దభిలాష వృద్ధియైనది.

రవీంద్రునితల్లి శారదాదేవియు గొప్పభక్తురాలు. ఆమె 1874 లోఁ జనిపోయెను. అప్పటికే రవీంద్రుఁడు చిల్లరపద్యముల వ్రాయుచుండెను. 1877 లో ద్విజేంద్రుఁడు "భారతి" యను మాసపత్రికను వంగభాషలోఁ బ్రచురింపఁదొడఁగెను. ఇంకఁ జాలమంది మహనీయులు చక్కని వ్యాసముల వ్రాయుచుండిరి. దానితోపాటు, "భానుసింహుని పదావళి" యను గీతములు నెలనెలకు వెలువడుచుండెను. ఇవి పూర్వకవుల గంభీరశైలి నొప్పుచు, మృదుమధురములై చక్కని భావము గల్గి భక్తిరస మొలుకుచు, ధ్వనిప్రధానములై యున్నవని, ఈ భానుసింహకవి వైష్ణవసంప్రదాయపుఁ బ్రాచీన కవిసత్తముఁడని, చాలమంది విద్యావంతు లభిప్రాయపడి, ఆ కవీశ్వరుని కాలనిర్ణయములఁగూర్చి చర్చించుచు, తగవుపడుచుండిరి. ఈ భానుసింహకవి యను పూర్వకవి కాఁడు, బాలకవియగు రవీంద్రుఁడని కొంతకాలమునకు వెల్లడియైనది. "భారతి" లోఁ జక్కని భావములుగల వ్యాసములును కొన్నిగ్రంథవిమర్శలను గూడ రవీంద్రుఁడు వ్రాయుచుండువాఁడు. బంకించంద్రుఁడు, మధుసూదనుఁడు మున్నగు మహాకవులరచనలఁగూడ నాతఁడు ధైర్యముతో స్వతంత్రవిమర్శలఁ జేయుచుండెను; "శైశవసంగీత" అను గీతము

గూడ నాకాలముననే ప్రకటించెను. 1878 లో నతఁ డింగ్లండునకు వెడలి, లండను విశ్వకళాశాలలోఁ గొన్ని నెలలు చదివెను; 1880 లో మాతృదేశమునకు మరలివచ్చెను. తరువాత "యూరప్ ప్రవేశేర్ పత్ర" (=యూరపుయాత్రలేఖలు) వ్రాసెను. అప్పుడే "భగ్నహృదయ," "సాయంసంగీత్," "ప్రభాతసంగీత్" మొదలగు పద్యగ్రంథములఁ బ్రచురించెను. వీనిలో శృంగారమేగాక, కొంతకరుణరసమును, గాన నగును. ఇరువదేండ్లప్రాయముననే రవీంద్రునకు వంగభాషలోని ముఖ్య కవులలో నొకఁడని పేరు గల్గెను. అప్పుడు ప్రసిద్ధోద్యోగియు, విద్వాంసుఁడు, గ్రంథకర్తయు నగు రమేశచంద్రునియింట నొతనిపుత్రిక వివాహము జరిగెను. అందుకు వంగవిద్వాంసులును కవులును విచ్చేసిరి. అచ్చట దత్తుగారు, బంకించంద్రుని "సాహిత్యసామ్రాట్"అని గౌరవించి, వారిని పుష్పమాలాలంకృతునిగఁ జేసిరి. బంకిము, వెంటనే దానిని దన మెడనుండి తీసి, ప్రక్కనున్న యువకుఁడగు రవీంద్రుని కంఠమం దలంకరించి, కవిసార్వభౌముఁడు కానున్నవాఁ డితఁడే యని యెల్లరయెదుట బహూకరించెను.

అప్పటికి మాతృభాషలు వెనుకఁబడి యుండెను. వాని వాఙ్మయాభివృద్ధికి శ్రద్ధవహించువారును, లేఖకులును, పరస్పరసహాయముతో సాహిత్యసేవ జరిగించుటకొక ప్రత్యేకసంఘ మేర్పడుట యవసరమని రవీంద్రుఁ డాకాలముందే కనిపెట్టెను. 1893 లో మఱికొందఱఁ గూర్చుకొని "వంగీయసాహిత్యపరిషత్తు"ను స్థాపింపఁజేసెను. కొంతకాలము దానికిఁ దానే కార్యదర్శిగ నుండెను. ఈ పరిషత్తు రవీంద్రాదుల కృషి వలన వృద్ధిఁజెంది, వంగవాఙ్మయము నేటి యున్నతదశకు వచ్చుటకుఁ దోడ్పడినది. కొన్నియేండ్లు గడచినతరువాత, ఆయాదర్శముతోఁ దక్షిణ మనదేశభాషలలోను 'సాహిత్యపరిషత్తు' లేర్పడినవి.

అప్పటికే, షెల్లీ, బ్రౌనింగ్‌సతి, విక్టర్‌హ్యూగో, మున్నగు పాశ్చాత్యకవుల గీతములను, భావరచనలను, రవీంద్రుఁడు వంగభాషలోని కనువదించెను. ఈలోఁగా నతనికిమఱల నాంగ్లదేశయాత్ర తగిలెను.

ఠాకూరులు స్థితివంతులగు భూస్వాములగుటచే రవీంద్రుని జీవనోపాధికి లోటులేదు. ఐనను ద్రవ్యార్జన ప్రయోజకతకు లక్షణము గౌరవముగల స్వతంత్రవృత్తియుండుట మంచిదని, సోదరు లాలోచించి (అప్పటి నవనాగరికతాధోరణిని) అతనిని బారిస్టరుపరీక్షకుఁ జదువుమ 1881 లో నింగ్లండునకుఁ బంపిరి. న్యాయవాదవృత్తియం దాతఁడు ప్రవ యుండు దుర్దశ దేశమునకుఁ దప్పిపోయినది. 'లాయరు' వృత్తియం దుత్సాహము లేక రవీంద్రుఁడు తిరిగి వెనుకకు వచ్చివేసెను. అప్పటి సాహిత్యసేవయే వృత్తిగఁ జేసికొను నలవాటు మనదేశమున లేదు కాని రవీంద్రుఁడు తన జీవిత మందులకే వినియోగింప నిశ్చయించెను

బాలురకును, పామరులకును సాహిత్యాభిరుచి గల్గించు చిన్న కథలను సులభమగు విజ్ఞానపుస్తకముల నతఁడు వంగభాషలో వ్రాసెను అవి ప్రజామోదమును బడసినవి. 1885 లో నతఁడు "బాలక్" అను మాసపత్రికను బ్రచురింప నారంభించెను. దీనిలోఁ జక్కని బాలవాఙ్మయము ప్రచురితమాయెను.

తరువాత ధార్మికవిషయముల గాఢచర్చనారంభించి, అందుకై "సాధన" యను క్రొత్తమాసపత్రికను 1891 నుండి రవీంద్రుఁడు స్వయముగఁ గొన్నియేండ్లు నడపెను. అటుపై రెండేండ్లు తనయన్న ద్విజేంద్రుఁడు స్థాపించిన 'భారతి' యను బెంగాలీపత్రికను, ఆపిమ్మట నైదేండ్లు బంకించంద్రుఁడు స్థాపించిన "వంగదర్శన్" పత్రికనుగూడ, రవీంద్రుఁడు సంపాదకుఁడుగ సాగించెను. ఆ పత్రికలలో నవ్యశైలిని పద్యములను, కథలను, విమర్శలను, సాంఘికవ్యాసములను, రాజకీయప్రసంగములను, నవలలను, నాటకములనుగూడఁ దానే వ్రాసి ప్రచురించుచుండెను.

ఇట్లుండఁగా 1902 లో రవీంద్రునిభార్య "మృణాళినీదేవి" మరణించెను. ఈవిపత్తు రవీంద్రునిహృదయములో శూలమును నాటెను. అంతవఱ కతఁడు శృంగారప్రధానమగు రచనలనే చాలవఱకు వ్రాయుచుండెను. 1902 నుండి రెండేండ్లవఱకు నాతనిరచనలలోఁ గరుణరసమే

ధానముగా నుండెను. "స్మరణ్" "నౌకాడూబీ" మొదలగు గ్రంథ ం లప్పటివే. రవీంద్రుఁడు మరల వివాహముచేసికొనక, తనశక్తినిఁగాల ను దేశమునకే పూర్తిగ వినియోగింపఁదొడఁగెను. అప్పటినుండి ంతకాల మాతఁడు సాంఘికరాజకీయములందుఁ బూర్తిగఁ బాల్గొనెను.

1904 లో వంగరాష్ట్రమును, కర్జనుప్రభువు ప్రభుత్వము రెండు ఁజీలఁదీసెను. ఆ "వంగభంగము" తమజాతీయజీవనమును భగ్నముచే యుననియెంచి, దానిని రద్దుచేయుంచుటకు వంగీయు లప్పుడు తీవ్రాం ళన మారంభించిరి. రవీంద్రనాథుఁ డప్పుడు ప్రజలలో జాతీయో త్సాహముగల్గించుటకుఁ దనలేఖిని నుపయోగించెను. వంగభాషలో తఁడిచ్చు నుపన్యాసములును, తాను రచించి పాడు జాతీయగీతము ను, జనుల నాకర్షించుచుండెను. జాతీయవిద్యాభివృద్ధికై రవీంద్రుఁ ప్పుడప్పుడు మహనీయవిద్యాధికులగుకొందఱసహాయముతో కలకత్తా జాతీయపరిషత్తను పెద్దకళాశాలను స్థాపింపఁజేసి, దాని నిర్వహణ నకై విశేషశ్రమపడెను. అప్పుడు బెంగాలులో జనించిన తీవ్రజాతీ భావము భారతదేశ మంతటను వ్యాపించెను. 1905 లో రవీంద్రుఁడు భాండార్" అను క్రొత్తమాసపత్రిక నారంభించి, అందులో జాతీయ ష్టితో, ఆర్థికరాజకీయసమస్యలను సమర్థతతోఁ జర్చించుచుండెను. ప్పు డారంభించిన స్వదేశీయుద్యమము ప్రజలలో వ్యాపించుటకు రవీం ునివ్యాసములును జాతీయగీతములును, వక్తృతయును జాలతోడ్పడి . కాని యిట్లాతఁడు తీవ్రమగుజాతీయప్రవాహమున నీఁదుచుండ, అం పాయకరమగు మొసలివచ్చునట్లు చూచి, దానిని వారింపఁబోయి, ల్లలవిగాక, శోకముతో హఠాత్తుగ గట్టుచేరెను. 1906 లో స్వదేశీ ుద్యమము తీవ్రమైనస్థితిలోనుండఁ గొందఱు బ్రిటిషువస్తుబహిష్కారము గించిరి. ఆప్రచారము ప్రజల నుద్రిక్తులుగఁ జేయుచుండెను. అది ంసాతత్వప్రయుక్తమని రవీంద్రుఁ డందుల కిష్టపడలేదు. ఇంతలోఁ న్నిచోట్ల బాంబుప్రయోగములు, హత్యాయత్నములు, బ్రిటిషు

వారిపైఁ దీవ్రద్వేషము, చూపఁదొడఁగిరి. ఈహింసాధోరణిలో హిం
వులకు ముస్లిములకు మధ్య విరోధములు పెఱిగి, సాంఘికమైత్రి
పోయెను. ఈహింసాతత్వము సంఘమంతటికిని హానికరమని రవీంద్రు
కనిపెట్టి, తనభావములను పత్రికలలోను, ఉపన్యాసములలోను దీ
ముగ వెల్లడిచేసెను. అంతవఱకు రవీంద్రుఁడు జనులకుఁ బ్రేమపాత్రు
యుండెను. 1907 లో మొదటివంగరాష్ట్రసాహిత్యసభ జరిగెను. ద
కిని 1908 లో పాబ్నాలో జరిగినరాష్ట్రీయరాజకీయమహాసభకును ర
ద్రనాథునే యధ్యక్షునిగ నెన్నుకొనిరి. ఇట్టిసభలన్నిటిలోను రవీంద్రు
సోదరవంగీయులతో "ఉద్రేకమును హింసాధోరణియు హానికరము
వీనికిఁ బ్రోత్సాహ మీయరాదు; అట్టివారి నట్టిధోరణినుండి మరలి
వలెను" అని గట్టిగ వాదించెను. అందుచే నప్పటివంగీయులల
జాలమంది తీవ్రకోపముతో రవీంద్రుని నిరసించిరి. రవీంద్రుఁ డంతటి
రాజకీయరంగమునుండి హఠాత్తుగఁ దప్పుకొనెను. అప్పటినుండియుఁ
జీవితము నాతఁడు సాహిత్యకృషికే వినియోగించుచున్నాఁడు

1909 లో రవీంద్రుఁడు గీతాంజలియను భక్తిరసప్రధానమగు
ములసంపుటిని బెంగాలీలోనే వ్రాసి ప్రచురించెను. వంగభాషాపరిచి
లందఱకును సాహితీగగనమునం దొక నవ్యజ్యోతిరుదయము విస్
మాయెను. రవీంద్రునకు భారతీయకవిసార్వభౌముఁడని ప్రఖ్యాతిగల్గెన
1911 లో వంగీయసాహిత్యపరిషత్తువారు ప్రత్యేకసన్మానమిచ్చి, పం
సభలో గౌరవించిరి. రవీంద్రుఁడు గర్వితుఁడు కాలేదు. స్వభాషా
యొకను హెచ్చినది. 1910—11 లో "జీవనస్మృతి"యను స్వీయ
త్రను వ్రాసెను. ఆధ్యాత్మికవిషయములందుఁ దనభావములఁ దెల్పుట
రవీంద్రుఁడు తనతండ్రి యిదివఱలో స్థాపించిన "తత్వబోధిని" పత్రిక
సంపాదకుఁడై, నాల్గేండ్లాపత్రికను స్వయముగ నడపెను. అప్పుడే బం
లీలోఁ గొన్నినాటకములఁగూడ వ్రాసి ప్రచురించెను. రవీంద్రుని
ములఁ గొన్నిటి నితరు లాంగ్లములోనికిఁ దర్జుమాచేసి మాడరన్ రివ్యూ

పత్త్రికలోఁ బ్రచురించిరి. అవి చాలమనోజ్ఞములు. అంతటఁ గొందఱు ప్రోత్సహింప రవీంద్రుఁడు స్వయముగఁ దనగీతములలోఁ గొన్నిటి నాంగ్లములోని కనువదించెను. వీనిమొదటిసంపుటియగు "గీతాంజలి" యద్భుతమని పాశ్చాత్యవిమర్శకులు మెచ్చుకొనిరి.

ఉదారాదర్శముతోఁగూడి, ప్రపంచమందలి యేభాషలోనైన వెలువడుసాహిత్యగ్రంథమునకు, ప్రపంచవిద్వాంసులసంఘము వారొక గొప్పపురస్కార మిచ్చుట గలదు. దీనినే 'నోబెలు' బహుమతి యందురు. ఇది 8000 బంగారుకాసులది. ఈబహుమతిపొందుట వాఙ్మయలోకములో ససమానగౌరవమనియు నెంతురు. అప్పటి కట్టిబహుమతి భారతీయులకే గాదు, ప్రాచ్యులెవ్వరికిని రాలేదు. 1913 లో "గీతాంజలి" కాబహుమతినిచ్చి, రవీంద్రుని గౌరవించిరి. బెంగాలీలోని గీతాంజలి, ఖేయ, నైవేద్య, అను (రవీంద్రుని) మూఁడుకావ్యములలోనుండితీసిన కొన్ని గీతములయనువాదసంపుటియే యింగ్లీషుగీతాంజలి. అంతటితో రవీంద్రునకు నాగరికదేశములన్నిటిలో విశేషఖ్యాతిగల్గెను. తనబెంగాలీయుద్గ్రంథముల మఱికొన్నిటి నాంగ్లములోని కనువదించుమనియు, విదేశములకు విచ్చేసి యుపన్యసింపుమనియు, నలుగడలనుండియు విద్వాంసులు విజ్ఞాపనసంస్థలును నాహ్వానించిరి. రవీంద్రుఁడు తనరచనలలోఁ గొన్నిటిని స్వయముగ ననువదించెను; కొన్నిటిని మిత్రు లాంగ్లీకరించిరి. ఐరోపానుండివచ్చిన యాహ్వాన మంగీకరించి, అచట సంచారముచేసి, అచటి విద్వాంసులవల్ల సన్మానముపొంది, యూరపులోని వాఙ్మయప్రవాహపు వివిధపోకడలను నవ్యధారలను బరిశీలించి, అందలివిశేషములను రవీంద్రుఁడు గ్రహించెను.

1919 లోఁ బ్రభుత్వమువారు రవీంద్రునకు "సర్" బిరుదమునిచ్చి సన్మానించిరి. కేవలవాఙ్మయసేవయే చేయువారి కట్టిబిరుదము నిచ్చుట యప్పటి కరుదు. మనదేశమునకు సాహితీకుల కట్టిగౌరవ మంతదనుక లభింపలేదు. ఇంతలో జర్మనుమహాయుద్ధము లోకము నావరించినది.

హింసాతత్వ మంతటను విజృంభించెను. బ్రిటిషుసామ్రాజ్యాంతర్గతమగుటచే మనదేశమునకుఁగూడ సీఘక్కా తగిలెను. ఈరక్తపిపాస కాళీతాండవము వంగదేశములో నెక్కువవ్యాపించెను. రవీంద్రునిసుకుమారతత్వమున కీధోరణి యెంతమాత్రమును సరిపడలేదు. అప్పు డాయన రచించిన గ్రంథము లీసంగతిని విశదపఱుచును. ఈసంఘర్షములోఁ దాను బడకుండనే దాని నైల్లన తగ్గించుట కాయన కృషిచేసెను. అమెరికాసంయుక్తరాష్ట్రములనుండి వచ్చిన యాహ్వాన మంగీకరించి, రవీంద్రుఁడు జపాను, అమెరికాలలోఁ బ్రయాణముచేసి 'జాతీయత' మున్నగువిషయములఁగూర్చి యుపన్యసించి యక్కడిజనులచే నద్భుతసమ్మానమొందివచ్చెను.

బోల్పురగ్రామములో రవీంద్రుఁడు స్వయముగస్థాపించి జరుపుచుండిన "శాంతినికేతన" మను పాఠశాలను, 1921 లో వృద్ధిచేసి, ఒక గొప్పవిశ్వకళాపరిషత్తుగఁ జేసెను. దీనికి "విశ్వభారతి" యను పేరిడి, దీనితరపున 1922 నుండి రవీంద్రుఁడొక త్రైమాసికపత్రికనుగూడఁ బ్రచురించుచున్నాఁడు.

1924 లో రవీంద్రుఁడు చీనాజపానులలో సంచారముచేసి, ఆదేశముల సంస్కృతికిని భారతీయ సంస్కృతికిని బూర్వమునుండియుఁగల యన్యోన్యతను బునరుద్ధరించుటకుఁ బ్రత్యేకకృషిచేసెను. మనసంస్కృతిలోని ప్రత్యేకతను వారికి విశదపఱిచి, అక్కడిప్రాచీనసంస్కృతిలో నిటీవలఁ గలిగిన వికృతిపరిణామమును వారికిఁగనపఱిచి, దానిని పరిశుద్ధమొనరించుకొండని వారికి బోధించెను. 1926 లో మరల రవీంద్రునకుఁ బ్రపంచయాత్ర తగిలెను; యూరపులోని విశ్వవిద్యాలయములలో విశ్వజనీనతనుగూర్చి యుపన్యసించెను. 1930లో రష్యాకేఁగి, సోవియటు పద్ధతిని, ఆసాంఘికపరిస్థితులనుస్వయముగఁబరిశీలించి, తరువాతఁదనయనుభవముల వార్తాపత్త్రికలలోఁ బ్రకటించెను. తత్త్వవేత్తల యాహ్వానముపై 1930 లో నింగ్లండులో "Religion of Man" మానవధ

ర్శమునుగూర్చి మహోపన్యాసమిచ్చెను. 1931 లో మనయాంధ్రవిశ్వవిద్యాలయమునతరపునను నరతత్త్వమునుగూర్చి యుపన్యసించెను.

ఇటీవలఁ దనవిశ్వభారతిని సర్వకళాసంపూర్ణనుగఁ జేయుటకు రవీంద్రుఁడు తనశక్తి నంతయు వినియోగించుచున్నాఁడు, తనకుటుంబములో శౌరీంద్రమోహనుని కాలమునుండియు వృద్ధియగుచున్న సంగీతచిత్రలేఖనాది కళలందుఁ బ్రత్యేకకృషి చేయుచున్నాఁడు. వయసున వృద్ధుఁడయ్యు, ఉత్సాహమున యువకులకన్న హెచ్చుగ నహోరాత్రములు దీక్షతోఁ బనిచేయుచుండును. ఇప్పటికిని "విశ్వభారతి" పత్త్రిక నతిసమర్థతతో నడుపుచు, అనేకకళలనుగూర్చి సంస్కృతిసమస్యలఁగూర్చి పరిశోధనలఁజేయుటే కాక, వంగభాషలోఁ బ్రతిసాలును నవ్యగ్రంథముల రచించుచునేయున్నాఁడు.

రవీంద్రుని వాఙ్మయసేవ.

రవీంద్రుఁడు ప్రపంచమునందలి మహాకవులలో నొకఁడనియెల్ల రంగీకరించినదే; ఆధునికకవులలో సర్వోత్తముఁడని చాలమంది భావము. ప్రత్యేక మొకశాఖలో నాటకములలోనో, నవలలోనో, గల్పములలోనో, గీతములలోనో, పద్యకావ్యములలోనో రవీంద్రునికంటె ప్రజ్ఞావంతులనిపించుకొనినవారిపుడుండిన నుండవచ్చు. కాని యన్నిట సమప్రజ్ఞగల యట్టిబహుముఖధీమంతు లింకెవ్వరును లేరనియే చెప్పవచ్చును. రవీంద్రుఁడు, స్వయముగ ముఖ్యపాత్రల ధరించి, నాటకములనాడి, పెక్కుమార్లపూర్వమైన నాట్యకళ నభివ్యంజన మొనర్చెను. సంగీతశాస్త్రములోను చిత్రలేఖనాదులలోను ప్రాచ్యపాశ్చాత్య పద్ధతులలోని విశేషముల గ్రహించి, వానినుండి క్రొత్తపద్ధతి సృజించి ప్రాముఖ్యము నకుఁదెచ్చెను. సర్వతోముఖదృష్టి రవీంద్రుని వాఙ్మయమందలి ముఖ్యగుణము.

రెండవవిశేషము విశాలత. ఆతఁడు శతాధికగ్రంథకర్తయన్నంతనే యావిశాలత పూర్తిగ గోచరముకాదు; ఆయన యిప్పటి కెనుబదేండ్లకుఁ

బైగ, అవిచ్ఛిన్నముగ వాఙ్మయసేవఁ జేయుచున్నాఁడు. ఐనను క్రొత్త రచనలలోఁ గూడఁ బటుత్వముగాని ప్రతిభగాని యేమియుఁ దగ్గలేదు. సర్వజనరంజకత్వము మఱియొకవిశేషము. వంగభాష నెఱింగిన ప్రతిగృహమునకు రవీంద్రుని రచనలు వ్యాపించినవి. మహావిద్వాంసు లాయనరచనల ననేకరీతుల గౌరవించిరి. ఎక్కడను నెట్టిపరీక్షయు నీయకున్నను, కలకత్తా విశ్వవిద్యాలయము వా రాయనకు డాక్టర్ ఆఫ్ లిటరేచర్ బిరుదమిచ్చియున్నారు.

రవీంద్రుని గ్రంథములలోఁ గొన్నిటిని స్థాలీపులాకన్యాయమునఁ బరిశీలింతము: అన్నిటిలోను జగత్ప్రసిద్ధిఁ గాంచినది "గీతాంజలి"; ఇది గీతకావ్యము. సంస్కృతవాఙ్మయమునందలి ప్రసిద్ధివహించిన "గీతగోవిందముతో" గీతములఁ బదునాల్గవశతాబ్దిలో వంగీయుఁడగు జయదేవుఁ డారంభించెను. బాల్యమునందే రవీంద్రుఁడు దాని నతిశ్రద్ధతోఁ జదివెను; తరువాత "విద్యాపతి" "చండీదాసు" మాతృభాషలో రచించిన గీతముల నేర్చెను. ఇవియన్నియుఁ బ్రేమభక్తిని బురికొల్పునవి. చైతన్యుఁ డట్టి గీతముల నద్భుతముగఁ బాడుచు, భగవంతుని గీర్తించుచు, తన్మయుఁడగుచుండువాఁడఁట. రవీంద్రుఁడీ వైష్ణవమతమునందలిభక్తిసారము నంతను బాల్యమందే గ్రోలెను. తానప్పుడు భానుసింహుని పేరిట వ్రాసినగీతము లాప్రాచీనగీతములరీతివే.

తరువాత నాతఁడు రచించిన "సంధ్యాసంగీత్" లో భావస్వాతంత్ర్యము మెండు; ఇందు నవ్యకవిత కంకురార్పణ మైనది. అందుఁ గొన్ని గీతముల పేర్లు: 'ఆశలో నిరాశ,' 'నక్షత్రపుటాత్మహత్య,' 'శోకగీతి,' 'హృదయవిహీనయగు స్త్రీ,' ఇట్లే "ప్రభాత్ సంగీత్"లో 'విశ్వస్వప్నము 'జీవితనిత్యత,' 'ప్రకృతితోఁ బునస్సంయోగము.' వీనిలో రవీంద్రుఁడు తనవ్యక్తిత్వమును జిత్రించెను.

రవీంద్రుఁ డిరువదిమూఁడవయేట వివాహమాడెను; తరువాతఁ బదియేండ్లు 'మానసి," "సోనార్ తాలీ" మొదలగు గీతకావ్యముల రచిం

చెను. ఈశృంగారకావ్యముల మాధుర్యము విశ్వసాహిత్యమంతటిలోను సాటిలేని దందురు. వీనిలోఁ గొన్నిటి యాంగ్లానువాదమే The Gardener అనుపేరఁ బ్రసిద్ధిగాంచినది. రవీంద్రునిభార్య హఠాత్తుగ మరణించెను; అంతటితో నాతనితత్త్వము మాఱినది; ధార్మికభావములకే ప్రాధాన్యము హెచ్చెను. అప్పటి "ఖేయ," "నైవేద్య," "గీతాంజలి" మొదలగు ఖండకావ్యము లిట్టివే. ఈమూఁడింటిలోని కొన్నిగీతముల యనువాదమే ఆంగ్ల గీతాంజలి. "గీతాంజలి" భక్తిరసప్రధానము; ఇందీశ్వరప్రేమ మహానదివలె గంభీరముగఁ బ్రవహించుచుండును. జయదేవ, విద్యాపతుల పౌరాణికభక్తియు, చైతన్యునిపత్నీప్రేమయునిందుఁ గొంతపరిణామ మందినవి. కాని, రవీంద్రుని కుటుంబపు బ్రహ్మసమాజతత్త్వమీగీతములలోఁ జూపట్టును. ఇందు "అవతారస్తోత్రము" నకు రాధాదివర్ణనలకు బదులు 'పరిశుద్ధాస్తిక' మనఁబడు బ్రాహ్మధర్మ ముద్యోతితమగును. వీనిఁ జదువునప్పు డుపనిషద్భావములు భాగవతులభక్తిగీతములును యథాయోగ్యముగ మిళితమైనట్లు స్ఫురించును. కొన్నిటఁ బ్రపత్తిసిద్ధాంతసూచనయుఁ గలదు. అతివిశాలభావము లగుట విశ్వజనులకు నుదారతత్త్వము బోధించును.

ఈపద్యవాఙ్మయముతోపాటు రవీంద్రుఁ డితరరచనల సాగించెను. ఆతనినాటకములును బ్రతిభాయుతములే. ఆతఁడుపదునాల్గవయేటనే "వాల్మీకిప్రతిభ" యను నాటకము వ్రాసెను: "వాల్మీకి దొంగలగుంపునకు నాయకుఁడై దోపిడులుచేయుచుండెను. ఆజట్టులో నొకఁడొకకుమారిని బలిమిమైఁ బట్టితెచ్చెను. ఆముగ్ధముఖమునందలి పవిత్రసుందరభావములచే వాల్మీకిహృదయమునఁ బరిణామము కల్గెను. ఆతఁడుదయామయుఁడై, ఆమెను విడిపించి స్వస్థలమునకుఁ బంపి, తోడిదొంగలకు నీతి బోధించెను. తరువాతఁ బ్రేమతోఁ గ్రీడించుపక్షులజంటలో నొకదానినొక వ్యాధుఁడు చంపుటఁ గాంచి కరుణామయుఁ డాయెను. ఆశోకము వాల్మీకి నోటఁ బురుషోత్తముఁ గీర్తించు శ్లోకరూపమునొందెను. అంతట నద్భుత

స్ఫురణగల్గి వాల్మీకి రామాయణము రచించెను.' ఇది యందలి క
వమనాల్గేండ్ల లేఁ బ్రాయమున నిట్టి సుందరపవిత్రకథను దననాటకమ
పురఁ గొనిన బాలకవి తరువాతఁ గవిసార్వభౌముఁడు కాఁజాలుట స
జమే. "శ్లోకత్వ మాపద్యత యస్యశోకః" అని కాళిదాసు నుడివినట్
నరులకుఁ గరుణరసము పవిత్రమై శాంతభక్తిభావము లుదయింపఁజేం
నని యీనాటకము సూచించును. ఆతఁడు తరువాత రచించిన "ప్ర
తిక్ ప్రతిశోధ" యనునాటకములో నొకఁడు సన్న్యాసియై కేవలవిరాగ
లోకసంబంధము లేకుండి, అటుపైఁ బ్రేమతత్వస్పర్శగల్గి, నిష్ఠురత్వ
వీడి, లోకప్రేమపరుఁడైనట్లు చిత్రింపఁబడినది. నివృత్తిమార్గము
హైరాగులై ముక్కుపట్టుకొని మూలకూర్చొనుట జీవితమును వ్యర్థప
చును; జనులయెడఁ బ్రేమగల్గి లోకోపకారమొనర్చుటే నిజముగ ని
యసకరమని రవీంద్రుని సూచన.

"కర్ణ ఒ కుంతీ" అనునాటిక ధ్వనిప్రధానమైనది. కౌరవయ
మునకుముందు కుంతీదేవి కర్ణుని గలిసికొని, అతఁడు తనజ్యేష్ఠపుత్ర
డగుటఁ దెల్పి, రాజ్యాధికార మిప్పింతుననియు, పాండవపక్షమున
రమ్మనియుఁ గోరెను. తన్ను బాల్యమునుండియు నాదరించి గౌరవ
తోఁ బోషించుచుఁ దన బలావేశముల నమ్మి తనకు జయ మొసఁగూ
నను విశ్వాసముతో యుద్ధమునకు దిగిన దుర్యోధను నాస్థితిలో వీడు
మహాద్రోహమని యెంచి కర్ణుఁడు నిరాకరించును. ఈనాటికలో నికర్ణు
మానవత్వము, విశ్వాసబుద్ధి, 'సీచకుల' మంను తృప్తియు రవీంద్ర
నిచే మనోహరముగ వర్ణితములు. రవీంద్రుఁ డింక ననేక నాటకము
రచించెను :—"రాజారాణి" (King of the Dark chambe
లో స్వార్థప్రేమ హానికరమని, "చిత్రాంగద" లోఁ బ్రకృతిసౌందర్య మ
విశిష్టమని, "మాలిని"లో నిజమైన ప్రేమపూజార్చనలవల్లఁ గాక ప్రే
వల్లనే కలుగునని, "విసర్జన్" (Sacrifice) లో సధర్మముపై నాధ
పడ రాదని, సూచించెను.

రవీంద్రుఁడు సుప్రసిద్ధములైన యాఖ్యాయికలఁగూడ రచించెను. ఈచిత్రవచనరచనలనే 'నవల' లనుచున్నాము. "నౌకాడూబీ" (The Wreck) లో హిందూకుటుంబజీవిత మిప్పు డెట్లు ప్రకృతిని గోల్పోయి ప్రతిమస్థితిలో నున్నదో చిత్రించినాఁడు. "గోరా" లోని కథ విచిత్రము. 1857 లో సిపాయియుద్ధము జరిగినప్పుడు ఐరిషుజాతీయులగు పాశ్చాత్య దంపతు లొకశిసువును గని విడిచిరి. తల్లిదండ్రులులేని యా శిసువు నొక శిష్టహిందువుపెంచెను. ఆబాలుఁడు తాను హిందువనియే యెంచి, సనాతనాచారపరుఁడై, పాశ్చాత్యులయెడ సంఘసంస్కారులయెడ ద్వేషము వహించెను. ఇతరులసంపర్కమువలన నాతనిహృదయములోఁ గల్గిన మార్పులును, మానవప్రకృతికి సాంఘికసంబంధమునఁగల్గు పరిణామములును, మహాప్రజ్ఞతోఁ గవి వర్ణించెను. "ఘరే బాఇరే"† (The Home and the World) అను నవల యింకను నద్భుతమైనది. బెంగాలులో విప్లవోద్యమము వ్యాపించినపుడు, ధీమంతుఁడగు యువకుఁ డొకఁ డాంగ్లద్వేషపూరితుఁడాయెను. సహజముగ నతఁడు ప్రేమమయుఁడు, మృదుస్వభావుఁడు, సరళమనస్కుఁడు; కాని యీ ద్వేషోద్వేగమునఁబడెను; ఆంగ్లేయుల ద్వేషింపని తోడిభారతీయుల యెడఁ గూడఁ గినుక వహించెను. తుద కతఁడు పిస్తోలుతోఁ దనపూర్వ మిత్రు నొకనిని జంపిన ట్లింపు వర్ణింపఁబడినది. దేశభక్తి చాల పవిత్రమైనను, అది ప్రేమతత్త్వముపైననే యాధారపడవలెను; పరులపై ద్వేషము కూడదు; ప్రేమతత్త్వమువీడి పాశ్చాత్యులయెడ ద్వేష మూనుట జాతిద్వేషములకు, శాఖావిభేదములకుఁ బరస్పరదారుణహింసాచర్యలకును గారణమగును. కాన హింసాతత్త్వము మనదేశీయుల కీస్థితిలో మహానర్థదాయకమని యాగ్రంథమునందలి భావము. ఇట్టినవల వ్రాసినందులకు వంగీయులలోఁ గొంద ఱాతనిపై నీసు వహించిరి. కాని జాతీయత పరిశుద్ధముగ విశ్వజనీనముగ నుండవలెనని నమ్మి, రవీంద్రుఁ డాసాంఘికోద్రేకమునకు వెఱువక, ఇంక నట్టిరచనల సాగించెను. రవీంద్రునిధీరత్వమున కిదియొక గొప్పనిదర్శనము.

† దీనియాంధ్రానువాదము "ఇంటా బయటా"

రవీంద్రుఁడు చిన్నకథలనుఁగూడ (Short stories) విశేషముగ రచించెను. "క్షుధితపాషాణ", "నళిని" మున్నగునవి ప్రసిద్ధిఁజెందినవి. వీనిలోఁ గొన్ని యాంగ్లములోని కనువదింపఁబడి Hungry stones and other stories మొదలగు పేరులతోఁ బ్రచురింపఁబడినవి. ఈకథలు హృద్యములై రంజకములై, భావగర్భితములై, నీతిని ధ్వనింపఁజేయును. నిర్బంధమును శ్లేషమును లేకుండ బాలురకు రుచికరముగను, ఆకర్షకముగను విద్యనేర్పుట చాలముఖ్యమని, ప్రస్తుతపద్ధతి బాలురకు విద్యయందాసక్తికి బదులు విరక్తినే గల్గించునని, ఆయన స్వానుభవమువల్ల గ్రహించెను. ఆభావముతో స్వభాషయందు బాలుర కాసక్తిగల్గించు చక్కని వాఙ్మయము సృజించెను. కొంతకాలము "బాలక్" అను మాసపత్రిక నడపెను. అనేకగ్రంథములలో బాలురమనోభావముల నతఁడు చక్కఁగఁ జిత్రించెను. ఆపుస్తకములలో "శిశు" ఆంగ్లములో Crescent moon అనుపేరఁ బ్రచురితమైనది.

విమర్శగ్రంథములనుఁ గూడ రవీంద్రుఁడు రచించెను. ఇందు "ఆలోచన్" "సమాలోచన్", "సాహిత్య", "ప్రాచీనసాహిత్య", ముఖ్యముగఁ జెప్పఁదగినవి. సంస్కృతమందలి వాల్మీకి,కాళిదాసు, భవభూతి, మొదలగు మహాకవుల గ్రంథముల ప్రాశస్త్యము వివరించుచు, ఇంతవఱకు వెల్లడికాని విశేషము లెన్నియో బయల్పరచి, సహేతుకముగ నిరూపించి యున్నాఁడు.

రవీంద్రుఁడనేకపత్రికలను స్వభాషలో నడిపినట్లు గమనించియున్నాము. సంపాదకధర్మమున నతఁడు వంగవాఙ్మయమున ముఖ్యగ్రంథములనన్నిటిని విమర్శించెను. అందాదార్యము, సూక్ష్మదర్శిత్వము, ప్రతిభ గన్పఱచి యువకులకు విశేషప్రోత్సాహ మిచ్చినాఁడు.

ఆధ్యాత్మిక సాంఘికవిషయములఁగూర్చి రవీంద్రుఁడు తఱచుగఁ బత్రికలలో వ్రాయుచుండును. తనవిద్యార్థుల కాతఁడిచ్చిన యుపన్యాసముల సంపుటి "శాంతినికేతన్" అనుపేరఁ బ్రచురితమైనది. వీనిలోఁ

గొన్ని యాంగ్లమున Sadhana అనుపేర వెలువడెను. అతని మతభావములు మూఢవిశ్వాసములను దురాచారములను సహింపవు; అతఁడు బ్రాహ్మసమాజపు సంప్రదాయమునఁ బుట్టిపెరిగినవాఁడు. సర్వమతసముఁడు. అన్నిమతముల మూలసిద్ధాంతములను, వానియేకత్వమును, రాజా రామమోహనరాయలవలె గ్రహించినాఁడు. ప్రస్తుత హిందూమతభావములలోను, ఆచారములలోనుఁ, చాలసంస్కరణములు కావలెనని యాతనిదృఢవిశ్వాసము. బ్రహ్మసమాజము, ఆర్యసమాజము, రామకృష్ణవివేకానందుల సిద్ధాంతములు మున్నగుప్రత్యేక సంస్కరణపక్షములలో నేవియు హిందువుల సామాన్యమతము కాఁజాల దనియు, ఇప్పటి హిందూమతములోనే క్రమముగ లోలోనఁ బరిణామముగల్గి, తద్ద్వారా హిందూసంఘము పూర్వపుఔన్నత్యమునకు రాఁగలదనియు రవీంద్రుని విశ్వాసము. అతనిగ్రంథములనిది తెల్లమగును. తండ్రివలెనే రవీంద్రుఁడును బ్రకృతిలీనమగు దేవమహాత్త్వమును గుర్తించును. తనగ్రంథములలో గిరులు, ఋష్యాశ్రమములు, అరణ్యములు, సస్యశోభితభూములు, గంగాపద్మాదినదులు, మున్నగువాని నతిమనోహరముగ వర్ణించెను. గ్రామజీవితమును "జీవనదేవతా" మున్నగుగీతములలోను వచనకథలలోను జక్కగఁ జిత్రించి, సానుభూతిఁ జూపెను. ప్రకృతికి నరునకు నన్యోన్యత కలదని చక్కగ నిరూపించినాఁడు.

రవీంద్రుని రచనలయందు దేశభక్తి తొలుకాడుచుండును. కాని రాజకీయపరుఁడుగాక, వాఙ్మయవృద్ధినే తన ముఖ్యవృత్తిగఁ జేసికొనెను. సంఘాభివృద్ధికి శాఖావిభేదము చేసి, అందొకదానికిఁ దక్కినవానితో సంబంధము లేదనుటకు వీలులేదు. ముఖ్యముగ, పరాధీనజాతిహృదయము, మనస్సు, సంకుచితమై యుండును; వక్రపరిణామము లేకుండ విశాలవృద్ధి గల్గింపఁ గోరు వాఙ్మయసేవకులు జాతీయ స్వాతంత్ర్యమునకై కృషిచేయకతప్పదు. వారందులకు సహాయకరమగు సాహిత్యమును సృజింపవలెను. అట్టిభావముతో రవీంద్రుఁడు యౌవనమున జాతీయో

ద్యమమునఁ బాల్గొని దేశసేవఁజేసి, జాతీయోత్సాహముగల్గించు నుప న్యాసములను, వ్యాసములను విరివిగఁ బ్రకటించెను. 1919 లో పంజా బుసంఘటనలోఁ దననిరసనము సూచించుటకు "సర్" బిరుదు వదలుకొ నెను. అంతకుముందే గొప్పజాతీయగీతముల నాతఁడు వ్రాసెను. అతని రచనలలో "స్వదేశి, సంకల్ప"మున్నగు కొన్నిగ్రంథములు మనదేశమున కార్థికరాజకీయస్వాతంత్ర్య మావశ్యకమని బోధించును. కాని జాతీయ భావములో స్వార్థపరతయు విదేశీయులపై ద్వేషము నుండరాదని రవీం ద్రునిభావము; అమెరికాలో నిచ్చిన Nationalism అను నుపన్యా సమున నీసంగతిని స్పష్టపఱిచెను. రవీంద్రుఁడు విశ్వజనీనవాది; ముఖ్య దేశములన్నిటికి వెళ్ళి ఆయాదేశములమధ్య జాతులమధ్య పరస్పరమైత్రి హెచ్చించుటకు యత్నించెను. తనయాత్రలందుఁ గల్గిన యనుభవముల వివరించుచు, లేఖల వ్రాసెను. అవి "యూరప్ ప్రవేశేర్ పత్రి" "రుసీ చిట్టీ" మున్నగు పేర్లతో గ్రంథరూపముగఁ బ్రకటింపఁబడినవి.

తనరచనలలోను, ఉద్దేశములలోను రవీంద్రుఁడు, బంకించంద్రు నిశిష్యుఁడనని, చాలవఱకాతని ననుసరించినాఁడు. ఉభయులకుఁ గొలఁది భేదము మాత్ర మున్నది. ఇరువురివి యున్నతాదర్శములే; ఉభయులును బ్రజాక్షేమపరులే. రవీంద్రుఁడు నవ్యభావములఁ దెల్పుచుఁ దనయాత్మ వ్యక్తిత్వమును దనరచనలలో వివరించి ప్రదర్శించినాఁడు. నేఁటి "భావ కవిత్వము"నకాతఁడు జనకుఁడని చాలమందిభావన. వంగవాఙ్మయమునఁనే కాక, మనదేశభాషలన్నిటి వాఙ్మయములలోను గొత్తపంథ యేర్పడి నసంగతి నిజము. ఆంధ్రమున రాయప్రోలు సుబ్బారావు, మళయాళ మున వల్లత్తోళ్ నారాయణ మీనన్, హిందీలో జైనేంద్రకుమార్ మున్నగు కవు లీతనిచేఁబ్రభావితులై, నవ్యగ్రంథముల రచించిరి. కాని, అతనిమార్గ మనుసరించుచున్నట్లుచెప్పుచు బెంగాలీలోను మన యితరభాష లలోను వెలువడినవానిలోఁ జాలభాగ మాయనయుద్దేశప్రకారము తే

నట్లు తెలియుచున్నది. అనవసరనిర్బంధములు లేక, రంజకమై, స్వతంత్రమై, కవిత్వము నవరసయుతముగ నుండఁదగుననియు, వెంటనే రసము గ్రహింపవీలై యానందమయమగుట దాని ముఖ్యప్రయోజనమని పూర్వాలంకారికులలోను గొందఱు చెప్పియున్నారు.* రవీంద్రునిరచనలు వాఙ్మయరంగమున స్వేచ్ఛావిహార మొనర్చుచున్నటులు తోఁచుటయు నిజమే. కాని యందున్న తాదర్శములు స్పష్టముగ గోచరించును. అవి సచ్చిదానందస్వరూపద్యోతకములై గంభీరమగు నాధ్యాత్మిక భావములతో నిండియున్నవి.

“నిరంకుశాః ఖలు కవయ స్సార్వపథీనాః” అనువచనము రవీంద్రునిశైలిసందర్భమున వర్తించును. కేవలము కళాత్మక మనఁబడురచనలలోను గొప్పయుపయుక్తత, సంఘక్షేమకరత్వము లీనమైయుండును. ఉదారమగు నైతికభావమును, ఔచిత్యమును, రవీంద్రుఁ డెన్నడును తప్పలేదు.

రవీంద్రునిశైలి లలితమైనది; ప్రాచీనప్రబంధములవృత్తములను, వానియతిప్రాసనియమముల నంతగా గమనింపఁడు. గ్రామ్యజీవనమునఁ బ్రచారముగల యక్షగానద్విపదాదుల చిత్రవిచిత్రములగు వృత్తముల నాతఁడు తనగీతముల కుపయోగించెను. “ముత్యాలసరము” బోలు కొన్నివృత్తముల భావానుగుణముగ మనోహరముగఁ గల్పించెను. క్లిష్టపదముల వాడక, మృదుమధురముగ వ్రాయును. తనవిశిష్టభావములఁ దెల్పుటకుఁ జాలవఱకు సంస్కృతపదముల నుపయోగించుచుండును.

---

*నియతికృతనియమరహితాం, హ్లాదైకమయీం, అనన్యపరతంత్రాం,
నవరసరుచిరాం నిర్మితి మాదధతీ భారతీ కవేర్జయతి......
సకలప్రయోజనమౌళిభూతం సమనంతరమేవ
రసాస్వాదనసముద్భూతం విగళితవేద్యాంతరం ఆనందం”

(మమ్మటుని: కావ్యప్రకాశము)

ఆయన శైలి కుదాహరణములు:—

"భవ్యతార్ బందీమాఝే
శాంతినహిమాని."

(దురంతమగు నాశాసాంప్రదాయికములనడుమ నాకు శాంతికలుగ

"సంసారస్రోత జాహ్నవీసమ,బహుదూరే గేఛే సరియా పరి
ఊషరబాలుకధూసరమరురూప అఛేమరియే హృదయ అమార్ క్రం
కరే, మానవహృదయే మిళితే నిఖిలేర్ సాథే మహారాజపథే, చ
దివస-నిశీథ"

(ప్రపంచప్రవాహము బహుదూరమున గంగానదివలె సాగిప
చున్నది. కాని యీ చవిటినేల నిర్జలమై, ధూళిరేగి మృతప్రాయమై
నాహృదయ మందఱితోఁ గలిసి రాజపథములో, రేయింబవళ్లు మ
వహృదయముతోఁ గలిసిపోవుట కాతురపడుచున్నది.)

"వైరాగ్యసాధనే ముక్తిసే ఆమార్ నయే" (జనసంపర్కము
వైరాగ్యముద్వారా కల్గురీతి మోక్షము నాకు వలదు.)

"సార్థక్ జన్మ్ అమార్, జన్మేఛి ఎయి దేశే
సార్థక్ జన్మ్ మాగోత్తో మాయ్ భాలోవసే."

(ఈదేశమునఁ బుట్టుటచే మాజన్మ సార్థకమైనది. మాతృభూ
యగు మీకు మేలొనరించుటచే జన్మకు సార్థకత సిద్ధించును.)

దాండావ్ విశాలధరణీర్ తలే
ఘుసేగె లాభయలాజ్
బురిఖలే పాఁను ఏజగతీ మాఝే
అమారో ద్వయేఛేకాజ్
స్వదేశేర్ కాఛే డాండాయ్ ప్రభాతే
కహిలాం జోడ్ కరే
ఏలహా, మాతః, ఏచిరజీవన్
సొంపిను తోమారతరే.

(విశాలమైన పృథ్విపై నిలువగా, నాకు భయము లజ్జ పోయినవి. ఈజగత్తున నాకును గార్య మున్నదని బోధపడినది. ఉదయమున, స్వదేశమునకుఁ జేతులుజోడించి, 'తల్లీ, అందుకొమ్ము. ఈజీవితమంతయు నీసేవకే యర్పింతును' అనియంటిని.)

"జనగణ ఐక్యవిధాయక, జయహే భారతభాగ్యవిధాతా,
జయహే, జయహే. జయహే, జయజయహే
రాత్రిప్రభాతిల్ ఉదిత రవిచ్ఛవి, పూర్వ ఉదయగిరి భాలే
గాహే విహంగమ, పుణ్యసమీరణ నవజీవనరసఢాలే,
తవకరుణారుణరాగే నిద్రితభారతజాగే
గాహే తవ జయగాథా.

(జనులకైక్యముఁగల్గించి, భారదేశీయులకు క్షేమంకరుఁడవగునో ప్రభూ! తెల్లవారి, తూరుపున సూర్యోదయమై, పక్షులు పాడుచున్నవి. నీదయచే మనోహరమైన వాయువు ప్రాణప్రదమై వీచుచున్నది. నిద్రించియుండిన భారతీయులు మేల్కాంచి నీజయము పాడుచున్నారు.)

నై వే ద్య.

చిత్త యథా భయశూన్య, ఉచ్చ యథా శిర్,
జ్ఞాన యథా ముక్త, యథా గృహేర్ ప్రాచీర్
అపన్ ప్రాంగణతలే దివసశర్వరీ
వసుధారే రాఖేనాఇ ఖండక్షుద్రకరి,
యథా వాక్యహృదయేర్ ఉత్సముఖ్ హతే
ఉచ్ఛ్వసియా ఉఠే, యథా నిర్వారితస్రోతే
దేశేదేశే దిశేదిశే కర్మధారాధాయ్
అజస్ర సహస్రవిధచరితార్థతాయ్;
యథా తుచ్ఛ ఆచారేర్ మరువాలురాశి
విచారేర్ స్రోతఃపథ ఫేలేనాఇగ్రాసి,
పౌరుషేరే కరేని శతధా; నిత్య యథా

తుమిసర్వకర్మచింతా ఆనందేర్ నేతా,
నిజహాస్తే నిర్దయ ఆఘాతకరి, పితః
భారతేరే సేయ స్వర్గే కరో జాగరిత్."

(మనసు నిర్భయమై, తలయెత్తుకొనియుండి, జ్ఞానముస్వతంత్రమై రాత్రింబవళ్లు అంతర్భేదములచే సంఘమున కేర్పడిన భిన్నభిన్నత పోయి స్వేచ్ఛతో హృదయమునుండియే మాటలాడుచు, అన్ని ప్రాంతములలోన గార్యశూరత సర్వవిధముల నేర్పడి, తుచ్ఛదురాచారపు టెడారులలో విమర్శప్రవాహ మింకిపోకుండి, దృఢత్వ మేర్పడి, సర్వకర్మభావములు నీచేనడుపఁబడునట్టిస్వాతంత్ర్యస్వర్గమునకునాదేశమును మేల్కొలుపుము) రవీంద్రుఁడు స్వయముగ నాంగ్లమున రచించిన దీనియనువాద మింకను మనోజ్ఞము.

"Where the mind is without fear and the head is held high; where knowledge is free;

Where the world has not been broken up into fragments by narrow domestic walls;

Where words come out from the depth of truths;

Where tireless striving stretches its arms towards perfection;

Where the clear stream of reason has not lost its way into the dreary desert sand of dead habit;

Where the mind is led forward by thee into ever widening thought and action:—

Into that heaven of freedom, my Father, let my country awake."

రవీంద్రునిభావము లత్యుదారములు. శైలి సంస్కృతపదభరిత మైనను లలితమై మనోజ్ఞముగ నుండును. ఆంగ్లగ్రంథములభావములు శైలియు నద్భుతములని యాతనిరచనలవల్ల నాంగ్లవాఙ్మయమున నొక

నవయుగమేర్పడినదని సుప్రసిద్ధపాశ్చాత్యవిమర్శకు లేకగ్రీవముగ వంగీకరించియున్నారు. కేవలభిన్నభాషలలో నిట్లఖండప్రఖ్యాతిని విశేషప్రశస్తిని గాంచుట రవీంద్రునకే చెల్లినది.

ఆంగ్లరచనలచే నిట్లన్యభాషకీర్తియు, తనగ్రంథములవిక్రయమున లక్షలకొలఁది ద్రవ్యమును సమకూరినను, రవీంద్రునకు నేఁటికిని మాతృభాషయందే విశేషాభిమానము. ఆయన తనరచనలనన్నిటిని ముందు స్వభాషయందు వ్రాసెను. వంగీయులమధ్య నెప్పుడును బంగాళీలోనే యుపన్యసించును. తనయవిచ్ఛిన్నసేవచే మాతృభాషకేగాక భారతదేశమంతటికిఁగూడ లోకమంతటను గౌరవస్థానము గల్గించెను.

రవీంద్రుని ముఖ్యగ్రంథములు ఫ్రెంచి, జర్మను, జపానీ, మున్నగు విదేశభాషలలోని కనువదింపఁబడినవి. హిందీ, గుజరాతీ, మరాటీవంటి మనదేశభాషలలోనికిఁ దర్జుమాయగుటలో నాశ్చర్యములేదు. విద్యాబోధఁగూర్చియు రవీంద్రునిభావములు స్వతంత్రములే. శైశవమం దతని కప్పటిపాఠశాలల బోధనపద్ధతులు రుచింపలేదు. ఇప్పుడు, అధికారరీత్యా నిర్బంధముగ సాంప్రదాయికవిషయములను బాలురమనస్సులోని కెక్కించుచున్నారు. బాలురు విధిలేక వానినివల్లించి జ్ఞప్తిలోనుంచుకొనుచున్నారు. అట్లుగాక శిశుహృదయమును, మనస్సును వికసింపఁజేసి, వారి కాయావిషయములం దభిరుచిని, స్వతంత్రాలోచనశక్తిని వృద్ధిచేయుట మొదటికర్తవ్యమని రవీంద్రునియభిప్రాయము. "శిశు" అను తనగ్రంథమున శిశుహృదయ మెట్లుక్రమవికాసమునొందునో కవిసూచించినాఁడు. 1905 నుండియు జాతీయపద్ధతులను బాలురకు విద్యాబోధఁజేయించుటకాయన కలకత్తా "జాతీయశిక్షాపరిషత్తు" లో సభ్యుఁడై, ఆసందర్భములలో నప్పటియువకులలో గొప్ప ప్రచారము చేసెను. జాతీయవాఙ్మయ మెట్లుండవలెనో, ఆయన గొప్పసూచనలఁ జేయుచు వ్యాసములు వ్రాసెను. ఇవి "సాహిత్య" "సమాలోచన" అను పేరులతో గ్రంథములుగఁ బ్రచురితములైనవి.

నవ్యభావములతో నాదర్శప్రాయమగు విద్యబోధించుట కాయన స్వయముగ బోల్పురములో శాంతినికేతనపాఠశాలను జాలయేండ్లు నడిపి, దానిని గొప్పయాదర్శకళాపరిషత్తుగఁ జేసెను. నోబెలు బహుమానపుసొమ్మును, తన గ్రంథవిక్రయపుసొమ్మును, అమెరికా మున్నగుచోట్ల తనయుపన్యాసములయాత్రలో వసూలైన ధనమంతయుఁగూడ రవీంద్రుఁడు విశ్వభారతికే వినియోగించెను. బాలురమానవత్వమును వృద్ధిచేయుట కనువగు పద్ధతులే చిన్నతరగతులనుండి పట్టభద్రులు చేయుపరిశోధనలవఱకును, శాంతినికేతనమున నేర్పఁబడుచున్నవి. అందు భారతీయభాషలన్నిటిలో సాహిత్యము, సంగీతము, చిత్రలేఖనాదికళలు నవ్యవిజ్ఞానము, వివిధశిల్పవిద్యలు, చేతిపనులుగూడ నేర్పఁబడును. ఆయా సంస్కృతులమధ్య సమన్వయమునకై చీనా జపాను వగైరాలవాఙ్మయ శాఖల నేర్పఱచి, అందుఁ బ్రత్యేకకృషి నేర్పఱుచుచున్నాఁడు. ప్రపంచమం దన్నిభాషలలోని యున్నతవాఙ్మయమును విశ్వభారతిలో సేకరించి, తగుబోధకుల నేర్పఱచియున్నారు. ఇట్లే ముస్లింసంస్కృతివంటి విషయములఁగూర్చియుఁ బరిశోధనలు జరుగుచున్నవి. దేశసౌభాగ్యమునకై గ్రామపునర్నిర్మాణపద్ధతులు నేర్పఁబడుచున్నవి. గృహపరిశ్రమలోను, ఆరోగ్యపద్ధతులలోను, నవీనవ్యవసాయపద్ధతులలోను, యువకుల కచ్చటశిక్షణమిత్తురు. ఈశాఖకు 'శ్రీనికేతన' మనిపేరు. నీతివర్తనమలవఱచుటకును, ధార్మికబోధమునకును యుక్తమగు నిబంధనలుకలవు.

రవీంద్రుఁ డపురూపమగు సంగీతసంగతులను, చిత్తరువులను స్వయముగఁ దయారుచేసి, ఆయాకళలలోఁ బ్రత్యేకనిపుణులనుగూడ నాశ్చర్యముగ్ధులఁజేసినాఁడు. అతనిగంభీరరూపమునకుఁదోడు, రవీంద్రుని కంఠస్వరమును లలితమై సమ్మోహనకరముగ నుండును. బంగాళీగీతముల నాతఁడు స్వయముగఁ బాడునప్పుడు, వానియర్థ మెఱుఁగని పాశ్చాత్యులుగూడఁ బరమానందముతో వానిరుచి నాస్వాదింతురు. కవిత్వవిశేష

మునను, వివిధతలోనేగాక విస్తీర్ణతలోను, రవీంద్రుని కెన యగువారు చాలనరుదు. రవీంద్రునికిఁ గవిసార్వభౌమబిరుద మెల్లవిధముల సార్థక మైనది. "కవులు తాత్త్వికులు కారు; తత్త్వవేత్తలు కవులు కానేరరు" అను సూక్తి చాలవఱకు నిజమైనను, రవీంద్రుని కిది యన్వయింపదు. ఆతనిగ్రంథములలోఁ దత్త్వవేదాంతములసూచన విశేషముగ నుండును. ఆతఁడు గొప్పయాదర్శవాది. దేశభక్తి, ఆత్మదర్శనము, ఆత్మానుభవము, విశ్వప్రేమ, పరోపకృతి యాతనిగ్రంథము లుద్ఘోషించు సందేశములు.

మధ్యకాలపుఁ గ్లిష్టతార్కిక చర్చలరీతి శల్యపరీక్ష లాయనకు రుచింపలేదు; సాంప్రదాయికమగు మూఢాచారములను లేనిపోని విభేదములనువదలి, మానవులుతమలోని పశుత్వమును బూర్తిగఁ ద్యజించి, అంతర్యామి ప్రతిహృదయములోను ప్రేమించు దైవత్వమును వికసింపఁ జేసికొనవలెనని యాయన కోరును. అట్టి మతబోధకుఁడగు కబీరుని గీతముల నూఱింటిని రవీంద్రుఁ డాంగ్లీకరించినాఁడు.

డెబ్బదియెన్మిదేండ్ల వయస్సున్నను, రవీంద్రుఁడు యువకులకంటె నధికోత్సాహముతోఁ బనిచేయుచుండును. మహావర్చస్వి; ధీశక్తి, ఔదార్యము, స్వార్థరాహిత్యము, ప్రజాక్షేమదృష్టియునుగలవాఁడు.

"ఆకారసదృశప్రజ్ఞః, ప్రజ్ఞయా సదృశాగమః
ఆగమైస్సదృశారంభః ప్రారంభసదృశోదయః॥"

అనికాళిదాసు దిలీపునిఁగూర్చిచెప్పిన శ్లోకము రవీంద్రునియెడఁ బ్రత్యక్షముగ సార్థకమైనది.

శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు

(విమర్శన సమాధానము)

విద్వాన్, పిసుపాటి విశ్వేశ్వరశాస్త్రిగారు.

(పిఠాపురము, 15—12—1939.)

(౧౧, ౧౨, ౧౪, ౧౫, ౧౬, ౧౭, ౨౨, ౨౬, ౩౦, ౪౩, ౪౪, ౪౬, ౫౦ ఆక్షేపములు సమాధానములు ముఖ్యముగాఁ జిత్తగిం విద్వాంసులు ప్రార్థితులు.)

కళాప్రపూర్ణ, రావుసాహేబు, శ్రీ గిడుగు వెంకటరామమూ పంతులుగారు ప్రతిభ 3 సంపుటి 2, 3, 4, సంచికలలో శ్రీ సూర రాయాంధ్రనిఘంటువుపై నొక విమర్శనము వ్రాసినారు. అందు రెండ సంచికలో వ్రాసినవిషయము ఆనిఘంటు సంపాదకులపై వ్రాయఁబడు చేతను, సమాధాన మీయఁదగిన యంశమేమియు లేకుండుటచేతన దానికి సమాధాన మిచ్చుట మాని, మూఁడు నాలుగు సంచికలలో వ్రాసినదానికి మాత్రమే సమాధానము వ్రాయఁదలఁచితిని. పంతుల గారు తమ విమర్శనములోఁ జాలచోట్ల సంపాదకులతోపాటు పండిత లనుగూడఁ దమ యాగ్రహమునకు గుఱిచేసినారు. మఱియు నిఘంట రచనా విధానమే సూర్యరాయనిఘంటువువారికిఁ దెలియదనియును, అ కతవక నిఘంటువును వారు రచించినా రనియును వ్రాసినారు. తెనుఁగ గ్రంథములలోనిపదములు, పంచకావ్యములలోని పదములు, ఆస్తే. స కౌముదులలోనిపదములు, అనేకములు సూర్యరాయనిఘంటువుల లేవని యాక్షేపించినారు. ఇవియే కాక మఱికొన్ని యాక్షేపముల గూడఁ జేసినారు. పై యాక్షేపములు ప్రమాదభూయిష్ఠములుగా నున్నవి. వీరి యాక్షేపములును వానికి నేను వ్రాసినసమాధానములున సావధానముగాఁ బరికించువారి కీవిషయము గోచరింపఁగలదు. పంతుల

గారి విమర్శనములోఁ గలమంచివిషయములను నిఘంటుకర్తలు కృతజ్ఞతాపూర్వకముగా స్వీకరింతురు.

౧. ఆక్షే:—ఆంధ్రకవులు ప్రయోగించిన సంస్కృతశబ్దములలో వీరు విడిచినవి ముందుగా కొన్ని ఉదాహరిస్తాను. 'అర్పణమ్, సమర్పణమ్' అని నపుంసకములుగా ఆప్తేనిఘంటువులో ఉన్నవి. కాని తెలుగు కవులు (సంస్కృతకవులుగూడా) స్త్రీలింగములుగా ఇట్టిశబ్దములు ప్రయోగించడము అరుదుకాదు ... చ ... సమర్పణసేసె ... భార. ఆది. ౨ ४౦. ఉ...సహస్రపాత్రుఁడు భీమలింగమున కర్పణచేసిన... భీమ. ౧ ౩౦. సీ...పర్యుషితమును నర్పణసేయఁజాల ... పాండు. ४. ౧౬౬. ఉ...ప్రాణములర్పణసేతు...శశాంక. ౩. ౮४. "అర్పణ" సాధువు అని ఇకను అంగీకరిస్తారా? అంగీకరించరా? ఇట్లే ఆప్తేలోను శబ్దరత్నాకరములోను నపుంసకమని వ్రాసి ఉన్న 'వర్తనమ్' అనుశబ్దమును మహాకవులు 'వర్తన' అని ప్రయోగించి ఉన్నారు. బోలెడు ప్రయోగా లున్నవి...ఇట్టిది లేకుంటే ఆంధ్రనిఘంటు వవుతుందా?

(౧౮౯, ౧౯౦, ౧౯౧, పా.)

సమా:—దానార్థకములగు 'అర్పణా, సమర్పణా' శబ్దములు కల్పద్రుమము, వాచస్పత్యము, లఘుశబ్దార్థసర్వస్వము, విల్యమ్సు, వైజయంతి, కేశవము, మేదిని, అమరము, మున్నగుసంస్కృతనిఘంటులలో లేవు. పంతులుగా రిచ్చినప్రయోగము లన్నింటిలోను 'అర్పణచేయు, సమర్పణచేయు' అనియే యున్నది కనుక 'అర్పణము + చేయు, సమర్పణము + చేయు' అనియుండఁగా 'ము' వర్ణకము లోపించి 'అర్పణచేయు, సమర్పణచేయు' అయిన దని గ్రహింపవలెను. ఇవి 'నిరాకరణచేయు' మున్నగువానివంటివి.

క. మన్ననఁ దోఁ గొంగి నిను నీ
యున్న నిరాకరణచేసి యాడెనో నీ కా
యున్నపయి భక్తి దొలఁగెనో... ఉ. భా. ६. ౨६౧

ఈప్రయోగమునుబట్టి 'నిరాకరణా' అను స్త్రీలింగశబ్దమున్న
దనుట తప్పు. 'నిరాకరణము + చేయు' అనునప్పుడు మువర్ణలోపమ
వచ్చిన దనియే చెప్పవలయును. సూర్య. ని. లో ఇట్టివి 'చేయు' శబ్దమున
జూపఁబడియున్నవి. 'వర్తన' ఇది చరిత్రాదులలోనిది. కనుకనే 'వ
నము' అను రూపాంతరముకూడ, భార. అశ్వ. ౪. ౨౧౮. ఉత్త
హరివంశము. ౨. ౨౦౨. మున్నగుచోట్లఁ గలదు. ఈయర్థమున స్త్రీ
లింగము కల దనుట సర్వగ్రంథవిరుద్ధము.

౨. ఆక్షే:—'అనుగమ్యమానుఁడు' ఇది లేదు. (౧౯౨ పా

సమా:—ఇది 'గమ్యమానము. వి ౯.' లో గతార్థము. సోపస
ములకడ నన్నిరూపములు చూపకున్నను, అనుపసర్గములకడఁ జూప
బడును గనుక వానిలో గతార్థము లగును.

3. ఆక్షే:—ఆప్తే. ని. లోని 'అంగనాజనులు' లేదు. 'అం
నాప్రియము' మాత్రమే సూర్య. ని. లో ఉన్నది. (౧౯౨ పా

సమా:— 'అంగనాజన' శబ్దము 'అంగనా, జన' శబ్దములల
గతార్థము. 'అంగనాప్రియము'నకు 'అశోకము' అనువిశేషార్థముండుట
గ్రహించినారు. ఇట్టి యల్పవిషయములనుగూడ గ్రహింపక విమ
కులు ప్రశ్నించుట యాశ్చర్యకరము.

౪. ఆక్షే:—'అశ్రుతపూర్వము, అదృష్టశ్రుతపూర్వము'
లేవు. 'అదృష్టపూర్వము' వ్రాసినవారు ఇవి ఎందుకు విడిచినారు?

(౧౯౨ పా

సమా:—ఇట్టి నఞ్సమాసపదములనన్నిటిని గ్రహింప న
లేదనియును, సూర్య. ని. లోని 'అ. సం. అవ్య' లో నివి యన్నియు గ
ర్థములే యనియును నేను 'భారతి' ప్రమాథిభాద్రపదమాస సంచిక
వ్రాసిన 'సూర్యరాయాంధ్రనిఘంటు విమర్శపరామర్శము'న నిరూపి
యున్నాను. కనుకనే యిక్కడ మరల వివరింప లేదు. దిక్ప్రదర్శనార్థ
'అదృష్టపూర్వము' వంటివి సూర్య. ని. లోఁ గొన్ని చూపఁబడినవి.

౫. ఆక్షే:—అవలుంచించు.

వ. మఱియు నొక్కజట యవలుంచించి వేల్చిన.

భార. అర. 3. ౨౬౭.

ఇది సూర్య. ని. లో లేదు. (౧౯-౨ పా.)

సమా:—ఇక్కడ వ్రాఁతప్రతులలో

వ. మఱియు నొక్కజట తెంచి వేల్చిన.

(N 11-5-6 ఓరియంటల్ లైబ్రరీ.)

వ. మఱియు నొక్కజట యవలంబించి.

(N 14-2-30. ,, ఈపాఠము చాలప్రతులలోఁ గలదు.)

ఇట్లు భిన్నభిన్నపాఠములు కనఁబడుటచేతను, మాచూచిన వ్రాఁతప్రతులలో 'అవలుంచించు' కనఁబడకపోవుటచేతను, 'తెంచి' అను పాఠమే సరి గానోపు నని తలఁచి యది త్యజింపఁబడినది.

౬. ఆక్షే:—'అసమేక్షణుఁడు, అతద్గుణసంవిజ్ఞానబహువ్రీహి' లేవు. (౧౯-౨, ౧౯3 పా.)

సమా:—'అసమేక్షణుఁడు' 'అసమ, ఈక్షణ' శబ్దములలో గతార్థము. ఇట్టిదేయగు 'అసమనయనుఁడు' ఇచ్చియుండుటచేత 'అసమేక్షణుఁడు' ఈయకున్నను దోషము లేదు. ఈవిషయము 'భారతి'లోని నా వ్యాసమున నిరూపించియున్నాను. 'అతద్గుణసంవిజ్ఞానబహువ్రీహి' బహువ్రీహిలో(ఇది-తద్గుణసంవిజ్ఞాన బహువ్రీహి, అతద్గుణసంవిజ్ఞానబహువ్రీహి-అని ద్వివిధము.) అని వ్రాసి యుదాహరణాదులు చూపియున్నారు. కనుక దానిలో నిది గతార్థము.

౭. ఆక్షే:—'ఆర=అంగారకుడు'

కం. మందారార్కాలయములు... కు. సం. ౮. 3౭3.

ఇది సూర్య. ని. లో లేదు. (౧౯3 పా.)

సమా:—పైయర్థమున 'ఆర' శబ్దము స్త్రీలింగము కాదు. కనుక 'ఆరము' అను రూపముతో సూర్య. ని. లో గ్రహింపఁబడినే.

యున్నది. పంతులుగారు లేదనుటకుఁ గారణము తెలియదు. ఇట్లే "ఉపలశబ్దము స్త్రీ అన్నారు. పుం. కూడాను" (౨౦౧ పే.) అని పంతులుగారు వ్రాసినారు. కాని "ఉపలము. పుం" కూడ సూర్య. ని. ౨౬౨ పేరటలో గ్రహింపఁబడియే యున్నది. ఇట్టి ప్రమాదములు వీరివిమర్శనమునఁ జాలచోట్లఁ గలవు.

౮. ఆక్షే:—"అవాఙ్మానసగోచరము" శివతత్త్వ. ౧౯౨. భార. శాంతి. ౫. ౯౦. దీనికి నిర్ధారకములు. ఈశబ్దము సూర్య. ని. లో లేదు. "అవాఙ్మనసగోచరము" మాత్రమే ఉన్నది. సంస్కృతపండితులు "వాఙ్మనసమ్, అవాఙ్మనసమ్" మాత్రమే సాధుశబ్దాలంటారు. (౧౯3 పే.)

సమా:—వ్యాకరణము చదువుకొనిన సంస్కృతపండితులెవరును "అవాఙ్మానసము, వాఙ్మానసము" మొ. వానిని దప్పు లనరు. "అవాఙ్మనోగోచరము, వాఙ్మనోగోచరము" మొ. వానిని మాత్రమే తప్పు లనెదరు. 'వాక్, మన' శ్శబ్దములకు సమాసము వచ్చునపుడే 'అచతురవిచతు' రేత్యాది సూత్రమునఁ బాణిని 'వాఙ్మనస' అని నిపతించెను గనుక 'వాఙ్మనోగోచరము' మున్నగునవి తప్పులు. 'వాక్, మానస' శబ్దములకు సమాసము వచ్చి 'వాఙ్మానసమ్' అగుట కెట్టి యాక్షేపమును లేదు. కనుకనే విశేషము గల "అవాఙ్మనసగోచరము" సూర్య. ని. లో గ్రహింపఁబడినది. ఎట్టివిశేషమును లేని "అవాఙ్మానసగోచరము" గ్రహింపబడ లేదు.

౯. ఆక్షే:—'ఏకమతి, ఏకవాక్యత' లేవు. (౧౯3 పే.)

సమా:—'ఏక, మతి; ఏక,వాక్య' శబ్దములలో గతార్థములు. ఇట నెట్టివిశేషార్థమును లేదు. ఇట్టినిర్విశేషసమస్తశబ్దముల నన్నింటి నీయవలయు ననుట సమంజసము కా దని 'భారతి' లోని నావ్యాసమున నిరూపించియున్నాను.

౧౦. ఆక్షే:—"ఆబాలవృద్ధము, ఆబాలగోపాలము, ఆమూలచూడము" లేవు. వీనికి నిర్వ. 3.౭౯, ౪.౬౭, విక్ర. ౭.3౯. మొ. ప్రయోగములుకలవు. (౧౯3 పే.)

సమా:—సూర్య. ని. లోని "ఆ. సం. అవ్య"లో నిట్టివి చూపఁబడినవి. కనుక వీనిని ప్రత్యేకముగా గ్రహింప నక్కఱ లేదు. ఇవియే గాక యిట్టి వింక నెన్నియున్నను దానిలో గతార్థము లగును.

౧౧. ఆక్షే:—'అప్సరలు' శ్రీనాథుఁడే ప్రయోగించినాఁడు 'అప్సర' తప్పంటారు సంస్కృతపండితులు, అమరవ్యాఖ్యలు చదువనివారు. క్షీరస్వామి (గొప్పవ్యాఖ్యాత) "అప్సరా ఇతి దర్శనాత్" సాధువు అన్నాడు. ప్రాకృతములో 'అచ్ఛర' ఏలాగైనది? శిష్టులు 'అప్సరా' అంటూ ఉంటే, అశిష్టులు 'అచ్ఛరా' అన్నారు. భీమఖండము చూడండి. ఉ... సహ, స్రాక్షుఁడు భీమలింగమున కర్పణచేసినయప్సరల్ వీరూ, పాక్షు నెమర్ఘానం జనిరి... భీమ. ౫. ౩౦. (౧౯౪ పే.)

సమా:—నేనీసందర్భమున క్షీరస్వామివ్యాఖ్య మున్నగుననేకామరవ్యాఖ్యలు చదివినాను. కాని పంతులుగారు వ్రాసినట్లు 'ఆకారాంతమగు-అప్సరా' శబ్దము కల దన్న వ్యాఖ్య యొక్కటియుఁ గానఁబడలేదు. ఇఁక "క్షీరస్వామి 'అప్సరా ఇతిదర్శనాత్' సాధువు అన్నాడు" అని పంతులుగారు వ్రాయుట సరియగునో కాదో కొంచెము పరిశీలింతము.

"స్త్రియాం బహుష్వప్సరసః" అమరము. "అద్భ్యస్సృతా- అప్సరస ఇతి-ఏకాపి శబ్దశక్తిస్వాభావ్యాత్. అప్సరా ఇతి దర్శనా త్ప్రాయికం బహుత్వమ్" క్షీరస్వామివ్యాఖ్య. అమరమున 'అప్సర' శ్శబ్దము బహువచనాంతమని చెప్పినాఁడు గదా! ఒక్కయచ్చరను బహువచనాంతమగు నీ శబ్దమెట్లు చెప్పెను? అని ప్రశ్నించుకొని యీశబ్దమున కట్టిశక్తి గలదు గనుక నేకవ్యక్తిని గూడ బహువచనాంతమే చెప్పెను అని మూలమును సమర్థించి (అనది చ. అష్టా. ౬. ౪. ౪౭. సూత్రభాష్యమున) అప్సరాః' అని యేకవచనాంతప్రయోగముకలదు గనుక నమరుఁడు చెప్పిన బహుత్వము ప్రాయికము-అని క్షీరస్వామి వ్రాసినాఁడు. "అప్సరా ఇతి" అనుచోట సంధికార్యములు చేయుటచేత విసర్గలోపము వచ్చినది. ఆకారాంతమే యైనచో 'అప్సరేతి' అనియుండ వలయును. మఱియు ఇఁకడ

'అప్సర'శ్శబ్దము సకారాంతమే కాక, ఆకారాంతముకూడఁగలదా? లేదా యనువిచారణయే లేదు. పంతులుగారు పై వ్యాఖ్యనుబట్టి ఆకారాంతముగ "అప్సరా"శబ్దముకలదని సిద్ధాంతీకరించుటపొరపాటు. మఱియు "సూ. స రేఫప్సూర్వాదసిః. ఉణాది. ౪. ౬౭౬. అప్సరాః. ప్రాయేణాయంభూమ్ని అప్సరసః."అనికౌముదిలోను, అమరసుధమొదలగునమరవ్యాఖ్యలలోన "అప్సరస్స్వప్సరాః ప్రోక్తా సుమనా స్సుమనస్స్వపి"అని ద్విరూపకోశము లోను గలదు. "అస్య(=అప్సరశ్శబ్దస్య)సుభంయాశబ్దవద్రూపమితి ముక టోక్తం చింత్యమ్. అప్సరశ్శబ్దస్య సాంతత్వాత్" అని సుధావ్యాఖ్యలో నప్సరశ్శబ్దము సాంతమే యనికూడఁ గలదు. కనుక వైదికోదాహరణము తో వాచస్పతి యిచ్చిన 'అప్సరా' శబ్దము వైదికమేకాని లౌకికము కా దు. ఆప్తేయిచ్చిన "అనప్సరేవ ప్రతిభాసి" విక్రమో. ౧. అంకములో "అనప్సరా ఇవ మే ప్రతిభాసి" అనుపాఠము కొన్ని గ్రంథములలోఁ గన బడుచున్నది. తద్వ్యాఖ్యాతలు కూడఁ బై పాఠమునే గ్రహించినారు కావున నిదియు ఆకారాంతము లౌకిక మనుటకు సాధకము గాదు. "అప్ రాసు చ యా మేధా గంధర్వేషు చ యన్మనః"ఇత్యాద్యనేకస్థలములలో వేదమున ఆకారాంతము కలదు. లోకమునఁ గలదనుటకు నిర్ధారకప్రమా ణము కనఁబడ లేదు. వైదికమగు 'అప్స'శబ్దము నాధారముగాఁ జేసికొ 'అప్సరా'శబ్దమునకు వాచస్పతి వ్రాసిన వ్యుత్పత్తికూడ నిది వైదికమనియే సూచించుచున్నది. మహావిద్వాంసులును మిక్కిలిపరిశీలకులు నగురంగా చార్యులుగా రీశబ్దము నాకారాంతముగాఁ దమనిఘంటువున నీయకుండు టయు మూలనిఘంటువులలో లేకుండుటయుఁ గూడ నిది లౌకికము కాద నుటకే సాధకములు. ఇట్టి వైదికశబ్దమును శ్రీనాథుఁ డెట్లు ప్రయోగిం చును? కావుననే సూర్య. ని. ఈశబ్దమును గ్రహింపలేదు.

ఇక సంస్కృతమున ఆకారాంతమగు 'అప్సరా' శబ్దము లేకున్న చోఁ బ్రాకృతమున 'అచ్ఛరా' ఎట్లైనది? అను పంతులుగారి ప్రశ్న మునకు సమాధాన మిచ్చెదను.

ప్రాకృతవైయాకరణులు, ప్రాకృతనిఘంటుకర్తలు, సంస్కృతనాటకవ్యాఖ్యాతలు మున్నగువారందఱును సకారాంత మగు నప్సరశ్శబ్దము నుండియే "అచ్ఛరా" వచ్చిన దని వ్రాసినారు. చూడుఁడు. హేమచంద్రుఁడు తనప్రాకృతవ్యాకరణమున "సూ. ఆయురప్సరసోర్వా. ౮.౧.౨౩. ఏతయో ర న్త్యవ్యంజనస్య సో వా భవతి. ఉదా:—అచ్ఛరసా. అచ్ఛరా. సూ. హ్రస్వాత్ థ్యశ్చత్సప్సా మనిశ్చలే ... ఉదా:-అచ్ఛరా" అని వ్రాసినాఁడు. ప్రాకృతసర్వస్వమునఁ గూడ 'అప్సర'శ్శబ్దభవము 'అచ్ఛరా' అని కలదు. మఱియుఁ బ్రాకృతమంజరిలో "శ్చత్సప్సాంఛః" అను సూత్రమున "శ్లో. శ్చత్సప్సానాం త్రయాణాంచ ఛకారాదేశ ఇష్యతే, పశ్చాత్తు త్సాప్సరాశ్చేతి పచ్ఛాకుచ్ఛాచ్ఛరాః క్రమాత్" అని సకారాంతమునకే 'అచ్ఛరా' అగునని కలదు. శాకుంతలము విక్రమోర్వశీయము మున్నగు సంస్కృతనాటకములలో 'అచ్ఛరా' అను ప్రాకృతరూపము కలదు. వానిఛాయలలోను వ్యాఖ్యలలోను 'అప్సరస్' శబ్దమే దానికి మూలరూపముగా నున్నది. "మేణఆ ణామ అచ్ఛరా" ప్రాకృతము. "మేనకా నామాప్సరాః" ఛాయ. శాకుం. ౧. ౩౧ పా. విక్రమో. ౧. ౨౩.

"Childers" పాలీనిఘంటువులోఁ గూడ 'అచ్ఛరా' శబ్దము 'అప్సరస్' శబ్దభవ మనియే గలదు. వస్తుస్థితి యిట్లుండఁగాఁ బంతులుగారు సంస్కృతమున 'అప్సరా' శబ్దము లేకున్నఁ బ్రాకృతమున 'అచ్ఛరా' కాదని వ్రాయుట సరి కాదు.

భీమఖండములోని 'అప్సరల్' ముద్రణప్రమాదపతితము. 'అచ్చరల్' అనియుండవలయును. అట్లుకాక 'అప్సర'శ్శబ్దమునకే 'అప్సరలు, అప్సరసలు, అప్సరస్సులు' అను మూఁడు తత్సమరూపములు కలవని చెప్పుటకైనను 'అప్సర' అను దానికి నిర్ధారకప్రయోగములు కనఁబడలేదు. ఆంధ్రవ్యాకరణములలోఁగూడ నీరూపము సాధింపఁబడ లేదు. పై భీమఖండమునఁబోలె "వ...దివ్యాప్సరలు...కాశీ. ౩.౧౬౦" అని ముద్రిత

గ్రంథమునఁ గలదు. కాని యిక్కడ వ్రాఁతప్రతులను బరిశీలింపఁగా "దివ్యాప్సరసలు" (N. 4377; N. 2884 పరిషత్కార్యాలయమునందలి తాళపత్ర పుఁబ్రతులలో) అను సాధుపాఠము గాన్పించినది. మఱియు, భీమ. ౫. ౪౦, ౧౧౭. కాశీ. 3. ౧౬. మొదలగుచోట్ల 'అప్సరసలు' అనుటకు నిర్ధారకప్రయోగములను శ్రీనాథుఁడే ప్రయోగించియుంకుటచేత భీమ. ౫. 3౦. లో 'అచ్చరల్' అనియే యుంకుట స్వారసికము. వ్రాఁత ప్రతులలో 'అప్పరల్, అప్చరల్' మొ॥ భిన్నభిన్న పాఠములు భీమ. ౫. 3౦. లోఁ గనఁబకుచున్నవి. కావుననే సూర్య. ని. 'అప్సరలు' అను రూపమును గ్రహింపలేదు.

౧౨. ఆక్షే:—'అనుభవత' ఈశబ్దము ఆ ప్తేనిఘంటువులో లేదు. అందుచేతనే సూర్య. ని. లోనూ లేదు. తెలుగుకవులు ఇది ప్రయోగించియున్నా రని ఈనిఘంటువురచించిన పండితమహాశయులకు తెలియదు. చూడండి నారాయణకవి రచించినపంచతంత్రము.

సీ... అనుభవతకు రానియర్థంబు... మిత్రభేదము. ౭౦. (౧౯౫ పొ)

సమా:—పైశబ్దము 'అనుభవిత (=అనుభవము)' కాని 'అనుభవత' కాదు. కనుకనే ఆముక్తమాల్యద. ౨. ౨౧. పద్యవ్యాఖ్యలో శ్రీ వేంకటరామశాస్త్రులుగారు "అనుభవతకున్-అను పాఠము పొరపాటు దానికి 'అనుభవమునకు' అనునర్థమును రాదు. అందలి 'తల్' ప్రత్యయము 'అప్రసక్తము' అని వ్రాసినారు" పంతులుగారి యీ యాక్షేపము బాలకవిశరణ్యములో 'అనుగెంట' అను సౌపవిభక్తికమునకు మీరు వ్రాసిన "అనుగు + వెంట" అనువ్యుత్పత్తిని స్మృతికిఁ దెచ్చుచున్నది.

ఇక్కడకు సూర్య. ని. లో లేవని విమర్శకులు చూపిన యాంధ్ర కవిప్రయుక్తసంస్కృతశబ్దము లైనవి.

౧3. ఆక్షే:—పంచకావ్యాలలోని మాటలలో మీరు విడిచినవి కొన్ని ఎత్తివ్రాస్తాను. (౧౯౫ పొ)

సమా:— ఈయాక్షేపముతో విమర్శకు లిచ్చిన శబ్దములు చాలవఱకు గృహీతములలో గతార్థములు, అనావశ్యకములు. కనుకనే వానిని గ్రహింపలేను. గ్రంథవిస్తరము లేకుండుటకై సూక్ష్మరీతితో దానికి సమాధాన మిచ్చెదను.

ఈక్రిందిశబ్దములు లేవని విమర్శకుల యాక్షేపము.	సమాధానము.
1. అగృధ్నుః.	1. 'అ, గృధ్నువు. విణ'లలో గతార్థము. ఇట్టి నఞ్ సమాసముల నన్నింటి నీయలేదని యాక్షేపించుట సమంజసముకాదని ౪. ఆక్షేపసమాధానమున వ్రాసినాను.
2. అసాంప్రతమ్.	2. 'అ, సాంప్రతము'లలో గతార్థము.
3. ఆత్మేశ్వరః.	3. 'ఆత్మన్, ఈశ్వర' శబ్దములలో గతార్థము.
4. ఉభయాంసమ్.	4. ఇది 'సన్నమితోభయాంసం శివం' అనుదానిలోనిది. 'ఉభయ, అంస' శబ్దములలో గతార్థము.
5. ఉచ్ఛిలీంధ్రా.	5. 'ఉద్, శిలీంధ్ర' శబ్దములలో గతార్థము.
6. అత్యాదిత్యం.	6. 'అతి' 3 వ యర్థములో నిట్టివి సోదాహరణముగాఁ జూపఁబడినవి. కనుక దానిలో నిది గతార్థము. దిక్ప్రదర్శనార్థము 'అత్యగ్ని, అత్యంకుశము' వెం. కొన్ని ప్రధానపదములుగా గ్రహింపఁబడినవి.
7. అదేవమాతృకా.	7. 'అ, దేవమాతృకము. విణ'లలో గతార్థము.
8. ఉపస్నుతా.	8. 'ఉప, స్నుతము'లలో గతార్థము.
9. అవిపత్తిః.	9. 'అ, విపత్తి' శబ్దములలో గతార్థము.
10. అనాత్మనీనమ్.	10. 'అ, ఆత్మనీనుఁడు. విణ'లలో గతార్థము.
11. అంతవహ్నిః.	11. 'అంత, వహ్ని' శబ్దములలో గతార్థము.

12. ఉష్ణభా.	12. ఇది 'ఉష్ణాంశువు'లో వ్రాసిన విశేషములో గతార్థము.
13. అహివిద్విట్.	13. 'అహిరిపువు' ఉండఁగా నీపదము లేకున్న నేమి? కల్పనాసాధ్యములగు నిట్టివానిలో దిక్ప్రదర్శనమునకై కొన్నిమాత్రమే చూపెదరు. అట్లు కానిచో 'అహిశత్రువు, అహివైరి, అహిసపత్నుఁడు, అహ్యరి' మొ. పదములుమాత్రము గ్రహింపవలదా? ఈవిషయము 'భారతి'లోని నావ్యాసమున విపులముగా విమర్శింపఁబడినది.
14. అధరవాసస్.	14. 'అధర, వాసస్' శబ్దములలో గతార్థము.
15. ఉపరిచితా (కిరాతార్జునీయము.౭.౬)	15. ఇది 'ఉపరచితా' కాని 'ఉపరిచితా' కాదు. (చూ. వ్యాఖ్య.) 'ఉప, రచితము, విణ'లలో లో నిది గతార్థము.
16. ఏకవేణీ.	16. 'ఏక, వేణీ' శబ్దములలో గతార్థము.
17. అశ్వాంసుఁడు ('అనాశ్వాంసుఁడు' మాత్రము ఎత్తుకొన్నారు 'అశ్వాంసుఁడు' లేదు. ౧౬౭ పా.)	17. పంతులుగారు "సూ. ఉపేయివాననాశ్వాననూచానశ్చ. అష్టా 3. ౨. ౧౦౯. లో 'అనాశ్వాన్' కలదుగనుక 'అశ్వాన్'కూడ నుండవచ్చు నని యూహించి "అశ్వాన్" సూర్య. ని. లో లేదని యాక్షేపించినారు. కాని 'నఙ్'ఉపపదముగా నున్నప్పుడే 'అశ్'ధాతువునకు లోకమున 'క్వసు' ప్రత్యయమును, ఇడభావమును వచ్చి 'అనాశ్వాన్' అనురూపమగునని పాణిని "ఉపేయివా ననాశ్వా ననూచానశ్చ. అష్టా. 3. ౨. ౧౦౯" అనుసూత్రమునఁ జెప్పినాఁడు. కనుక 'అశ్వాంసుఁడు' అనునది యపశబ్దము. ఇట్టి యపశబ్దములు సూర్య. ని. లో లేకుం

డుట దానికి గౌరవావహము కాదా? మఱియు 'అనాశ్వాన్' మొదలగునవి కొన్నితప్పఁ దక్కిన 'క్వసు' ప్రత్యయాంత శబ్దములు వైదికములు. ఐనను వీనిలోఁ గొన్నింటిని మహాకవులు తమ కావ్యములలోఁ బ్రయోగించియున్నారు. వానిని మాత్రమే నిఘంటువులు గ్రహించును. కనుక 'ఆరివాంసుఁడు' మున్నగు-కవిప్రయుక్తములు గాని 'క్వసు' ప్రత్యయాంత శబ్దములు సూర్య. ని. లో నీయలేదని వీరివ్యాసమున నక్కడక్కడఁ జేసిన యాక్షేపము లాదరణీయములు కావు.

18. ఆదిపూరుషః 19. ఆదిపురుషః (ఈరెండూ లేవు)	18. 19. ఈరెండును 'ఆది, పూరుష; ఆది, పురుష' శబ్దములలో గతార్థములు.
20. అపస్పశా (మాఘము. ౨.౧౧౨)	20. ఇక్కడ శ్లేష కలదు. కనుక "అ, పస్పశ; అప, స్పశ" శబ్దములలో గతార్థము.
21 ఔర్ధ్వీ.	21. సంబంధార్థమున సాధారణముగా వచ్చు 'అణ్' ప్రత్యయముచేత సిద్ధించెడి రూపము లసంఖ్యాకములుగా నుండును. కనుక నట్టివాని నన్నింటిని గ్రహించుట నిఘంటుసంప్రదాయము కాదు. వానిని వ్యాకరణమువలననే తెలిసికొనవలయును.
22 అభూమిః.	22. 'అ, భూమి' శబ్దములలో గతార్థము.
23. ఉద్రశ్మి.	23. 'ఉద్, రశ్మి' శబ్దములలో గతార్థము.
24 అరవిందనాభిః (మాఘము 3-౬౫)	24. 'అరవిందనాభియే' కాక 'అరవిందనాభుఁడు' అను రూపాంతరముకూడఁ గలదు. ఇట్లే కమలనాభుఁడు, సారసనాభుఁడు' మొదలగు ననేక

శబ్దములు కలవు. ఇవియన్నియును 'నాశి...
శబ్దములలో సోదాహరణముగా వ్రాసిన విశే...
ములలో గతార్థములు.

25. అసంబాధమ్. — 25. ఇదియు 'నఞ్'సమాసమే కనుకఁ దత్తచ్ఛబ్దము...
లలో గతార్థము.

26. అధివేలమ్. — 26. విభక్త్యర్థమున నవ్యయీభావము వచ్చి నిష్ప...
న్నములగు నిట్టిశబ్దము లనంతములుగా నుండ...
ను. వానినన్నింటిని నిఘంటువులు గ్రహించుట...
యశక్యము. కనుక సవిశేషములగు 'ఉపగిరమ్...
ఉపగిరి' మున్నగువానినే తప్పఁ దక్కిన యవ్య...
యీభావసమాసముల నన్నింటిని నిఘంటు...
వులు గ్రహింప నక్కఱ లేదు.

27. ఉత్తమలాభః ('ఉత్తమసాహసము'వంటిదే. వ్రాసినారు కారు) — 27. 'ఉత్తమ,లాభ' శబ్దములలో గతార్థము. 'ఉత్త...
మ సాహసము'వంటిది కాదు. అందర్థవిశేషము...
కలదు. ఇందెట్టివిశేషమును లేదు.

28. ఉత్పిత్సుః. — 28. 'ఉద్, పిత్సు' శబ్దములలో గతార్థము.

29. అస్వర్గ్యమ్. — 29. 'అ, స్వర్గ్యము'లలో గతార్థము.

" వ్యాకరణశాస్త్రమంతా వ్రాసిఉన్నవే చాలామాటలు సూర్య...
ని. లో లేవు. అట్టివాటిలో కొన్నిముందుగా ఉదాహరిస్తాను." అని విమ...
ర్శకులు వ్రాసి చూపిన శబ్దములకు సమాధానములను జిత్తగింపుఁడు...

౧౪. ఆక్షే:— " అహర్దివి, అహస్పతి, అహఃకరుడు " ఇవి ఆప్టే...
ని. లో ఉన్నవి. వీరు విడిచినారు. రూపాంతరము లన్నీ నిఘంటువులో...
వ్రాయకపోతే విద్యార్థులకు అవి ఉన్నవని తెలియదు. ఎవరైనా అ...
ప్రయోగిస్తే తప్పు లనుకొంటారు....(౧౯౯ పే.)

సమా:— "అచతురవిచతు" రేత్యాదిసూత్రమున (అష్టా. ౫...
౪. ౭౭) 'అహర్దివము' అని నిపతింపఁబడినది గనుక లోకమున 'అహర్ది...

ము' అనునదియే సాధువు. 'అహర్దివి' అనునది వైదికము. ఈ వైదిక శబ్దము నీయ లేదని యాక్షేపించుట సమంజసము కాదు. ఆప్తే వైదికలౌకిక శబ్దనిర్ణయమునఁ జాలచోట్లఁ దప్పినాఁడు. ఈవిషయ మింధే స్థలాంతరమున విశదముగా నిరూపించితిని.

'అహస్పతి' అపశబ్దము. "అహరాదీనాం పత్యాదిషువా రేఫః" అనువార్తికముచేత "అహర్పతి, అహఃపతి, అహఃపతి" అనురూపము లగును. సత్వవిధాయకము లేదు గనుక 'అహస్పతి' అసాధువు. అందుచేతనే ప్రామాణికులగు రంగాచార్యులుగారును, విల్యమ్సును దమనిఘంటువులలో నీశబ్దమును గ్రహింపలేదు.

కస్కాదిగణములో 'అహస్కర' శబ్దమును బఠించి "కస్కాదిషు చ. అష్టా. ౮. ౩. ౪౮" అను సూత్రముచేత దానికి నిత్యముగా సత్వమును బాణిని విధించినాఁడు. కనుక 'అహఃకరుఁడు' అను రూపము తప్పు. 'అమరసుధ' మొదలగు నమరవ్యాఖ్యలన్నియు నిట్లే వ్రాసినవి. అందుచేతనే రంగాచార్యులుగారు, విల్యమ్సు, ఈ రూపము నీయలేదు.

ఇట్టి యపశబ్దములు సూర్య. ని. లో లేకుండుట గుణమా? దోషమా?

౧౬. ఆక్షే:— "అహోరాత్రము. సం. వి. అ. పుం." అని సూర్య. ని. లో నున్నది. కాని ఆప్తే. ని. లో "అహోరాత్రః, అహోరాత్రమ్" అని రెండులింగములలో ప్రయోగములతో కూడా ఈశబ్దమున్నది. సంస్కృతవిద్యార్థుల కీలాగున తెలుస్తుంది. (౧౯౯ పే.)

సమా:— 'అహోరాత్ర' శబ్దమునకు నపుంసకలింగము వేదమున నుండును. లోకమునఁ బుంలింగము మాత్రమే యుండును. అని "హేమంతశిశిరావహోరాత్రే చ ఛందసి. అష్టా. ౨. ౪. ౨౮; రాత్రాహ్నాహాః పుంసి. అష్టా. ౨. ౪. ౨౯" అను సూత్రములలోఁ బాణిని యనుశాసించినాఁడు. ఈయర్థమునే అమరుఁడును "శ్లో. రాత్రాంతాః ప్రాగసంఖ్యకాః" అని యనువదించినాఁడు. ఇఁక ఆప్తే చూపిన మను

స్మృతిప్రయోగమునే వాచస్పత్యకారుఁడును జూపి "రాత్రాహ్నాహా
పుంసీతి పాణిన్యుక్తేః పుంస్త్వేపి ఆర్షత్వాత్క్లీబమ్"అని స్పష్టముగా నపు
సకలింగ మార్ష మని వ్రాసినాఁడు. రంగాచార్యులుగారు కూడ నపుంస
లింగము వైదిక మని వ్రాసినారు. ఇప్పుడు ఆప్టే. ని. వ్రాసినది తప్పో
సూర్య. ని. వ్రాసినది తప్పో ? విద్వాంసులు నిర్ణయించి సంస్కృ
విద్యార్థులకుఁ దెలుపుదురుగాక.

౧౩. ఆక్షే:— 'ఇషణిః, ఇషణ్యా' లేవు. (౧౯౯ పే.)

సమా:—ఇవి రెండును వైదికములు. లోకమున నుండవు. 'అగువు
వైదికము కాకున్నను వైదిక మనుకొని " 'అగువు' వంటి వైదికశబ్దము
లను సూర్య. ని. లో గ్రహించినారు. అట్టివానిని వైదికము లని తెలి
యక విద్యార్థులు ప్రయోగించి నిందపాలు కావలసివస్తుంది. అందు క
త్తరవాదు లీనిఘంటు నిర్మాతలు " అని వ్రాసినపంతులుగారే పై వైదిక
శబ్దములు గ్రహింప లేదని యాక్షేపించుట యతివిచిత్రము. వాచస్పత్య
మున నివి వైదికము లని స్పష్టముగాఁగలదు. చూడుఁడు. "ఇషణి. స్త్రీ
ఇష-భావే అని. వేదే నిపాతనా ద్గుణాభావః... ఇషణిమిచ్ఛతి క్యచ్.
వేదే నిపాతనా దిలోపః. ఇషణ్యతి ... తతః భావే అ. ఇషణ్యా."

ఇప్పు డైనను ఆప్టే వైదికలౌకిక శబ్దనిర్ణయమునఁ దప్పిపోయినా
డని పంతులుగా రంగీకరించెదరా? లేదా? ఇట్టివాని నన్నింటిని సవిమర్శ
ముగాఁ బరిశీలించి యర్హము లగువానినే సూర్య. ని. గ్రహించినది.

౧౭. ఆక్షే:— "అ. వ. సం. అవ్య. దీని యాద్యక్షరము వైకల్పి
కముగా లోపించును. ఉదా : అవతంసము, వతంసము" ఎంత హాస్యా
స్పదముగా ఉన్నది! ఆప్టేలో వైకల్పిక మని లేదు. కొన్నిచోట్ల అకారము
లోపిస్తుంది. ఉదా : 'వ గాహ్య' అని ఉన్నది. అవనతము, అవమా
నము, అవతారము మొదలగువాటిలో "అ" లోపిస్తుందా ? ఇదెక్కడి
శాస్త్రము ? ఇదెట్టిపాండిత్యము ? (౧౯౯, ౨౦౦ పే.)

సమా:—"వష్టి భాగురి రల్లోప మవాప్యో రుపసర్గయోః" అని భాగురిమతమున 'అవ' అను దానిలోని "అ" కారము లోపించును. పాణిని మతమున లోపింపదు. కనుకనే వైకల్పికముగా లోపించు నని సూర్య. ని. వ్రాసినది. 'అవసితము' మొ. శబ్దములన్నింటను భాగురిమతమున 'అ' తప్పక లోపించును. 'అవగ్రహము, అవధానము' మొదలగువానిలో లోపింపలేదా? ఆప్టే వ్రాఁత నిష్ప్రమాణము. కనుకనే వాచస్పత్యమున "అవ. అస్య వా అతో లోపః" అనియే కలదు. కౌముది చదువుకొన్నవారి కెల్ల నిది తెలిసినదే.

౧౭. ఆక్షే:— 'అవినాయిన్, అవిశాయిన్' మొ. లేవు. (౨౦౦ పే.)

సమా:—ఇవి ఆప్టే, వాచస్పతీ, విల్సను, రంగాచార్యాది సంస్కృతనిఘంటువులలో లేవు. కాశికావృత్తిలోని గ్రహ్యాదిగణములో మాత్ర మున్నవి గణరత్నమహోదధిలోని గ్రహ్యాదిగణములో లేవు. కౌముదీగణపాఠములో "అవిశాయిన్" లేదు. సంస్కృతనిఘంటువులు కూడ గ్రహింపనివియు, గణపాఠములలోను సందిగ్ధములుగా నున్నవియు నగు నిట్టిశబ్దము లాంధ్రనిఘంటువులలో గ్రహింపఁబడ లేదని యాక్షేపించుట సమంజసమో యసమంజసమో యుభయభాషాభిజ్ఞులు నిర్ణయింతురుగాక.

విమర్శకులు తమవిమర్శనమున నక్కడక్కడ నిట్టివియే యింకను కొన్నిశబ్దము లిచ్చి యివి సూర్య. ని. లో లేవని యాక్షేపించినారు. వానికిఁ గూడ నిదియే సమాధానము.

౧౮. ఆక్షే:—"అనుచ్ఛిత్తిధర్మా, అధిజ్యధన్వా, అంగవిమంగః" ఇవిలేవు. (౨౦౦ పే)

సమా:—"ధర్మా దనిచ్కేవలాత్. అష్టా. ౫. ౪. ౧౨౪" అను సూత్రముచేత "గృహీతధర్మా, ఆదృతధర్మా, నివృత్తిధర్మా" మున్నగు అనేకశబ్దములు కాఁగలవు. వీని నన్నిటిని సంగ్రహించుట యశక్యము.

కనుకనే యుదాహరణార్థము "అధర్మము" మొ. కొన్ని గ్రహించి 'ధర్మ
శబ్దములో నీరూపముల నెల్లఁ దెలిసికొనుటకు వీలుగా నుండునట్లు
పైసూత్రముయొక్క భావమును వ్రాసి యుదాహరణములు చూపి
యున్నారు. ఇట్లే "ధను" శ్శబ్దమునను వ్రాయఁబడినది. స్వరూపప్రదర్శ
నార్థము "ఇక్షుధన్వఁను" మున్నగునవి కొన్ని చూపఁబడినవి. కనుక
నిట్టివి యన్నియును దత్తచ్ఛబ్దములలో గతార్థము లగును.

'అంగవిషంగ' శబ్దము కౌముదిలోను, ఆప్తే. ని. లోను లేదు
కౌముదిలో "సమాసేంగులే స్సంగః. అష్టా. ౮. ౩. ౮౦" లో "అంగుళి
షంగః" అని కలదు. అది సూర్య. ని. లో గ్రహింపఁబడియే యున్నది
'అంగులిషంగము' అనుదానికి బదులు గా 'అంగవిషంగము' అని పంత
లుగారు వ్రాసినారేమో ?. ఇట్టిప్రమాదములు వీరివ్యాసముఁ జాల
గలవు. వానిలోఁగొన్ని నావ్యాసమున నాయూస్థములలోఁ జూపినాను

౨౦. ఆక్షే:— ఉత్తరతీరమ్, ఉత్తరతారమ్— రెండూ లేవు..
ఇట్టిశబ్దములు లేనందున ఈనిఘంటువు ప్రమాణముగా అంగీకరించ ద
నది కాదు. (౨౦౦ పే)

సమా:—"దిక్ఛబ్దేభ్య స్తీరస్య తారభావో వా" అను వార్తికమ
చేత, దిగ్వాచకశబ్దములకుఁ బరముగా నున్న 'తీర' శబ్దమునకు 'తార
అను నాదేశము వికల్పముగా వచ్చును. కనుక "ఉత్తరతీరమ్, ఉత్తరతా
రమ్, ఉదక్తీరమ్, ఉదక్తారమ్, అవాక్తీరమ్, అవాక్తారమ్, దక్షిణతీరమ్
దక్షిణతారమ్" మొదలగు ననేకశబ్దము లగును. వాని నన్నిటిని ప్రత్యే
ముగా గ్రహించిన వ్యర్థముగా గ్రంథము పెరుఁగును. కనుక 'తార' శ
ము:లో నీవిషయమును సోదాహరణముగాఁ జూపి పైశబ్దముల నన్నిటి
ప్రత్యేకముగా గ్రహించుట మానివేసినారు. వాచస్పత్యాది నిఘంట
కర్తలు గూడ నీమార్గముునే యనుసరించినారు.

౨౧. ఆక్షే :— అధోధః, ఉపర్యుపరి, అధ్యధి, మొ. లేవ
(౨౦౦ పే.)

సమా:— 'అధస్, ఉపరి, అధి' అనువానిని సూర్య. ని. లోఁ బ్రత్యేకముగా గ్రహించియున్నారు. వానియామ్రేడితరూపము లగు 'అధోధః'మున్నగు శబ్దములను గ్రహింపలే దనుట సమంజసము కాదు. అట్లుకాక యామ్రేడితరూపములను గూడ నీయవలయు ననునెడల "వనే, వనే, వృక్షం వృక్షమ్, మందం మందమ్, సుందర సుందర, చోర చోర, సర్పస్సర్పస్సర్పః"మున్నగువాని నన్నిటిని గ్రహింప వలసియుండును. అట్లు గ్రహించుట యశక్యము. అది నిఘంటు సంప్రదాయము కూడఁ గాదు.

౨౨. ఆక్షే:—ఆచర్యమ్. (=కర్మశోభనమ్), అపరపరా, అపర కర్మ- లేవు. (౨౦౦ పో)

సమా:- 'ఆచర్యము' అనుశబ్దము సూర్య. ని. లో "ఆచరింపఁ దగినది" అనునర్థముతో నున్నది. కాని. "సూ. ఆశ్చర్య మనిత్యే. అష్టా. ౬. ౧. ౧౪౭." లో "అనిత్యేకిమ్. ఆచర్యం కర్మ శోభనమ్" అని కౌముదిలో దీనికి "శోభనకర్మము" అను నర్థము కూడఁ గలదు. ఆయర్థము సూర్య. ని. లో లేదు, అని పంతులువారి యాక్షేపము. ఇదిచూడఁగా "అక్షయ్యము అనుదానికి 'గ్రాసమాత్రభిక్ష' అను నర్థము శ్రీనాథుని కాశీఖండమునఁ గలదు. ఆయర్థము సూర్య. ని. వారియ్య లేదు" అని ప్రమాథిసంవత్సరాది సంచికలో వ్రాసిన వడ్లమూడి వేంకటరత్నముగారి వ్రాఁత స్మృతికి వచ్చి నవ్వు వచ్చుచున్నది. ఆఙ్పూర్వకమగు "చర" ధాతువునకు అద్భుతార్థము గమ్యమాన మగునప్పుడే 'సుట్' వచ్చి 'ఆశ్చర్యమ్' అనురూప మగును. అద్భుతార్థము గమ్యమానము కానప్పుడు 'సుట్' రాదు. కనుక 'ఆచర్యమ్'అను రూపమే యుండు నని పై కౌముదికిఁ దాత్పర్యము. ఈవిషయమును స్పష్టపఱుచుటకే కాశికలో నిచ్చిన 'ఆచర్యం కర్మ శోభనమ్' అనువాక్యమునే కౌముదీకారుఁడు గూడ నుదాహరించినాఁడు. ఆవాక్యమునకు "శోభనమ్=మంచి, కర్మ=పని, ఆచర్యమ్=ఆచరింపఁదగినది." అని యర్థము. ఇక్కడ నద్భుతార్థస్ఫూర్తి లేదుగనుక 'సుట్' రాలేదు. వస్తుస్థితి యిట్లుండఁగాఁ బంతులుగారు పై

కాముఁడినిబట్టి 'ఆచర్య' శబ్దమునకు 'శోభనకర్మము' అనునర్థము కల దనుకొని యాయర్థము సూర్య. ని. లో లే దని యాక్షేపించుట సరి కాదు.

'అపరపరా' ఈశబ్దము కౌముదిలో "సూ. అపరస్పరాః క్రియాసాతత్యే. అష్టా. ౬. ౧. ౧౪౪"లో "క్రియేత్యాది కిమ్. అపరపరా గచ్ఛంతి" అనుచోటఁ గలదు. పంతులుగారిక్కడ 'అపరపరా' ఆకారాంత స్త్రీలింగ మనుకొన్నారు కాఁబోలు. అది కాదు. పుంలింగము. బహువచనాంతము. సంధిని విసర్గలోపము. క్రియాసాతత్యరూపవిశేషార్థము గమ్యమాన మగునపుడు 'సుట్' నిపాత మైనదిగనుక నట్టివిశేషము గల 'అపరస్పర' శబ్దము సోదాహరణముగా సూర్య. ని. లో గ్రహింపఁబడినది. ఇఁక నట్టి విశేషమును లేని 'అపరపరము' మున్నగు ప్రత్యుదాహరణశబ్దములు సూర్య. ని. లోని 'అపర, పర' ప్రభృతిశబ్దములలో గతార్థములుగనుక వాని నీయ లే దని యాక్షేపించుట సరికాదు.

'అపరకరః' ఈశబ్దము ఆప్టే. ని. లోను, కౌముదిలోను లేదు. కాని "సూ. అపస్కరో రథాంగమ్. అష్టా. ౬. ౧. ౧౪౯. అపకరో న్యః" అని కౌముదిలోఁ గలదు. 'అపకరః' అనుదానినే పంతులుగారు పొరపాటున 'అపరకరః' అని వ్రాసినారుకాఁబోలు. సవిశేషమగు 'అపస్కర' శబ్దము సూర్య. ని. లో గ్రహింపఁబడియే యున్నది. నిర్విశేషమగు 'అపకర' శబ్దము సూర్య. ని. లోని 'అప, కర' శబ్దములలో గతార్థముగనుకఁ ద్యజింపఁబడినది.

౨౩. ఆక్షే:-'ఇక్షువాహణమ్' ఆప్టేలో ఉన్న దయినా దీనిలో లేదు. (౨౧౦ పు)

సమా:—ఈశబ్దము ఆప్టే. ని. లో లేదు. "సూ. వాహన మాహితాత్. అష్టా. ౮. ౪. ౮ ...ఇక్షువాహణమ్." అని కౌముదిలోఁ గలదు. కాని, సూర్య.ని. లోని 'వాహన' శబ్దమున దానికి ణత్వ మెప్పుడు వచ్చునో యెప్పుడు రాదో సోదాహరణముగా వ్రాసియున్నారు. అట్లువ్రాసిననే యిట్టివాని నన్నింటిని సంగ్రహింపవీలగును. అట్లుకాక 'ఇక్షువా

హణము' ఒక్కటిమాత్ర మిచ్చినచో "ఇక్షువాహణమ్, వ్రీహివాహణమ్, క్షీరవాహణమ్, ఋషవాహణమ్" మున్నగు ననేకశబ్దము లగు నని తెలియదు. అందుచేతనే సూర్య. ని. ఈమార్గము నాశ్రయించినది.

౨౮. ఆక్షే:- 'అపథం, అపంథాః, అపథః' వీటిలో మూడోది మాత్రమే సూర్య. ని. లో ఉన్నది. (౨౦౦. పే.)

సమా:—సూర్య. ని. లోని 'అపథము'లో విశేషణవిశేష్యార్థములు రెండు నిచ్చినారు. కనుక దానిలో మొదటిది మూఁడవదియు సంగృహీతములైనవి. ఈవిషయము గ్రహింపక పంతులుగారు "మూడోది మాత్రమే సూర్య. ని. లో ఉన్నది"అనుట యసత్యము.

'అపంథాః' అనుదానితత్సమరూపము 'పథిన్' శబ్దతత్సమరూపము ననుసరించి యుండును.'అన్యేషాం చ వా లు గంత్యస్య'అను చింతామణి సూత్రవ్యాఖ్యలో సహోబలుఁడు 'పథిన్' శబ్దమునకు 'పథము' అనురూపము తత్సమమున నగు నని వ్రాసినాఁడు. కనుక 'అపథిన్' శబ్దమునకుఁగూడ 'అపథము' అనురూపమే తత్సమమున నగును. సూర్య. ని. లోని 'అపథము'లో 'వి. అ. న.' అనియే కాక 'వి. అ. న, న్. పుం.' అని వ్రాసినచో నిది యును గృహీతమగును. ఆవిధముగానే యనుబంధములో గ్రహించెదరు.

౨౯. ఆక్షే:—ఆజానేయ శబ్దానికి స్త్రీలింగరూప మున్నది. 'ఆజానేయీ'. ఇది విడిచినారు. 'అతికేశా, అతికేశీ, అనుశిష్టము లిందు లేవు. ఏలాగున ఇవి విద్యార్థులు తెలుసుకోగలరు ఈనిఘంటువు ఉంచుకుంటే? (౨౦౧. పే)

సమా:- 'ఆజానేయ' శబ్దమునకు స్త్రీలింగమున 'ఆజానేయీ' అనురూప మగు నని వాచస్పత్యరంగాచార్యనిఘంటువులలో లేదు. 'ఆజానేయ' శబ్దము తురగాదిశబ్దములవలె జాతివాచకము కాదుగనుక "సూ. జాతే రస్త్రీ విషయా దయోపధాత్. అష్టా. ౪. ౧. ౬౩" అనుసూత్రముచేత 'ఙీష్' రాదు. జాతివాచక మన్నను 'అయోపధాత్' అనునిషేధ

ముండుటచేతను "యోపధప్రతిషేధే హయగవయముకయమనుష్య మత్స్యానామప్రతిషేధః" అనువార్తికమున సంగృహీతము కాలేదు గనుకను 'ఙీష్' రాదు. గౌరాదిగణములోఁగూడ లేదుగనుక "షిద్గౌరాదిభ్యశ్చ. అష్టా. ౪. ౧. ౪౧." అనుసూత్రముచేతను 'ఙీష్' రాదు కనుక 'అజానేయీ' అనుట తప్పు. "పుంయోగాదాఖ్యాయామ్. అష్టా. ౪. ౧. ౪౮." అనుసూత్రముచే వచ్చు 'ఙీష్' రావచ్చునుగాని యతి దీక్షితమతమునఁ బుంవాచకశబ్దము లన్నింటికిని సాధారణముగా వచ్చునదియేగనుక దానిచే సిద్ధించినస్త్రీలింగరూపములు నిఘంటువుల చూపవు. విశేషముగల 'హయీ, గవయీ' మున్నగు స్త్రీలింగరూపములను మాత్రము తప్పక నిఘంటువులు చూపును. నిఘంటురచయితలందఱు నీమార్గముననే యాశ్రయించినారు. అందుచేతనే వాచస్పత్య రంగాచార్యనిఘంటువులలో వలెనే సూర్య. ని. లోఁ గూడ నీస్త్రీలింగరూపము త్యజింపఁబడినది.

"అతికేశా, అతికేశీ" అనునవియే కాక 'అసంయోగోపధములనుపసర్జనములు ద్వ్యచ్కములు నగుస్వాంగవాచకశబ్దముల కన్నింటికి నిట్లే రెండురూపములు నుండును. కనుక "అతికచా, అతికచీ; అధికకచా, అధికకచీ; దీర్ఘకచా, దీర్ఘకచీ; నీలకచా, నీలకచీ; మృదుకచా, మృదుకచీ; అధికకేశా, అధికకేశీ; దీర్ఘకేశా, దీర్ఘకేశీ; నీలకేశా, నీలకేశీ; మృదుకేశా, మృదుకేశీ" మున్నగురూపము లగును. ఇట్లే తక్కిన స్వాంగవాచకశబ్దముల కన్నిటికిని రెండురూపములు నుండును. ఇట్టివానితో నిఘంటువుల నింపుట మొదలిడినచో వ్యర్థముగా గ్రంథము పెరుఁగును. అట్లు పెంచుట నిఘంటుసంప్రదాయవిరుద్ధము. సూర్యరాయాంధ్రనిఘంటువునే కాక దేని నుంచుకొన్నను వ్యాకరణమువలననే తెలిసికొనదగిన పైరూపము లన్నియును దెలియును.

౭౨. ఆక్షే:—అలుక్సమాసాలలోని "ఓదనస్యపాచకః, అపాంస్రష్టా" మొ. మాటలు లేవు. 'అప్స్రష్టా' అన గూడదే, 'అపాంపతి' వ్రాసినవారు 'అపాంస్రష్టా' ఎందుకు విడిచినారు? (౨౦౨ పే)

సమా:—పై రెండును అలుక్సమాసము లనుకొనుట తప్పు. అవి వ్యస్తము లు కాని సమస్తము లు కావు. చూడుడు. "సూ. తృజకాభ్యాం కర్తరి. అష్టా. ౨. ౨. ౧౫. కర్త్రర్థతృజకాభ్యాం షష్ఠ్యా న సమాసః. అపాం స్రష్టా, వజ్రస్య భర్తా, ఓదనస్య పాచకః" కౌముది. ఇది చూచియే కదా పంతులుగారు పైయాక్షేపము చేసినది ? దీనికి వారేమి యర్థము చేసికొనిరో ?

మఱియుఁ బై సూత్రమునఁ జెప్పినషష్ఠీసమాసనిషేధము కారక షష్ఠికే కాని శేషషష్ఠికిఁ గాదు. కనుకఁ దృజంతముతో శేషషష్ఠి సమసింపవచ్చును. ఇట్లే తృన్నంతముతోఁగూడ సమాసము రావచ్చును. అప్పుడు 'అప్స్రష్టా' అనవచ్చును.

"అపాంపతిః" "అపాంస్రష్టా" వంటిది కాదు.

౨౭. ఆక్షే:—అలుక్సమాసాలలోది 'ఆయుష్టోమః' (అష్టా. ౮. 3. ౮3.) లేదు. (౨౦ ౨పా.)

సమా:—"జ్యోతిరాయుషః స్తోమః. అష్టా. ౮. 3. ౮3" అను సూత్రసంఖ్యను జూపియు 'ఆయుష్టోమ' శబ్ద మలుక్సమాసములలోని దనుకొనుట మిక్కిలి తప్పు. పైసూత్రము షత్వవిధాయకము గాని యలుగ్విధాయకము కాదు.

౨౮. ఆక్షే:—'ఉదశ్విత్కతిపయ్యా' ఇదిలేదు. (౨౦౨ పా.)

సమా:—ఇది కౌముదిలోను, ఆప్తే. ని. మున్నగువానిలోను గూడ లేదు. "పోటాయువ" తీత్యాదిసూత్రమున 'ఉదశ్విత్కతిపయమ్' అనిమాత్రము కౌముదిలో నున్నది. దానినే పై విధముగా పంతులుగారు వ్రాసినారేమో ? 'ఉదశ్విత్కతిపయమ్' అనుచోటఁగూడ 'కతిపయ' శబ్దవిషయమునసే విశేష ముండుటచేత ద్వితీయసంపుటమున 'కతిపయ' శబ్దములో సవిమర్శముగాను సోదాహరణముగాను దానికి సంబంధించిన విషయము వ్రాయఁబడియున్నది.

౫. ఆప్టే:—“అజకవః, అజకవమ్, అజకావః, అజకావమ్
అజగమ్, అజగవమ్” ఇట్లు రూపాంతరములతో ఆప్టే. ని. లో ఉన్నట్లు
శబ్దాలు అన్ని వ్రాయడము నిఘంటుకారులకు విహితధర్మము
(౨౦-౨ పే.)

సమా:—“అజకవమ్, అజకావమ్, అజగవమ్” అను పర్యాయ
పదములు నపుంసకలింగములుగా (శివుని విల్లు, అను నర్థమున) సూర్య.
ని. లో నున్నవి. “అజకవః, అజకావః, అజగమ్” అను పదముల
సూర్య. ని. లో లేక ఆప్టే. ని. లో మాత్రము కలవు. కనుక వీని
గూడ గ్రహించుట నిఘంటుకారులకు విహితధర్మ మని పంతులుగారు
సెలవిచ్చినారు. కాని సూర్యరాయాంధ్రనిఘంటురచయితలు పంతుల
గారు సెలవిచ్చినట్లు ఆప్టే. ని. లోని శబ్దములను ముక్కికి ముక్కి తెనిఁగిం
పెట్టువారు కాకపోవుటచేతఁ బై శబ్దముల నన్నిటిని గ్రహింపలేదు. చూ
డుఁడు. “అజకవ. అస్త్రీ” అని వాచస్పత్యములో నుండుటచే ఆప్టే
‘పుం. న’ అని వ్రాసినాఁడు. కాని వాచస్పత్యములో నాశబ్దమునకు
ప్రమాణముగా నిచ్చిన శబ్దార్ణవమున “ధను ష్యజగవం యుగ్య మజకా
మజీకవమ్”అని నపుంసకము గానే కలదు. మఱియు నమరసుధావ్యాఖ్య
లో“అజకౌ విష్ణుబ్రహ్మాణౌ వా తీతి అజకవమ్’ అని నపుంసకలింగముగా
గ్రహింపఁబడినది. ఇట్లే వంద్యఘటీయసర్వానందప్రణీత మగు ‘టీక
సర్వస్వ’ మనుమఱియొకయమరవ్యాఖ్యలోఁ గూడఁ గలదు. వాచస్పత్య
ములో ‘అస్త్రీ’ అనుటకుఁ బ్రమాణము కనఁబడలేదు. మహావిద్వాంస
లగు పరవస్తురంగాచార్యులుగారు గూడఁ దమ నిఘంటువులో దీని
నపుంసకము గానే గ్రహించినారు. ఇన్నివిధములఁ బరిశీలించి
సూర్య. ని. దీనిని పుంలింగముగా గ్రహింపలేదు.

“అజకావ...శివధనుషి. న.”అని వాచస్పతి. ఇట్లే సుధావ్యాఖ్య
రంగాచార్యప్రభృతినిఘంటుకర్తలును వ్రాసినారు. ఆప్టే. “పుం. న” అ
వ్రాయుట సరికాదు.

"అజగమ్. న... శివధనుషి... ప్రజ్ఞాదిత్వాత్స్వార్థే అణ్. ఆజగమపి. శివధనుషి. స్థాణోర్ధను ష్యాజగ మిత్యమరమాలా." అని వాచస్పత్యము. ఇక్కడ వాచస్పతి యమరమాలలో 'ఆజగమ్'అని యుండుటచే 'అజగమ్' అను రూపమొకటి కల్పించి దానిపైఁ బ్రజ్ఞాద్యణు చేసి 'ఆజగమ్' అనురూపమును సాధించినాఁడు. కాని "అజగవశబ్దాత్ ప్రజ్ఞాదిత్వా దణి ఆజగవ మపి. స్థాణో ర్ధను రాజగవ మిత్యమరమాలా" అని సుధావ్యాఖ్య. ఇతరము లగునమరవ్యాఖ్యలలోను పైయమరమాలా శ్లోకమున 'ఆజగవమ్' అనియే కలదు. కనుక వాచస్పతి గ్రహించినపాఠము సరియైనది కా దనుట స్పష్టము. పద్యనిఘంటువులలోఁ గాని రంగాచార్యాదిప్రామాణికనిఘంటువులలోఁ గాని "అజగ, ఆజగ" శబ్దములు లేవు. అదియును పైరూపములు లే వనుటకే సాధకము.

వస్తుస్థితి యిట్లుండగా నిర్విమర్శముగా నాప్తేపండితుఁడు వాచస్పత్యాదులనుండి గ్రహించినయిట్టిశబ్దముల నన్నిటిని సూర్య. ని. లో గ్రహింప లే దని యాక్షేపించుట యుక్తము కాదు.

౩౦ ఆక్షే:—'అన్యథాకారము' వ్రాసినవారు 'ఇత్థంకారము, ఏవంకారము' విడిచిపెట్టడమునకు కారణము కనబడదు. (౨౦౨ పే)

సమా:—"అన్యథైవంకథమిత్థంసు సిద్ధాప్రయోగశ్చేత్. అష్టా. ౩. ౪. ౨౭" అను పాణిన్యనుశాసన ముండుటచేత నందులోని 'అన్యథాకారము' వ్రాసినవారు తక్కినవి వదలుటకుఁ గారణము కనఁబడ దని పంతులుగా రాక్షేపించినారు. కాని సూర్య. ని. లో నిచ్చిన 'అన్యథాకారము' నకును, పాణిన్యనుశాసనమున నున్న 'అన్యథాకారము'నకును నెట్టిసంబంధమును లేదు. పైసూత్రముచే సిద్ధించు 'అన్యథాకారము' ణములన్తావ్యయము. సూర్య. ని. లోనిది విశేష్యము. కనుకఁ బైయాక్షేపము రూపైక్యభ్రమజనితము. పంతులుగారు తమవిమర్శనమునఁ జాలచోట్ల నిట్లే పరస్పరసంబంధము లేనిశబ్దములకు సంబంధము కలవానినిగా భావించి వ్రాసియున్నారు. ఆప్తే.ని. యున్నగు వానిలోని శబ్దములు

చూచికొనుటయే తక్క నవి ప్రకృతోపయోగు లగునా? కావా? యనువిమర్శనము చేయకుండుటచేత నట్టి దోసఁగులు పొసఁగినవి. సూర్య. ని. ఆంధ్రనిఘంటువు కనుకఁ గేవలసంస్కృతమున నున్న యవ్యయముల నన్నిటిని గ్రహింపక తెలుఁగున కావశ్యకము లగువానిని మాత్రమే గ్రహించినది. అట్లుకాక యవ్యయముల నన్నిటిని గ్రహింపవలయు నన్న "తు, హి, చ, స్మ, హ, వై" మొదలగువానిని, "క్త్వా, తుమున్, ణముల్, ల్యబంతములు" మున్నగువానిని, నిర్విశేషసర్వావ్యయీభావసమాసప్రభృతులను గూడ గ్రహింప వలసియుండును. అట్టిపని కుభయభాషాభిజ్ఞు లెవ్వరును సమ్మతింపరు.

౩౧. ఆక్షే:—'అవాక్కు' క్రింద-'అవాఙ్ముఖ, అవాఙ్ముఖీ' కనబడవు. ఇటువంటిలోపాలు వందలు వందలుగా ఉన్నవి. అన్నీ ఎత్తిచూపించగలనా? (౨౦౩ పే)

సమా:—పై శబ్దములు 'అవాక్కు, ముఖ' శబ్దములలో గతార్థములు. ఇట్టిశబ్దము లన్నియును నిఘంటువులు గ్రహింప నక్కఱలేదని (౨౫) ఆక్షేపసమాధానమున విపులముగా వ్రాసిన్నాను. కనుక నిట్టివి లేకుండుట లోపము గాదని విమర్శకులు గ్రహింతురుగాక.

౩౨. ఆక్షే:—'అనవస్థిత' శబ్దమునకున్ను, 'అనశన' శబ్దమునకున్ను మధ్యను "అనవహ్వర, అనవాఙ్చ్, అనవానం, అనవాయ, అనవేక్షక, అనవేక్షా, అనవేక్షణాం, అనవ్రత" అనే శబ్దా లున్నవి. ఇవి అన్నీ సూర్య. ని. లో లోపించినవి. ఇట్లే అన్నిపుటలలోను లోపాలు ఉన్నవని నమ్ముతాను. 'అనవాయ'నుండే 'అనవాయత' వచ్చినది. (౨౦౩ పే)

సమా:—సూర్య. ని. లోని 'అవహ్వర, అవాఙ్చ్, అవేక్షకుఁడు, అవేక్ష, అవేక్షణము, వ్రతము'లలోఁ బై శబ్దములు గతార్థములు. ఇట్టి

నఞ్ సమాసముల సీయలేదని యాక్షేపించుట సరి కా దని చాలచోట్ల వ్రాసినాను.

'అనవానమ్' ఇది వాచస్పత్యాదులలో లేకపోవుటచేతను, అవ్యయ మని వ్రాసి మైత్రేయబ్రాహ్మణమునుండియే విల్యమ్సు ఉదాహరణ మిచ్చి యుండుటచేతను త్యజింపఁబడినది.

'అనవాయ' ఇది వాచస్పత్యమునుండి ఆప్టే గ్రహించినాఁడు. కాని వాచస్పతి దీనికి "అనవాయం కి మిాది నే.ఋగ్వేదము. ౭.౧౦౪.౨." అని వేదమునుండియే యుదాహరణ మిచ్చినాఁడు. సంస్కృతమూల నిఘంటువులలోను, రంగాచార్యులుగారి నిఘంటువునను గూడ నీపదము లేదు. కనుక వైదికము కావచ్చు నని పరిత్యజింపఁ బడినది.

ఇట్లు సవిమర్శముగాఁ బనిచేయుటయే లోప మైనచోఁ బై శబ్దములు గ్రహింపకుండుటయు లోపమే యగును. ఇట్టిలోపములే సూర్య. ని. లోనియున్న పొరటలలోను ఉన్న యెడల నవి గౌరవావహములే. కాని యగౌరవావహములు కా వని సద్విమర్శకులు నిర్ణయింపఁ గలరు.

ఆప్టే. ని. లోని 'అనవాయ' అనునదియే వైదిక మని తోఁచు చుండఁగా "అనవాయ-నుండే 'అనవాయత' వచ్చినది" అని సుప్రసిద్ధ శబ్దమును గూర్చి వోలె పంతులుగారు వ్రాయుటకుఁ గారణ మేమో ?

౩౩. ఆక్షే:—ఆప్టే. ని. లో 'అన్న, అగ్ని, అశ్వ, అల్ప, అధః' మొదలగు శబ్దములతో సమసించిన శబ్దాలు వేలకొలదిగా ఉన్నవి... ఈసమాసాలు ఆప్టే. ని. లోనుండి పెరికి సూర్య. ని. లో తెచ్చిపోసి నప్పుడు నూటికి యాభై అరవై చొప్పున తరిగిపోయినవి. ఇంతతరుగా ? మాటలు గాని మన్ను గాదే! (౨౦౩ పు)

సమా:—పై శబ్దములతో సమసించినశబ్దములు సూర్య. ని. లో లేనివి మచ్చుకై కొన్ని చూపి యట్టివి గ్రహింపకున్న లోప మం

డునో? లేదో? తెలిపెదను. అన్నిటిని విమర్శించుచో వృథా గా గ్రంథము పెరుఁగు నని యీపద్ధతి నాశ్రయించినాను.

అన్న.

అన్నాద్యమ్ (=అన్నము మొదలైనది). ఇది సూర్య. ని. లోని 'అన్న, అద్య' శబ్దములలో గతార్థము.

అన్నాచ్ఛాదనమ్:—'అన్న, ఆచ్ఛాదన' శబ్దములలో గతార్థము.

అన్నవస్త్రమ్—'అన్న,వస్త్ర' శబ్దములలో గతార్థము.

అన్నకాలః—'అన్న, కాల' శబ్దములలో గతార్థము.

అన్నజాతమ్—'అన్న,జాత' శబ్దములలో గతార్థము. మచ్చునకై యిట్టివానిని గూడఁ గొన్నిటిని సూర్య. ని. చూపియే యున్నది.

అగ్ని.

'అగ్న్యగారమ్, అగ్న్యాలయః, అగ్నిగృహమ్' మొదలైనవి ఆ ప్తే. ని. లో నున్నవి. సూర్య. ని. లో 'అగ్నిగృహము' ఒక్కటి గ్రహించి తక్కినవి దీనివంటివే గనుక నిర్విశేషము లని త్యజింపఁబడినవి. ఐనను 'అగ్ని' తో సమసించినపదములు 96 సూర్య. ని. లో నున్నవి. ఎన్ని యిచ్చిన విమర్శకులకుఁ దృప్తి గలుగునో?

అశ్వ.

అశ్వాధికః—'అశ్వ, అధిక' శబ్దములలో గతార్థము.

అశ్వాధ్యక్షః—'అశ్వ, అధ్యక్ష' శబ్దములలో గతార్థము. ఇట్టి యమూల్యపదములు సూర్య.ని. లో లేవని పంతులుగారు చాల విచారించినారు. అయినను "అశ్వ" శబ్దముతో సమసించినపదములు 66 సూర్య. ని. లోఁ గలవు.

అల్ప.

'అల్పాయుస్, అల్పారంభః, అల్పాహారః, అల్పాహారిన్' వంటి ఆ ప్తే. ని. లోనిశబ్దములు 'అల్ప, ఆయుస్' ప్రభృతిశబ్దములలో గతా

ర్థములే గనుక గ్రహింపఁబడలేదు. 'అధస్' శబ్దముతో సమసించిన వా నిలోఁ బ్రధానశబ్దము లిచ్చినారు. మఱియు 'అధస్' శబ్దమును బ్రత్యేక ముగా గ్రహించి దానికిఁ గలయర్థములను సోదాహరణముగాఁ జూపి నారు. కనుక దానిలో మిగిలిన వన్నియును గతార్థము లగును.

౩౮. ఆక్షే:—'అంతర్' తో సమస్తమైనవి 160 ఉన్నవి. వాటి లో 77 సూర్య. ని. లో లేవు. (౩౦౩ పొ)

సమా:—77 మాత్రమేకాదు, ఏడువందలు లేకున్నను 'అంతర్' లో సూర్య. ని. లో వ్రాసినవిశేషములో నవి గతార్థము లగును. కనుక నే త్యజింపఁ బడినవి. తక్కినశబ్దములకుఁ గూడ నిట్లే సమాధాన మూహ్యము.

౩౯. ఆక్షే:—'అభి'తో చేరినవి అనేక మున్నవి. వాటిలో కొం చెము దీనిలో ఉన్నవి. (౨౦౮ పొ)

సమా:—కొంచెముకాదు, 424 పదములు 'అభి'తో సమసించి నవి సూర్య. ని. లో నున్నవి. మఱియు 'అభి' దానికిఁ గలవివిధార్థముల తోను, ఉదాహరణములతోను బ్రత్యేకముగా గ్రహింపఁబడినది. లేవ నినశబ్దములు దానిలో గతార్థము లగును.

౪౦. ఆక్షే:—'అప' తో చేరినవాటిలో అత్యల్పముగా దీనిలో ఉన్నవి. 'అపకిరణము' వంటివి లేవు. (౨౦౮ పొ.)

సమా:—'అప'తో సమసించినవి '240' కిఁ బైఁగా సూర్య. ని. లో నున్నవి. మఱియు 'అప' ప్రత్యేకముగా గ్రహింపఁబడియుండుట చేతఁ దక్కినవి దానిలో గతార్థము లగును.

సవిశేష మగు 'అపస్కిరణము' సూర్య. ని. లో గ్రహింపఁబడి యుండఁగా నిర్విశేష మగు 'అపకిరణము' లేదని యాక్షేపించుట సరి కాదు. ఇక్కడి తక్కిన యాక్షేపములు గూడ నిట్టివే కనుక వానికి సమాధానము వ్రాయ నక్కఱ లేదు.

౩౭. ఆక్షే:—సంస్కృతములో 'పరి, అధి' మొదలగువాటి
'పరీ, అధీ'అని రూపాంతరము లున్నవి. "పరితాప=పరీతాప". ఇటువంటి
నిఘంటువులో వ్రాయక పోతే విద్యార్థులను మోసపుచ్చినట్లవుతుంది. ఇ
ఊహించి కనుక్కో లేరు. ఆప్తే. లో 'అధీవాసః' ఉన్నది. (౨౦౮ పే

సమా:—సంస్కృతమున 'పరి, అధి' మున్నగు నుపసర్గము
కెల్ల 'పరీ, అధీ' మొ. రూపాంతరము లున్న వనుట తప్పు. ఉన్నచో
'అధీకరణము, అధీకృతి, అధీక్రియ' మున్నగురూపములు గూడ నుం
వలసివచ్చును. అట్టి వుండఁ గూడదు. 'ఘఞ్' ప్రత్యయాంతశబ్దము త్త
పదముగా నుండి, సముదాయము మనుష్యవాచకము కానప్పుడు ఉ
సర్గమునకు బహుళముగా దీర్ఘము వచ్చును. (చూ. సూ. ఉపసర్గస
ఘ ఞ్యమనుష్యే బహుళమ్. అష్టా. ౬. ౩. ౧౨౨.) కనుక "పరీతా
పరీపాక, పరీహా"సాదిశబ్దములు సిద్ధింపఁగలవు. వానిని దక్కినని ఘంట
వులతోపాటు సూర్య. ని. కూడ గ్రహింపఁ గలదు. అట్టిదే యగు 'అ
కారము' గ్రహింపఁబడియే యున్నది. అట్లుకాక యట్టివాని నన్నిటి
గ్రహించిననే కాని విద్యార్థులకుఁ దెలియ వందురేమో సమాధానమ
వినుఁడు: సంస్కృతమున సుమారు రెండువేలధాతువులు గలవు. వా
కన్నింటికిని గర్త్రృభిన్నకారకములు వాచ్యము లగునపుడు ఘఞ్ప్రత్య
ములు చేసి తద్రూపములకెల్ల నజంతోపసర్గములతో సమాసము చే
దీర్ఘము వచ్చినరూపమును రానిరూపమును జూపుట కారంభించి
చో సుమారు కొన్నిలక్షల పదము లగును. వీనిలో మనుష్యవాచకమ
లగుటచేతను బహుళగ్రహణముచేతను గొన్ని పోయినను దక్కినవి కూ
లక్షలలోనే యుండును. ఇట్టివానిని వ్యాకరణమే తెలుపును గా
నిఘంటువులు తెలుపవు. మఱియు ఆప్తే. ని. లో నొక్క 'అధీవాస
ఇచ్చినంతమాత్రమున నే మైనది ?. తక్కిన వన్నియును లేవుగదా ! అ
దైనను కాత్యాయనశ్రౌతసూత్రమునుండి వాచస్పతి చూపినదే. కను
వేదమునను శ్రౌతగ్రంథములలోను గలవియును, వ్యాకరణమువలన

తెలియఁదగినవియును నగు శబ్దముల నన్నింటి నాంధ్రనిఘంటువున నీయ
లే దని యాక్షేపించుట సమంజసమో? అసమంజసమో? పాఠకు లూ
హించుకొనుటకై యిక్కడ విషయమును వివరించినాను.

౩౮. ఆక్షే:—'ఊర్వశీ' శబ్దము 'ఉర్వశీ' శబ్దానికి రూపాంతర
ముగా సూర్య.ని. లో ఉన్నది. ఆప్టే.ని. లో లేదు. 'ఊ'కార మేలాగున
వచ్చినది? వేదములోను కావ్యనాటకాదులలోను 'ఉర్వశీ'. (౨౦౮ పే)

సమా:—'ఊర్వశీ' శబ్దము విల్యమ్సు, వాచస్పత్యము, కల్ప
ద్రుమము, రాయముకుటాద్యమరవ్యాఖ్యలు మున్నగు ననేకగ్రంథముల
లో నున్నది. "ఊరుం=నారాయణ స్యోరుం; కారణత్వే నాస్త్య స్తే" అని
వ్యుత్పత్తి ప్రదర్శనపూర్వకముగా నీశబ్దము వాచస్పత్యములోను, అమర
వ్యాఖ్యలలోను సాధింపఁబడినది. మఱియు శ్రీహర్షుఁడు రచించిన
ద్విరూపకోశములో "శ్లో. ఊర్వశీ-చోర్వశీ తథా" అని రెండురూపములు
చూపఁబడినవి. కనుక 'ఊర్వశీ' కూడ సాధువే. అందుచేతనే భారతా
ద్యాంధ్రగ్రంథములం దెల్ల "ఊర్వశీ" అనియే కలదు.

౩౮. ఆక్షే:—ఆప్టే. ని. లో 'ఊర్ణనాభః, ఊర్ణవాభిః' అనే
శబ్దా లున్నవి. సూర్య. ని. లో "ఊర్ణనాభము, ఊర్ణనాభి" ఉన్నవి.
రెండోది ఎక్కడనుండి వచ్చినది? ఆప్టే. ని. లోని 'ఊర్ణవాభిః' అనేశబ్ద
ము 'ఊర్ణనాభి' అని పఠించి దానిని 'ఊర్ణనాభి'గా తెలుగించినారా?
(ఈశబ్దము ఆర్యభాషాతత్త్వజిజ్ఞాసువులైనపాశ్చాత్యపండితులు
సావధానముగా పరీక్షించినది......ఇట్టిశబ్దాలు చరిత్రకు ఆధారము.)
భాషాతత్త్వజిజ్ఞాసువులకు సూర్య. ని. వంటివి ప్రమాణము కావు
గా! భాషాతత్త్వవేత్తలకు 'ఊర్ణవాభి' కి బదులుగా 'ఊర్ణనాభి' కన
బడితే ఏమనుకొంటారు ?. (౨౦౯ పే.)

సమా:—"ఊర్ణనాభము, ఊర్ణనాభి" అను శబ్దములు రెండు
ను వాచస్పత్యమునను విల్యమ్సులోను గలవు. వాచస్పత్యమున "సమా
సాంతవిధే రనిత్యత్వాత్ క్వచిత్ అచ్ న.శ్లో.నాచా రేణ వినా సృష్టి రూర

నాభే రపీష్యతే, న చ నిస్నాధనః కర్తా కశ్చిత్సృజతి కించన." అని ప్ర మాణముగా 'ఊర్ణనాభి' శబ్దము సాధింపఁబడియున్నది. కనుకనే స ర్య. ని దీనిని గ్రహించినది. 'ఊర్ణవాభి' శబ్దము వైదికము. అం చేతనే వాచస్పతి, విల్సన్ను దీనికి వేదమునుండియే యుదాహరణ లిచ్చినారు. ఈవైదికశబ్దము చరిత్ర కెంత యాధారమైనను లౌకికనిఘ టువగు సూర్య. ని. దీనిని గ్రహింపదు.

౭౦. ఆక్షే:—'అభిమానము' క్రింద 'ఆత్మగౌరవము' 'అంద ము' క్రింద 'ఆందోళః' ఉన్నవిగాని మూలపదాలలో చేరలేదు. 'అ బు' క్రింద 'ఉపసాలము' ఉన్నది. అందుకు ప్రమాణము ఆంధ్రభాష ర్ణవము. సంస్కృతములోనిది యున్నదా ? తెలియదు. 'ఉపశాల ఉన్నది. అది దీనిలో చేరలేదు. 'ఉపసాలాఖ్యయగు నరాబు' అ పాఠము తప్పా ?... ...వ్యవస్థలేకుండా పనిజరిగినది, అస్తవ్యస్తమైన 'వెంకన్న వేమవరం వెళ్ళి వచ్చాడు.' అన్నట్టు. (౨౦౫ పా.)

సమా:—'ఆత్మగౌరవము' 'ఆత్మన్, గౌరవ' శబ్దములలో గర ర్థము. 'ఆందోళము' మూలపదముగా సూర్య. ని. లో గ్రహిం బడియే యున్నది. 'ఉపసాలము' సంస్కృతనిఘంటువులలో లేద సంస్కృతనిఘంటువులలో లేని సంస్కృతపదములు కొన్నియాంధ్రభాష ర్ణవమునఁ గల్పింపఁబడియున్నవి. అవి తదేకప్రమాణము లగుటచేఁ జా వటకుఁ ద్యజింపఁబడినవి.

ఆప్టే. ని. లోని 'ఉపశాలమ్' స్త్రీలింగ మగు 'శాలా' శబ్ద నకు సంబంధించినది. ఆంధ్రభాషార్ణవములోని 'ఉపసాలము' పుంలిం మగు 'సాల' శబ్దమునకు సంబంధించినది. ఈరెండింటికిని అర్థమునఁ గా శబ్దమునఁ గాని సంబంధ మేమియును లేదు.

౭౧. ఆక్షే:—శబ్దస్వరూపము వికృత మైనందుకు నిదర్శనమ "ఇహము. సం. అవ్య"అని వ్రాసినారుగదా; విద్యార్థులు సంస్కృతమ నందు 'ఇహమ్' ఉంటుం దనుకోరా ? 'సం. ఇహ. అవ్య' అని వ్రా

వలెను. 'జగము. సం. వి.' అని వ్రాస్తే సంస్కృతములో 'జగమ్' అనే శబ్ద మున్న దనుకోవడమునకు కారణము కాదా? (౨౦౭ పా.)

సమా:— ఈయాక్షేపమే సమంజసము గా లేదు. "ఇహము. సం. అవ్య" అని వ్రాసిన 'ఇహమ్' అని, "జగము. సం. వి."అని వ్రాసిన 'జగమ్' అని, "నగము. సం. వి" అని వ్రాసిన 'నగమ్' అని, సంస్కృతమున నుండు నని విద్యార్థులను కొనుటకును, 'ఇహ, జగ, నగ' అని సంస్కృతమున నుండఁగాఁ దెనుఁగుప్రత్యయమగు 'ము' చేరిన దని యనుకొనకుండుటకును గారణము కళాప్రపూర్ణులకే తెలియును. మఱియు 'ఇహము' మున్నగువానియొద్దఁ బంతులుగారు వ్రాయ వలయు నని చెప్పి నట్లంగీకరించినచో "చిరము" మున్నగువాని యొద్దఁగూడ "సం. చిరమ్. అవ్య." అని వ్రాయ వలయునుగదా? అప్పుడు విద్యార్థులు "చిరమ్ + ఉ" కలిసి 'చిరము' అను రూప మేర్పడిన దనియును, 'ఉ' తెనుఁగుప్రత్యయ మనియును, దానికి 'వృథ' మున్నగునవి యుదాహరణము లనియును భావించుకొనరా ?. 'చిరము' మున్నగువానిలో 'ము' ప్రత్యయసన్నిధానమున 'మ్' లోపించునని విద్యార్థులు తెలిసికొందు రని పంతులుగా రన్న యెడల లక్ష్యజ్ఞానము కలవిద్యార్థులు సూర్య. ని. లోని 'ఇహపరములు' అను యుదాహరణమును, "ఇహలోకము, ఇహాగతుఁడు, ఇహాముత్రఫలము" మున్నగుపదములను జూచుకొని సంస్కృతమున 'ఇహ' అని యుండు నని భావించుకొనఁగల రని సమాధానము చెప్పవచ్చును. ఏభాషానిఘంటువైనను దద్భాషలో నల్పప్రవేశ మేనియు లేనివారికిఁ గలుగుశంకలను దీర్పఁ జాలదు. కనుక గ్రంథము చదువుట కట్టివాఁ డధికారియో మొదట నిర్ణయించుకొని పిమ్మట గ్రంథమును విమర్శింప వలయును. పంతులుగా రట్లు చేయ లేదు.

౮౨. ఆక్షే:— తెలుగులో 'ఇహమందు' విశేష్యము.(౨౦౭పా)

సమా:— 'ఇహము' అనుదానిపై 'అందు' మొదలగువిభక్తులు గూడఁ బ్రయోగములం దున్నవి. కనుకఁ దెనుఁగున దాని నవ్యయ మని

వ్రాయఁ గూడదు. 'జగము' మున్నగువానినిబోలె 'విశేష్య'మని వ్రాయ వలయు నని పంతులుగారియాశయము కావచ్చును. కాని, సంస్కృతమున 'ఇహ' అనునవ్యయ మధికరణశక్తిప్రధానము. (అనఁగా "ఈలోకమందు" అనునర్థ మిచ్చు నని భావము) ఐనను ప్రత్యయసంబంధము కలిగినప్పు డధి కరణశక్తిప్రాధాన్యము పోయి శక్తిమత్త్వము మాత్రమే మిగులును. (అనఁగా "ఈలోకము" అనునర్థమే యిచ్చు నని భావము.) అంతమాత్ర మున నవ్యయత్వము పోదు. (ఈవిషయము మహాబల పండితీయమున నజం తపరిచ్ఛేదమునఁ జర్చింపఁబడియున్నది.) కనుక 'అందు' మున్నగు విభక్తు లతోఁ గూడియున్నను 'ఇహము' మున్నగువాని నవ్యయము లనియే చెప్పవలయును. అట్లే సూర్య. ని. వ్రాసినది.

౪౩. ఆప్తే:—వేరువేరు ప్రకృతులనుండి పుట్టి వేరువేరు అర్థ ము కలిగి ఏకరూపము పొందినశబ్దాలు (Head words) గా వ్రాయ వలెను. ఈసూర్య. ని. లో అట్లు జరుగ లేదు. "ఉదా:—అదుఁడు. (1) తినువాఁడు. (2) తీసికొనువాఁడు." ఈశబ్దము మూల శబ్దముగా వ్రాయడమే హాస్యాస్పదముగా ఉన్నది. "అన్న + అద = అన్నాద" అని...ఆప్తే. ని. లో ఉన్నది. "అన్న + అదుఁడు" అని సూర్య. ని. లో వ్రాసినవారు భ్రమపడ్డారు. ఏదయినా ఈయర్థమందు 'అద్' ధా తువునుండి వచ్చినశబ్ద మిది. 'దాయాదః' అన్నది 'దాయం ఆదత్తే' 'ఆ' అనే ఉపసర్గతో కూడిన 'దా' ధాతువునుండి వచ్చినది. అది జుహో త్యాదివర్గములోనిది. శ్లుఖికరణము. 'అద్' అదాది, లుగ్వికరణము (౭౦౩ పా.)

సమా:—వేఱువేఱ అర్థముల నిచ్చుచు సమానరూపములుగా నున్న తత్సమేతరశబ్దములు మూలశబ్దములుగానే సూర్య. ని. లో వ్రా యఁబడినవి. ఆంధ్రనిఘంటువులో సంస్కృతశబ్దములవిషయమున న విభాగము చేయుట యనవసరముగా గ్రంథము పెంచుట యగు న మానివేసినారు.

'ఆదుఁడు' మూలపదముగా గ్రహించుటయు, 'అన్న + ఆదుఁడు' అని వ్రాయుటయు భ్రాంతిమూలకము కాదు. కర్మవాచక మగు 'అన్న' శబ్ద ముపపదముగా నున్నప్పుడు 'అద్' ధాతువునకు "కర్మణ్యణ్. అష్టా. ౩. ౨. ౧." అనుసూత్రముచే 'అణ్' ప్రత్యయము రాఁగా 'ఆద' అను రూప మగును. "అన్న + ఆద = అన్నాద" అని రూపసిద్ధి. కనుకనే "ఆదుఁడు...౨. (అ. ఈ. అ.) తినువాఁడు. (ఉదా:—అన్నాదుఁడు, మొ. దీని కీయర్థమున వ్యస్తప్రయోగము లేదు.)" అని సూర్య. ని. వ్రాసినది. ఇది "కుంభకారుఁడు" మొన్నగువానివంటిది. 'ఆదుఁడు' ప్రత్యేకముగా వ్రాయుటచేత "పిండాదుఁడు, ఫలాదుఁడు, మాంసాదుఁడు" మొన్నగు ననేకశబ్దములు సంగ్రహింపఁబడును. ఇట్టిచోట్ల నీవిధముగా వ్రాయకున్నఁ బైశబ్దముల నన్నింటిని వ్యర్థముగా గ్రహింప వలసివచ్చుటయు, అందేవేని గొన్ని దాఁటిపోయినచోఁ బంతులుగారివంటివారు 'ఇవి లేవు, అవి లేవు' అనియాక్షేపించుటయు సంభవించును. ఇట్టివిషయముల నెల్ల నాలోచించియే సూర్య. ని. ఈమార్గము ననుసరించినది.

ఆప్టే 'అద'లో (ఇది సమాసాంతముననే యుండును.) అని వ్రాసి 'అన్నాద' లో "అన్న + అద" అని వ్రాయుటచేత 'అణ్' ప్రత్యయాంత రూపమునే యాతఁడు చూపినట్లు భావింపవలసియున్నది. కాని యప్పుడు 'అద'లో 'ఆద' అనియును, 'అన్నాద'లో "అన్న + ఆద" అనియును వ్రాయవలెను. ఆప్టేయట్లు వ్రాయక వైవిధముగా వ్రాయుట పొరపాటు. లేక "వ్యత్యయో బహుళమ్. అష్టా. ౩. ౧. ౮౫." అనుసూత్రముచేత (కర్మవాచక ముపపదముగా నున్నప్పుడే) 'అణ్' కు బదులుగా 'అచ్' వచ్చినచో ఆప్టే వ్రాఁత సరిపడును. కాని యట్టిప్రత్యయవ్యత్యయము వైదికము. చూడుఁడు.

"సూ. వ్యత్యయో బహుళమ్. అష్టా. ౩.౧.౮౫...ఛందసి...తద్వాచినామ్ (=కారకవాచినామ్.) కృత్తద్ధితానాం వ్యత్యయః. అన్నాదాయ. అణ్విషయే అచ్. అవగ్రహే విశేషః" (కౌముది.) "అవగ్రహ

ఇతి. అణీకృతే అన్న ఆదాయేతి, అచితు అన్న అదాయేతి భావః"
(సుబోధినీవ్యాఖ్య.)

కావున నన్నివిధములుగా నాలోచించినను సూర్య. ని. వ్రాసి నదే యుక్తముగా నున్నది.

౪౪. ఆక్షే:—"అధివసించు. సం. అ. క్రి. నివసించు." దీనిక్రింద వ్రాసిన ప్రయోగాలలో స. క్రియగా ఉన్నది. సంస్కృతమందు "ఉపాన్వ ధ్యాఙ్వసః" అనేసూత్రముచొప్పున, అధివస్, ఉపవస్, అనువస్-ఇవి స. క్రి. 'అధిష్ఠించు' స. క్రి. అని వ్రాసినారే, దానివంటిదే 'అధివసించు' 'అధిశీఙ్ స్థాసాం కర్మ' కర్మ గలది సకర్మకము. (౨౦౬. పా.)

సమా:—"అధివసించు; అధిష్ఠించు" మున్నగు తత్సమక్రియ లకుఁ దెనుఁగుకవుల ప్రయోగములను బట్టియే సకర్మకత్వాకర్మకత్వములు నిర్ణయింప వలయును. అట్లు కాక పంతులుగారు వ్రాసినట్లు సంస్కృత వ్యాకరణమునుబట్టి సకర్మకత్వాకర్మకత్వనిర్ణయము చేయునెడల "కోపిం చు=క్రోధించు" అనునది యకర్మకము కావలయును. ఎవనిపైఁ గోప ముండునో తద్వాచకపదమునకు (క్రుధద్రుహేర్ష్యాసూయార్థానాం యం ప్రతి కోపః.అష్టా. ౧. ౪. ౩౭" అనుసూత్రముచేతఁ జతుర్థియును కావలయును. తెనుఁగున నిట్టిప్రయోగములు లేకపోవుటయే కాక 'కోపించు' స. క్రి, అ. క్రి. గాను, ఏవనిపైఁ గోపముండునో తద్వాచకపద మునకు ద్వితీయాతృతీయావిభక్తులును బ్రయోగములందుఁ గనబడు చున్నవి. చూడుఁడు.

మ. గురుశాస్త్రార్థగరిష్ఠులైన బుధులన్ గోపింపఁగా రాదు...
మల్లభూపాలీయము. నీతి. ౧౩.

క. అవడవాలును దమభటుఁ, గోపించుచు...
సింహాసనద్వాత్రింశిక. ౭. ౩౩.

క. రక్కసులరాజు సీతతో, మిక్కిలి కోపించినాఁడు...
భాస్కరరామాయణము. యుద్ధ. ౧౫౨.

కనుకనే యథర్వణాచార్యుఁడు—

"శ్లో. అకర్మణ స్సకర్మత్వ మకర్మత్వం సకర్మణః, తద్వతాం క్వచి దైక్యం స్యా
చ్ఛబ్దశక్తి ర్హి తాదృశీ. క్రియా. ౧౧" అని చెప్పినాఁడు.

సూర్య.ని. లో 'అధివసించు' క్రింద నిచ్చిన ప్రయోగములు స.
క్రి. గా నున్నవనుట సరి గాదు. చక్కఁగాఁ బరిశీలించుకొనినచో
వరాహపురాణము. ౪. ౧౫౯, రంగారాయచరిత్ర. ౨. ౧౩౧. అ. క్రి.
అనుటకే నిర్ధారకములు. మఱియు 'అధివసించు' అ. క్రి. అనుటకుఁ జాల
ప్రయోగము లున్నవి. చూడుఁడు.

వ. ఊర్వశి మేనక రంభ ... వీరు మొదలుగా నఱువదివేలు దివ్యాప్సరస
లీలోకంబునం దధివసింతురు. కాశీ. 3. ౧౭౦.

సీ. భ్రూవల్లరీయుగ్మమునకు మధ్యంబున
నానంద వసతిఁ ద్వ మధివసించు. కాశీ. ౨. ౧౧౭.

వ. ఇడానాడియందుఁ జంద్రుఁ డధివసించి యుండుం గావున నందుఁబవనం
బుద్గమించుకాలంబు రాత్రి. ప్రవేశించుకాలంబు పగలు. పింగాళా
నాడియందు సూర్యుం డధివసించుం గావున నందుఁ బవనం బుద్గమిం
చుట దివంబు... కాశీ. ౨. ౧౨౭.

ఇప్పటి కైనను "సూర్య.ని. సవిమర్శముగా రచింపఁబడినది. ప్రమా
ణము" అని కళాప్రపూర్ణు లంగీకరింపరా ?

౪౯. ఆక్షే:—సమస్తశబ్దాలకు సూర్య. ని. కర్తలు సమష్టిశబ్దా
లని పేరు పెట్టినారు. (చూ. పీఠిక. 7,9. పుటలు) నాకు వింతగా ఉన్నది
ఈపేరు. ఏశాస్త్రములో ఉన్నదో. సిద్ధాంతకౌముది చదువుకొన్నవారిని
కొందరిని నేను అడిగినాను. తమకు తెలియ దన్నారు. (౨౦౩ పే.)

సమా:—ఆంగ్లపదమగు 'Phrase' (=సమాపకక్రియా రహి
త మగునర్థవత్పదసముదాయము.) అను దానియర్థమును దెల్పుటకై
'సమష్టిపదము' అనునది కల్పింపఁబడినదిగాని, సమస్తశబ్దమునకుఁ
బర్యాయపదముగాఁ గల్పింపఁబడ లేదు. ఈవిషయము పీఠికను సరిగాఁ

జూచుకొనిన స్పష్ట మగును. సమస్తపదము లన్నియు సమష్టిపదములు కావచ్చును గాని, సమష్టిపదము లన్నియు సమస్తపదములు కావు. ఉదా:—అదరక బెదరక, ఇదియది యనక, ఎత్తుకెత్తు, మొ.

ఇవి సమష్టిపదములే కాని సమస్తపదములు కావు.

౮౬. ఆక్షే:—మీాది ఎనిమిది పేరాలలో చూపించినదోషాలకూ లోపాలకూ ఉత్తరవాదు లెవరు? (౨౦౭ పే.)

సమా:—నిజముగా దోషములు లోపములు నున్నయెడల వానికి నిఘంటుకర్తలే యుత్తరవాదులు. కాని గుణదోషనిర్ణయమునకు బహుగ్రంథద్రష్టలు, ద్వేషరహితులు, ఉభయభాషాపండితులు నగు విమర్శకులు మాత్రమే యర్హులు.

౮౭. ఆక్షే:—కీ. శే. కళాప్రపూర్ణ, వేదం, వేంకటరాయశాస్త్రులు గారు ప్రకటించిన నిఘంటుస్వరూపదిక్ప్రదర్శనపత్త్రములలో ఉదాహృతమైన సంస్కృతశబ్దాలలో కొన్ని సూర్య. ని. లో లేవు. ఉదా:—అంగాధిపుఁడు, అంగాపూర్వము, మొ. 'అంగము' క్రింద—పంచాంగములు, షడంగములు, సప్తాంగములు, అష్టాంగములు, అంగుఁడు, అకారము ... లేవు. (౨౦౭ పే.)

సమా:—'అంగాధిపుఁడు' మొదలగునవి తత్తచ్ఛబ్దములలో గతార్థములు. పంచాంగములు మున్నగునవి ప్రత్యేకముగా నాయాస్థలములలో వ్రాసినారు. ఈవిషయము సూర్య.ని.లోని 'అష్టాంగములు' అనుపదము చూచుకొనిన స్పష్ట మగును.

"అంగుఁడు"—దీనికి "౧. వేనునితండ్రి. ౨. బలిపెద్దకొడుకు. ౩. కౌరవయుద్ధమున భీమునిచే మడిసినమ్లేచ్ఛరాజు." అనునర్థము లిచ్చినారు. సుప్రసిద్ధములగు సంజ్ఞావాచకములుగూడ గ్రహింపనక్కఱలే దని శ్రీ బులుసు వేంకటరమణయ్యగారు కొంతకాలముక్రితము భారతిలో వ్రాసినారు. ఇప్పుడు గిడుగువా రట్టి యప్రసిద్ధసంజ్ఞావాచకములుగూడ నుండవలె ననుచున్నారు. పై రెండుమతములును సరియైనవి కా వని

తలఁచి నిఘంటుకర్తలు సుప్రసిద్ధము లగువానిని మాత్రమే గ్రహించి నారు.

"అకారము"—ఇది "కారము. ౧౦ అర్థము"లో గతార్థము. దీనిని ప్రత్యేకముగా గ్రహించిన 'ఇకారము' మున్నగువానినిగూడ గ్రహింపవలెను. అప్పుడు వ్యర్థముగా గ్రంథము పెరుఁగును.

౪౭. ఆక్షే:—'అర్షవివాహము' క్రింద— కశ్యపసంహితలోని శ్లోకాలు వ్రాసినారు. 'అనిష్టానుబంధి' క్రింద—కాదంబరిలోనివాక్యము వ్రాసినారు. 'అగ్రేవణము' క్రింద—గణరత్నమహోదధిలోనిశ్లోకాలు వ్రాసినారు. ఈలాగుననే అనేక సంస్కృతశబ్దాలకు ప్రయోగాలు సంస్కృతగ్రంథాలలోనివే వాచస్పత్యమునుండి ఎత్తి వ్రాసినారు. వాటికి తెలుగున అర్థం లేదు. ఎవరికోసం ఈశ్రమ అంతా! ఆశ్లోకాలకు అర్థం తెలుసుకో గలవారికి ఈనిఘంటువు అక్కర లేదు. (౨౦౭ పే.)

సమా:—సంస్కృతభాషలోఁ బ్రవేశము లేక నిఘంటువులో వ్రాసిన యర్థముతోనే తృప్తిపడువారికిఁ బ్రమాణములు చూప నక్కఱ లేదు. సంస్కృతభాషలోఁ బ్రవేశము కలిగి నిఘంటువులో వ్రాసినదానికిఁ బ్రమాణము నపేక్షించువారికొఱకే తత్తత్సంస్కృతగ్రంథములనుండి ప్రమాణములు చూపవలసియుండును. అందుచేతనే ముఖ్యస్థలములలోఁ దక్కఁ దక్కుచోట్లఁ బ్రమాణముల కర్థము వ్రాయలేదు. ప్రమాణముల కన్నింటికి నర్థము వ్రాయవలయు నన్న గ్రంథ మతిమాత్ర మగును. మఱి యుఁ దెనుఁగుగ్రంథములనుండి యుదాహరించుపద్యములన్నియు నిఘంటువు చూచుకొనువారికెల్ల నర్థ మగునా? కావు. కనుకఁ దెనుఁగుపద్యములకుఁగూడ నర్థము వ్రాయవలదా ? అట్లు వ్రాయుట మొదలిడిన గ్రంథ మెంత యగును? అది యవసర మగుపనియా? అని యాలోచించి పైపద్ధ యే మంచి దని సూర్య.ని. నిర్ణయించుకొన్నది. ఆక్షే.ని. కూడఁ దాను బ్రమాణముగా నిచ్చిన సంస్కృతశ్లోకములు మున్నగువాని నన్నింటి నాంగ్లమున ననువదింపలే దని పంతులుగారికిఁ దెలియదా?

౮౯. ఆక్షే:—సూర్య. ని. లోని తెలుగుమాటలలో 'అవక తవక' అనేమాట లేకపోవడము పెద్దలోపముగా శ్రీ నాగపూడి కుప్పు స్వామయ్యగారికి కనబడినది... ...నాకూ అలాగుననే తోచింది... ... (౨౦౮ పే.)

సమా:—'అగు' ధాతువునకు వ్యతిరేకార్థమున 'కాక' అను రూప మగు నని తెలియక—'తగు' కు రూపాంతరమగు 'తవు' కు వ్యతి రేకార్థమున 'తవక' అయినట్లే 'అగు' కు రూపాంతర మగు 'అవు' కు గూడ 'అవక' అగు నని సాదృశ్యభ్రమచే ననుకొనువారి నధిక్షేపించుట కై 'అవకతవక' కల్పింపఁబడియుండవచ్చును. ఆవిషయమును స్ఫురింప జేయుటకే 'అవక, తవక' అను రెండుపదములను గలిపి వాడుచున్నారు— అని కొందఱు చెప్పుచున్నారు. ఇది గ్రాంథికశబ్దము కాదు. దీనిని బ్రాహ్మ నిఘంటువైనను గ్రహింపలేదు. కేవలవ్యవహారముననే యున్నయిట్టి గ్రామ్యశబ్దములను గ్రహించుట సూర్య. ని. ఉద్దేశమునకు విరుద్ధము.

(౯౦) ఆక్షే:—ఆప్టే నిఘంటువులోని వైదికశబ్దములు కూడ 'అగువు' వంటివి గుడ్డెద్దు చేన బడ్డట్టు' వివేకం లేకుండా ఎత్తుకొన్నారే ఆప్టేగారు అవి వైదికము లని స్పష్టముగా నిర్దేశించినారు. వీరిబృహన్ని ఘంటువులో అట్టినిర్దేశము లేదుగదా! విద్యార్థులు ఇవి లౌకికశబ్దాలని కొని మోసపోరా?...'అగువు' వంటివైదికశబ్దాలు వీరినిఘంటువులో నుంచి ఎత్తుకొని భావికవులు వాడితే ఎవరిది ఆదోషము? ఆపాపము (౧౨౯ పే)

సూర్య. ని. లోని 'అగువు' అనేశబ్దము 'అగుః' యొక్క రూప ము.'అగుః' వైదికశబ్దము. అది సంస్కృతములో నైనా వాడ గూడదే తెలుగులో వాడవచ్చునా? ఆశబ్దము 'వైదికము' అనిస్పష్టముగా తెలి యజేసే గుర్తు పెట్టకపోతే శబ్దరూపమునుబట్టి అది వైదిక మని యెవరు తెలుసుకో లేరు. 'అగుః' వలెనే కనబడుతున్నవి 'చిత్రగుః, శబలగుః తిష్టద్గు, వహద్గు' ఇవి వైదికములు కావు...'అరాతిః'లౌకికమైనా 'రాతి

వైదికము. సమాసములలోకూడా ఇట్టిభేద మున్నది. 'అంతఃపురమ్'వంటిదే 'అంతఃపాత్రమ్' అయినా అదివైదికము... 'అంతః'తో చేరిన సమాసాలలో... అంతఃపేయమ్, అంతఃకథ, మొ. వైదికాలు. సమాసాలు, తద్ధితాలు, కృదంతాలు, స్త్రీలింగాలు మనయిష్టము వచ్చినట్టు కల్పించి ప్రయోగించ గూడదు. ఆప్తే. ని. లో అన్నిసమాసాలు వ్రాసినారు. వాటిలో ఏవి వైదికములో తెలియ జేసినారు. ఈనిఘంటువులో 'అవకతవక'—నిఘంటునిర్మాతలు ఏనియమము చెప్పిన ఆప్తే. ని. లోనిమాటలు ఎత్తుకొన్నారో తెలియదు... లౌకికభాషఅంటే యేమిటో పతంజలి మొ. ఆచార్యులు అందరూ చెప్పినారు. తెలుగుపండితులకు అది తెలియదా? బోధపడదా? (౨౦౮—౨౧౦ పే.)

సమ:—శ్రీపంతులుగారు పై విధముగా నాలుగుపేరటలలో ఆప్తే వైదికము లని తెలుపుగుర్తు పెట్టినశబ్దములు వైదికము లనియును, అట్టిగుర్తు పెట్టనిశబ్దములు లౌకికము లనియును, ఆవిషయమును సూర్య. ని. కర్తలు గ్రహింపక 'అగుప్' అను వైదికశబ్దమును గూడ లౌకికనిఘంటువగు సూర్య. ని. లో గ్రహించినా రనియును వ్రాసి, లౌకికవైదికశబ్దములనుగూర్చి తమకుఁ దెలిసినదానిని మిక్కిలి విపులముగాఁ బాఠకులకుఁ దెలిపినారు. కాని 'అగుప్' వైదికము కాదు. చూడుఁడు.

లోకవ్యవహారమున నుండుటకు వీలు లేనివియును, వేదమున మాత్రమే యుండు నవియును నగుశబ్దములు వైదికములు. తద్భిన్నములు లౌకికములు. 'కర్ణేభిః, గృభ్ణామి, త్రియంబకః' మున్నగు కేవలవైదికశబ్దములను బాణిన్యాదులు 'ఛందసి, వేదే, మంత్రే, ఋషౌ, నిగమే' మున్నగుశబ్దములతోఁ గూడిన "సూ. బహుళం ఛందసి. అష్టా. ౭.౧.౧౦. (వా) హృగ్రహోర్భశ్ఛందసి. (వా) తన్వాదీనాం ఛందసి బహుళమ్. సూ. బభూథాతతన్థ జగృభ్మ వవర్థేతి నిగమే. అష్టా. ౭.౨.౬౪." మున్నగు సూత్రవార్త్తికాదులచేఁ బ్రత్యేకముగా సాధించియున్నారు. ఇట్లే కేవల లౌకికశబ్దములను గూడ "సూ. భాషాయాంసదవసశ్రువః. అష్టా. ౩.౨.

౧౦౮. (వా) భాషాయాం ధాఞ్ కృసృగమిజనినమిభ్యః" మున్నగు భాషాదిశబ్దఘటితసూత్రవార్తికాదులచేఁ బ్రత్యేకముగా సాధించియు న్నారు. ఇట్టి 'భాషాయాం, ఛందసి' మున్నగుశబ్దములతో సంబంధము లేని యితరసూత్రవార్తికాదులచేత సాధ్యము లగుశబ్దములు లోకవేద సాధారణములు. ఇదియే సర్వవైయాకరణసిద్ధాంతము. ఆప్తేపండితుఁ డైనను, ఇతరులైనను, ఈమార్గము ననుసరించియే వైదికలౌకికశబ్దనిర్ణ యము చేయవలెను. తెలుఁగుపండితులకుఁ దెలిసినదియు బోధపడినది యు నీసిద్ధాంతమే. సూర్య. ని. కూడ నీసిద్ధాంతము ననుసరించియే వైదికలౌకికశబ్దవిభజనము చేసికొని లౌకికశబ్దములుమాత్రమే గ్రహిం చినది. ఆప్తేపండితుఁడు వైదికము లేవియో లౌకికము లేవియో సరిగా విమర్శింపక వైదికము లని తెలియఁజేయు గుర్తు పెట్టినంతమాత్రమున నా శబ్దములు వైదికము లని తెలుఁగుపండితులు నిర్విమర్శముగా నిర్ణ యింపరు. బాగుగాఁ బరిశీలించినచో ఆప్తేపండితుఁడు వాచస్పత్యము, విల్సన్ నిఘంటువులలోనిశబ్దముల నొక్కచోఁ జేర్చి తననిఘంటువు రచించినట్లును, వారు వైదికము లని చెప్పకున్నను వేదములనుండి యుదాహరణముల నిచ్చినంతమాత్రమునఁ జాలచోట్ల నాశబ్దములను వైదికము లని తననిఘంటువున వ్రాసినట్లును దెలియఁగలదు. "ఇషణిః, ఇషణ్యా" మున్నగువైదికశబ్దములకు వైదికము లని తెలియఁజేయు గుర్తు పెట్టకపోవుటయు, స్వరాదిభేదములచేఁ గేవలవైదికములు, కేవల లౌకికములు, లోకవేదసాధారణములు గూడ నగు 'రాతి' మొదలగుశబ్ద ముల నావిధముగా గ్రహింపకుండుటయు, 'అగువు' మున్నగు లోకవేద సాధారణశబ్దములను వైదికము లనియే గ్రహించుటయు మున్నగునవి పై విషయమునకుఁ బ్రమాణములు.

పంతులుగారు ఆప్తేనుబట్టి వైదికము లని వ్రాసినవానిలోఁ గొన్నిం టి నుదాహరణార్థము విమర్శించెదను.

'రాతి'

అన్తోదాత్తమును, 'క్తిన్' ప్రత్యయాంతమును, కర్తృభిన్నకారక భావార్థవాచకమును, అగు 'రాతి' శబ్దము వైదికము. (చూ. సూ. మన్త్రే వృషేషపచమనవిదభూవీరా ఉదాత్తః. అష్టా. 3. 3. ౯౬.)

ఆద్యుదాత్తమును, 'క్తిన్' ప్రత్యయాంతమును, కర్తృభిన్నకారక భావార్థవాచకమును, అగు 'రాతి' శబ్దము లౌకికము. (చూ. సూ. స్త్రియాం క్తిన్. అష్టా. 3. 3. ౯౪. సూ. ఞ్నిత్యాదిర్నిత్యమ్. అష్టా. ౬.౧. ౧౯౭.)

'అరాతి' శబ్దమునందున్న 'రాతి' శబ్దము కర్త్రర్థక 'క్తిచ్' ప్రత్యయాంతము. ఇదిలోకవేదసాధారణము. (చూ. 'అరాతి' శబ్దములోని అమరసుధావ్యాఖ్య.) కనుక వైదికమగు 'రాతి' శబ్దమునకును, 'అరాతి' శబ్దములోని 'రాతి' శబ్దమునకును సంబంధము కల దనుట సమంజసము కాదు. మఱియు వేదమున నున్నంతమాత్రమున నేశబ్దమును వైదికము కాదు. కావుననే వేదమునకున్నలౌకికశబ్దముల నన్నింటిని లౌకికభాషలో వాడియున్నారు.

ఉదా:—అగ్నిమీళే పురోహితమ్. (ఋగ్వేదము.) ఇందలి 'ఈళే' మాత్రమే వైదికము. తక్కినవి లోకవేదసాధారణములు. అన్నిగ్రంథములలోను వాడఁబడియున్నవి.

'అంతఃపాత్రమ్'—ఇది ఆప్టే వ్రాసినయర్థమున వైదిక మైనను గాకున్నను "అవ్యయం విభ" క్తీత్యాదిసూత్రముచే విభక్త్యర్థమున నవ్యయీభావము వచ్చినప్పుడు మాత్రము లోకవేదసాధారణము. కనుకనే "అంతస్తంత్ర మరంస్తే" త్యాదిమల్లినాథాదిప్రయోగములు లోకమున సాధువు లైనవి.

'అంతఃపేయమ్'—ఇది 'అంతఃపాత్రమ్' వంటిదే.

'అంతఃకథ'—ఈపదము ఆప్తే. ని. లో లేదు. వీరు దీనిని వైది కను చుటకుఁ బ్రమాణము లేదు. ఆప్తే. ని. లో నున్న "అంతఃపథ" అను దానికి బదులుగా 'అంతఃకథ' అని వ్రాసినారా?

'అగువు'—ఇది లోకవేదసాధారణమే కాని కేవలవైదికము కాదు. "న విద్యంతే గావో యస్య" అని విగ్రహము. (వా. నఞోఽ స్త్యర్థానాం వాచ్యో వా చోత్తరపదలోపః. సూ. నలోపో నఞః. అష్టా. ౬. ౩. ౭౩. సూ. గోస్త్రియో రుపసర్జనస్య. అష్టా. ౧. ౨. ౪౮.) అనుసూత్రవార్తికములచే 'అగువు' అనురూప మగును. ఈసూత్రవార్తికములు లోకవేదసాధారణములు. "చిత్రగు, శబలగు" శబ్దములు కూడ "సూ. అనేక మన్యపదార్థే. అష్టా. ౨. ౨. ౨౪. సూ. గోస్త్రియో రుపసర్జనస్య. అష్టా. ౧. ౨. ౪౮." అనుసూత్రములచేతనే సిద్ధించినవి. కనుక "అగువు" వంటివే కాని భిన్నములు కావు.

వస్తుస్థితి యిట్లుండఁగా 'అగువు' వైదిక మనుకొని పంతులుగారు వ్రాసిననాలుగుపోరటలలోనినిందావాక్యము లెవరికిఁ జెంద వలయునో విద్వాంసులు నిర్ణయింతురుగాక.

శ్రీగిడుగు వెంకటరామమూర్తిపంతులుగారు సూర్యరా యాంధ్రనిఘంటువుపై దీర్ఘవిమర్శనము వ్రాసి, తన్మూలమున, ఆనిఘం టువు చేసినపనియును, చేయుచున్నపనియును లోకమునకుఁ గొంతవ ఱకుఁ దెలుపుటకు నావంటివాని కవకాశ మిచ్చినందులకు వారికి నాకృ తజ్ఞతను దెలుపుకొనుచున్నాను.

ఈ సమాధానము 16-12-39 నాఁటికే మాకుఁ జేరినను శ్రీరామమూర్తిపంతులు గారు సఁజీవులైయుండఁగాఁ బ్రకటింపలేనందులకుఁ జింతిల్లుచున్నారము. (అం. సం.

గ్రంథస్వీకారము.

1. శ్రీ వివేకానంద జీవిత చరిత్రము—మాధవ చైతన్య బ్రహ్మచారిగారిచే రచింపఁబడినది. సంసారసాగరమునఁబడి జననమరణాది దుఃఖతరంగపరంపరాతాడనములకుఁ దాళఁజాలక సంకటపడు సంసారులను, నిజహితోపదేశనౌకలచే నుద్ధరించి, శాశ్వతానందసుందరమగు పరమేశ్వరచరణారవింద మందిరమునఁ జేర్చువార లోక జ్ఞానకళాపరిపూర్ణులగు దేశికసుధాకరులే. సందియము లేదు.

నేఁటి పరదేశనాగరకతా వ్యామోహములచే సనాతనమత సాంప్రదాయములు సడలుచుండుటను గాంచి, "యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత, అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం", అను గీతాప్రతిజ్ఞానుసారము అధర్మమునడంచి ధర్మమును నుద్ధరింపనెంచి కరుణామయుఁడగు భగవానుఁడు భారతవసుంధరను, వంగదేశాన శ్రీరామకృష్ణపరమహంస రూపముతో నవతరించి, నిజసుబోధసుధావాహినులచే, సనాతనమతవిముఖులైన జనతను, వైదికమతాసక్త చిత్తులుగాఁ జేసి లోకైకవిఖ్యాతిం గాంచి పరబ్రహ్మమున లయమయ్యెను.

ఆసంయమీంద్రుని శిష్యగణములో నగ్రగణ్యుఁడై స్వవివేకానందచంద్రికల భూవలయమంతటను బ్రసరింపఁజేసి, అప్రతిహత వాగ్వైఖరీశోభితుఁడై, కుమతమత్తేభపంచాననుఁడై, అసమాన బ్రహ్మచర్య తేజోభాస్కరుఁడై, విద్వజ్జనచక్రవర్తియై, శ్రీ శంకరభగవత్పాదులవలె నిజసుభాషితామృతవర్షములచే జనసమూహముల నానందాబ్ధి నోలలాడించి, ముప్పదితొమ్మిదవ యేఁట నద్వైతానందపదమున కేఁగిన శ్రీవివేకానందచంద్రుని పూతజీవితచరిత్రము నాంధ్రభాషను విరచించి చెన్నపురి శ్రీరామకృష్ణమఠమునుండి శ్రీ మాధవచైతన్య బ్రహ్మచారిగారు మాసోదరులకు దయతో నందఁజేసియుండిరి. మేమా చరిత్రమును భక్తిగౌరవములతో నామూలాగ్రము పఠించి అమితానందము నందితిమి.

ఈగ్రంథరాజమునందలి భాషాశైలి మృదుమధురమై ఆబాల

వృద్ధము జనసమూహమునకంతకును సుబోధమగురీతిని సమకూర్పఁబ
నది. ఇం దనేకములగు నశ్రుతాపూర్వవిషయము లెన్నియో చెన్నారు
చున్నవి. శ్రీ స్వామివారి జీవితకథావైభవములఁదెల్పు నిందలి ప్రక
ణము లోకదానిని మించి యొకటి ముందెట్టిమనోహరచరితము పొంద
పఱుపఁబడియున్నదో యను నభిలాష నుదయింపఁజేయుచున్నవి.

మఱియు వివేకానందయతీంద్రుని వదనారవిందమునుండి వెల
వడిన సుధామయభాషితము లెన్నియో యిందుఁ గ్రోడీకరింపఁబడి, పీన
లకు విందొనర్చుచున్నయవి. ఈగ్రంథమును జదువునపుడు హృదయ
మానందతుందిలమగుచుండును. కనుఁగొనలనుండి యానందాశ్రుబింద
వు లాణిముత్తెములట్లు నేల రాలుచుండును. హస్తమునన్న పుస్త
ముపట్టువీడి యొడిలోఁ బడుచుండును. పెక్కుబాసలేల? దీనింజదువునప
డంతరంగమున నేదియో తెలియరాని యానందతరంగమాలిక తాండ
వమాడుచుండును. భౌతికవిషయవ్యామోహితులై యెట్టినిలకడయును
లేక తబ్బిబ్బగుచున్న నేటిభారతసోదరీసోదరులకిట్టి సుందరసందేశము
యొందీయఁదగినవి. ఈగ్రంథరాజము ప్రత్యాంధ్రకుటుంబమునందును
స్త్రీపురుషులచేఁ దప్పక పఠింపఁబడవలయునని మాయభిలాష.

(గ్రంథమువెల రూ 1—8—0.)
కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రి.
కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి.

---

2. నందపురచరిత్రము—జయపురవాసులగు కుమారవిద్యాధర
సింహవిరచితము. కీ. శే. జయపురమహారాజులగు రామచంద్రదేవు
బహద్దురువారి కంకితము (Nandapur a Forsaken Kingdom)

దక్షిణకాశియని ప్రసిద్ధిని గాంచినదై ఈశానగంగాతీరమునఁ
బ్రాచీనరాజధానియగు నందపురమున నేటి జయపురమహారాజుల పరి
పాలనమునఁగల రాజ్యభాగమును నంద, శీల, గజపతి, శంకరవంశపు

రాజులు పాలనము చేసిరి. నేఁటి జయపురరాజులు శంకరవంశీయులు, వీరి వంశము పదునైదవశతాబ్దమున శ్రీ వినాయకదేవునితోఁ బ్రారంభమయినది. ఈవంశీయులు ప్రథమమునఁ గాశ్మీరదేశమునకుఁ జెందినవారనియు, నందు శ్రీ వినాయకదేవుఁడు కడపటి గజపతిరాజపుత్రికను బరిణయమై యీదేశమునకుఁ బ్రభుత్వమును వహించెననియుఁ దెలియుచున్నది. గజపతుల పాలనానంతర మీవంశీయులు ప్రాముఖ్యమును వహించి నాఁటినుండియు జయపురప్రాంతమును బాలించుట మనకు విదితము. ఈగ్రంథమున నేఁటి జయపురవంశీయులచరిత్రము మాత్రమే వివరింపఁబడినది. ప్రాచీనచరిత్రము దిఙ్మాత్రముగ నిరూపింపఁబడినది. అనుబంధముల, నీచరిత్రమున గ్రంథకర్త కుపకరించిన గ్రంథభాగములు క్రోడీకరింపఁబడినవి. పెక్కువిషయములఁబరిశోధించి గ్రంథకర్తలు జయపురచరిత్రమున ఆధునికచరిత్రభాగమును రచించినందులకు వారిని మనము ప్రశంసింపవలసియున్నది.

---

౩ కమ్మవారిచరిత్రము—శ్రీ కొత్తభావయ్యచౌదరిగారిచే రచింపఁబడినది. (History of the Kammas-part I) గ్రంథశీర్షికవలననే కమ్మవారు ప్రాచీనాంధ్రక్షత్రియులని నిరూపించుటయే గ్రంథకర్తల యుద్దేశమని విదితమగుచున్నది. కమ్మవారాంధ్రులనియు, ప్రాచీనాంధ్రులు కర్మకరులై కమ్మరాష్ట్రము నేర్పఱిచిరనియు, వీరు కరికాల దుర్జయవంశీయులనియు, చోడచాళుక్యవంశీయులు వెలమరాచవంశమువారైరనియు గ్రంథకర్తలు నిర్ధారణ మొనర్చుటకుఁ బ్రయత్నించియున్నారు. నేఁటికాలమున కమ్మవారు, రెడ్లు తాము చతుర్థకులజులముకామనియు, ప్రాచీన క్షత్రియవంశమువారమనియుఁ బరిశోధనలసలుపుచుండు టందఱకును విదితమే. కాకతీయులు క్షత్రియులా? అనువిషయమునుగూర్చియుఁ గొన్ని సంవత్సరములక్రిందట నిట్టి చర్యలు జరిగినవి. పూర్వకాలమున క్షత్రియ వంశములవారు రాష్ట్రాధిపతులగుటవలననేమి, ఇతర కారణముల వలన

నేమి రెడ్డి కమ్మ తెగలవారితో సంబంధ బాంధవ్యములను జరిపియుండుట నిజము. కాని యిట్టిసంబంధములు రెడ్ల యొక్కయు, కమ్మవారియొక్కయు క్షత్రియత్వమును నిస్సందేహముగ నిరూపింపఁజాలవు. ఈరెండు తెగల వారును ఆంధ్రరాజ్యమునఁ గొన్నిరాజ్యభాగములను బరిపాలించియుండుటమాత్ర మందఱంగీకరింప వలసియున్నది. వీరందఱును నిజముగ క్షత్రియవంశముల వారైనచో వారినట్లు గణింప నెట్టి యభ్యంతరములు నుండరాదు. కాని శాసనాద్యనేక ప్రమాణములు వీరలను చతుర్థకులజులుగఁ జేర్కొనుచున్నవి. ఈగ్రంథము రెడ్డికులనిర్ణయచంద్రికవంటిది. ప్రథమమున క్షత్రియులై తరువాతఁ జతుర్థకులము వారైనట్లు వాదించుట యుక్తియుక్తముకాదు. ఇత్యాది గ్రంథమునఁ బ్రథమభాగము మిగిలినవి ప్రచురింపఁబడిన తరువాత వీరివాదోపవాదములఁ బాఠకులు సవిమర్శముగఁ గైకొందురు గాక.

---

4. బరోడా ప్రాచ్యపరిశోధకసంఘనివేదిక (1937-38) బరోడా మహారాజావారిచే నీ సంఘము 1904 వ సంవత్సరమున నేర్పఱుపఁబడి నాఁటినుండియు వారిరాజ్యములోఁగల ప్రాచీనకట్టడములు, శాసనములు మొదలగువానివిషయమై పరిశోధనల జరుపుచున్నది. దీనికి జ్ఞానరత్న డాక్టరు హీరానందశాస్త్రిగారధ్యక్షులు. 1937-38 సంవత్సర నివేదికయందుఁగొన్నినూతనవిషయములు దెలుపఁబడినవి. సరస్వతీనదీగర్భమున నద్భుతమైన చెక్కడపుఁబనిగలిగిన ప్రాచీనశిలాఖండములు దొరకినవి. దీనినిగూర్చి నివేదికయందిట్లు తెలుపబడినది. ' It is one of the finest pieces of carved stone work. The design is that of a large floral scroll with arabesque curls and the piece seems to have been a pendant from a ceiling a favourite form of decoration with the Hindu and Jaina Silpins of early Guzerat or ancient India'

మఱియు 'సందకస' యని బ్రాహ్మీలిపిలో వ్రాయఁబడిన క్రీ.శ. రెండవ శతాబ్దమునాఁటిదగు ఘటభాగమును, బ్రాహ్మీలిపియందే విగ్రహము వెనుకను బౌద్ధయుగమునాఁటి మహాదీశాసనమును వీరికి లభించినవి. మిగిలిన శాసనములర్వాచీనములు. ఘూర్జరదేశమునఁ బ్రాచీనకాలమున నత్యద్భుతమగు శిల్పచాతుర్యమును గనఁబఱుచు చెక్కడము లుండెననియు (Wood Carving) నట్టివానిని ధనాశచే పాశ్చాత్యదేశములవారికి మనదేశీయులు విక్రయించుట గలదనియు, నట్టివి విక్రయింపఁబడకుండ నుంచుటకై దొరతనమువారు దండనమును విధింపవలసియున్నదనియు నీనివేదికయందు హెచ్చరింపఁబడినది. మనదేశమున నుండినప్రాచీనశిల్పము, విలువగలవస్తువులు విదేశములకుఁబోవుచుండుటయు, నచటి వస్తుప్రదర్శనములఁ జేర్పఁబడుటయు విషాదకరము. శాసనసభలయందట్టివానినిగూర్చి తగిన చర్యలు జరుపఁబడవలసియున్నవి. మఱియొక ముఖ్యవిషయమీనివేదికయందు (పు. 5) చర్చింపఁబడినది. దేవాలయములపై నసభ్యములగు ప్రతిమల నెందులకుఁ జెక్కించుచుండిరను ప్రశ్నకు సమాధానముగ శైవ, వైష్ణవమతములకు సంబంధించి శాక్తేయులు కొందఱు వామమార్గమున ననుసరించుచుండిరనియు,

అంతః శాక్తా బహిశ్శైవాః సభామధ్యేచ వైష్ణవాః

నానారూపధరాః కౌలా విచరంతి మహీతలే—అనినరీతిని వామమార్గసూచకముగ నిట్టివి చిత్రింపఁబడుచుండెననియు, దృష్టిదోషమును నివారించుటకుఁగాని, భక్తుల నాకర్షించుటకుఁగాని, వారిమనస్సులను శృంగారవిషయ విముఖములుగఁ జేయుటకుఁగాని యట్టియసభ్యశిల్పమేర్పడినదనుట యుక్తముకాదనియు నూహింపఁబడినది.

పీ ఠి క.

లక్షణసారసంగ్రహమను నీఛందోగ్రంథమును రచియించిన చిత్రకవి పెద్దన కవివరుఁడు శుక్లయజుశ్శాఖాప్రభాసురుఁడు. కాత్యాయనసూత్రుఁడు. భారద్వాజగోత్రుఁడు. ఈతనితాత చెన్నయ. తండ్రి సర్వయామాత్యుఁడు. తల్లి లక్ష్మమాంబ. కాశ్యపసగోత్ర నల్లగట్ల మైలయాచార్యుఁ డీతనిమాతామహుఁడు. వీరి యింటిపేరు పార్శ్వంచాలవారు కావచ్చును. * కాని, చిత్రకవితయందు ఘనుఁడగుటం జేసి యీతనినాంటినుండియుఁ జిత్రకవివారైనట్లు లీతనిపుత్రుఁడు అనంతకవియుఁ బౌత్రుండగు రమణకవియుఁ దమకావ్యములగు ఇందుమతీపరిణయ సాంబవిలాసములందుఁ దెలిపియున్నారు.

ఈతని గురువు 'కందాళ అన్నగారు.' అని గురుస్తుతిచేయఁబడుటచే నీతఁడు వైష్ణవమతావలంబియనుట నిజము. కృతిపతియగు వెలలూరి యాంజనేయుని శ్రీరామచంద్రదాసచంద్రుఁడనియు, 'రాఘవదాస' యనియు, 'శ్రీరామపాదసేవారామ' యనియుఁ బ్రపత్తిపూర్వకముగ స్తుతించుట వైష్ణవసంప్రదాయమును దెలుపుచున్నది.

ఇక్కవినివాసస్థలము వెలలూరని కలదు. వెల్లటూరు అనునది శ్రీశైలప్రాంతమున నున్నట్లును బండితారాధ్యుఁ డచ్చటికి వెళ్లినట్లును

---

* ఈ లక్షణసారసంగ్రహము తాళపత్త్రములమీఁద వ్రాసికొనినవాఁడు చిత్రకవిబుచ్చయాచార్యులతమ్ముఁడు రామాచార్యుఁడు. ఈతఁడు రచించిన రఘునందనవిలాసమునం దాశ్వాసాంతగద్యములలో వెక్కిరేల చిత్రకవివారని చెప్పుటం జూడ భారద్వాజగోత్రులగు నీ చిత్రకవివా రాయాగ్రామనామములనుగూడఁ జేర్చి యింటిపేరు వాడుకొనుచుండిరని యూహింపనైయున్నది. ఈతఁడు వెక్కిరేల చిత్రకవివంశపువాఁడైనట్లే "పార్శ్వంచాల చిత్రకవి వంశపువాఁడేమో పెద్దకవి" యని యూహ పొడముచున్నది. ఎట్లూహించిన నట్లుసరిపడు సందిగ్ధావస్థయందున్నది గానియిదమిత్థమని నిర్ణయింప నాధారము లింతవఱకుఁ గానరావు.

బండితారాధ్యచరిత్రమున వర్ణింపఁబడియున్నది. అయ్యది కడపమండలము లోనిది. ఆవెల్లటూరే యీవెల్లలూరేమో వ్రాఁతయందలి భేదమువలన నట్లు భిన్నముగా నైనదేమో యనిపించుచున్నది. "ధరానుత వెలలూరి పురీహనుమంతునకున్, వెల్లలూరి హనుమన్మూర్తి" యని యిందుఁ జేర్కొనఁబడినతావులందు 'వెల్లటూరు' అనినను బాధ లేదు. పండితారాధ్య చరిత్రముననే 'వెల్లలూరు' అనియుండుట కందు 'వెల్లటూ'రని పడిన దేమో! స్థలజ్ఞు లావిషయమై నిర్ణయించుదాఁక వెల్లలూరో వెల్లటూరో నిశ్చయింపఁజాలము. *

కవికాలమునుగూర్చి యిందేమియుఁ దెలుపఁబడలేదు. కాని, కందాళ అన్నగారు—పాండురంగమాహాత్మ్యకృతిపతి విరూరి వేదాద్రి మంత్రి—మతగురువగు కందాళ యప్పగారితండ్రియని రామలింగనిచేఁ జేర్కొనఁబడినవా రొకరు గలరు. అందు అణ్ణగారని ణకారఘటితముగా మాత్రమున్నది. అయ్యది కన్నడభాషాసంప్రదాయమై యుండును. ఆ

*శివతత్త్వసారమున కుపోద్ఘాతము వ్రాయుచు శ్రీ కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణ రావుగారు వెల్లటూరినిగూర్చి యిట్లు వ్రాసియున్నారు. "గుంటూరుజిల్లాలో రెండు వెల్లటూళ్లు గలవు. ఒకటి రేపల్లెతాలూకాలోను, నింకొకటి వినుకొండతాలూకాలోను నున్నవి. నైజాము రాజ్యమున నల్లగొండజిల్లాలోఁ గూడ నొక వెల్లటూరు గలదు. కాని శ్రీశైలమునకు సంబంధించినది వినుకొండతాలూకాలోనిదియే. ఇదివినుకొండనుండి శ్రీశైలమునకుఁబోవు త్రోవకు నాలుమైళ్లు ప్రక్కగనుండును."

వెల్లటూరినిగూర్చి రేపల్లె వినుకొండ తాలూకాలలోనున్న వెల్లటూళ్లకు నుత్తరములు వ్రాసి స్థానికులఁ గొందఱ నడిగి వారు రెండు గ్రామములందు ఆంజనేయస్వామి యాలయములు పురాతనము లేవియు లేవనియుఁ, జిత్రకవివా రాగ్రామములలో లేనట్లును దెలిపిరి. నైజాముమండలములోని వెల్లటూరేమో యని సందేహించి "విభూతి" పత్రికాధిపతులగు శ్రీ చిదిరెమఠము వీరభద్రశర్మగారికి వ్రాసి కనుఁగొన వారాప్రాంతముల వెల్లటూరను గ్రామ మున్నదని యనుకొనుటయే కాని దానినిగూర్చిన వివరములు తెలియవనియుఁ గనుంగొని తెలియవచ్చిన వృత్తాంతము నెఱింగింతు మనియు వ్రాసినారు. కావున వారేనాఁడేని దెలిపినయెడల నందాధారమేమేని దొరకినచో వెంటనే ప్రచురింతుము.

కందాళ అన్నగారు పెద్దనకు గురువైనట్లు "కందాళయన్నగారిశిష్యుఁడఁ బెద్దన కవివరుండ" అనువాక్యమువలనఁ దెలియనగును. అప్పయగారి శిష్యుఁడగు విరూరి వేదాద్రి 1581, 1611 ప్రాంతములవాఁ డగుటచే అన్నగారు 16 వ శతాబ్దమధ్యమున నుండవచ్చును. కవులచరిత్రప్రకారము 16 వ శతాబ్దమునందలి యీపెద్దన, యాశతాబ్దమధ్యమందలి అన్నగారికిఁ జిన్నవయస్సున శిష్యుఁడై యుండి, యాశతాబ్దాంతమునఁ బ్రౌఢవయస్సున లక్షణసారసంగ్రహము రచించెనని చెప్పవచ్చును. సులక్షణసారము రచించిన వెల్లంకి తాతంభట్టును, కవిసంజీవిని రచించిన ముద్దరాజు రామన్నయును నీశతాబ్దములోనివారే. ఆశతాబ్దివాఁడగు తాతంభట్టు వృద్ధుఁడై యుండును. దాన ఛందశ్శాస్త్రమును దెనుఁగునఁ జెప్పినవారి నుతించుచు ముద్దరాజు రామనను విడిచిపెట్టి, తాతంభట్టును మాత్రమే స్మరించుట కల్గినది.

ఉ. త్ర్యక్షవరప్రసాదకవితాఢ్యుని వేములవాడభీము, న
య్యక్షతభక్తి విస్ఫురదనంతు ననంతుఁ గవిత్వలక్షణా
ధ్యక్షులఁ గాచిరాజు బసవార్యుని, భైరవు, నూత్నదండి, వా
గ్వీక్షణకర్ణనేతయగు వెల్లఁకి తాతబుధేంద్రు నెన్నుచున్.

అని ప్రాచీనులలో వెల్లంకి తాతంభట్టును స్మరించి ముద్దరాజు రామనను చేర్కొనలేదు. ఒకవేళ రామన తనకు సమకాలికుఁడైనను భిన్నస్థలవాసులయి రొండొరుల నెఱుంగకుండుటచే విడిచినను విడువవచ్చును.

ఈతఁడు రచించిన గ్రంథములు:— 1. ఆంజనేయశతకము. 2. లక్షణసారసంగ్రహము. * లక్షణసారసంగ్రహావతారికలో స్వప్నమునఁ దన కాంజనేయుఁడు కానవచ్చి,

---

* రమణకవి సాంబవిలాసమున సీ. సర్వలక్షణసారసంగ్రహం బొనరించి తనరె మీతాత పెద్దన కవీంద్రుఁడు" అని దీనినే సర్వలక్షణసారసంగ్రహమని వ్రాఁడు.

"క. మున్నొక శతకము మాకుం
జిన్నపుడె సమర్పణంబు చేసితి వికనున్
సన్నుతలక్షణకృతి య
స్మన్నామాంకితము సేయుమా యిపు డనినన్."

ఈలక్షణసారము రచించినాఁడఁట. శతకమున్నదో లేదో తెలి యదు కాని యాంధ్రులభాగ్యవశమున నేఁటి కీ లక్షణసారసంగ్రహము బయలుపడినది.

ఆంధ్రచ్ఛందోగ్రంథములు.

ఆంధ్రభాషయందు కవిజనాశ్రయము, అనంతునిఛందోదర్పణము, లక్షణసారసంగ్రహము, కావ్యాలంకారచూడామణి, లక్షణసారము, సులక్షణసారము, కవిసంజీవిని, అప్పకవీయము, రంగరాట్ఛందము, సర్వలక్షణసారసంగ్రహము, మున్నగుఛందోగ్రంథములు పెక్కులు గలవు. నన్నయభట్టకృతమగు ఛందస్సారమను గ్రంథమొకటి కలదను ప్రతీతియే కాని యాగ్రంథ మెచ్చటను లేదని చరిత్రకారులు దెలిపి యున్నారు. తరువాతిది భీమనగ్రంథము. అందుఁ గేవలము ఛందస్సును గూర్చియు, దోషములనుగూర్చియు మాత్రమే కలదు. అనంతునిఛందమునఁ గవిజనాశ్రయమందలి దోషములు మాత్రమే కాక షట్ప్రత్యయములనుగూర్చి విపులము చేయఁబడి, సమాసములు, సంస్కృతసంధులు, విశేష్యవిశేషణములువర్ణములు మున్నగువిశేషములు వెలయింపఁబడినవి. పిమ్మటిదగు నీలక్షణసారసంగ్రహమున వర్ణములు, అక్షరజాత్యాదిలక్షణములు, గురు, లఘు, గణసంజ్ఞలు, కావ్యస్వరూపము, కవినేతృస్వరూపములు ప్రాసభేదములు యతివిశేషములు, * షడ్వింశతిచ్ఛందములు, సమార్ధవిషమ వృత్తవివేచనము, షట్ప్రత్యయములు, దండకలయగ్రాహికందగీత్యక్కరాదిభేదములు, రేఫనిర్ణయమును, నాటకలక్షణమును,

---

* ప్రాసములు పదునెనిమిది విధములనియు, యతు లిరువదియేడు విధములనియు వివరింపఁబడెను.

చిత్రకవిత్వలక్షణమునుగలవు. అవ్యవహితపూర్వమగు సులక్షణసారమ
నిన్నివిశేషములు లేవు. పూర్వపద్ధతినిగాక, కేవలము ఛందస్సు, షట్ప్ర
యములు, యతి, ప్రాస, కవిసమ్మతగణోత్పత్తివిచారము మాత్రము కల
ఈక్రమము లక్షణసారమునకును, అప్పకవీయమునకును దలక్రిందులు
నున్నది. షట్ప్రత్యయములు:—కవిజనాశ్రయము, ఛందోదర్పణములం
సూక్ష్మముగాఁ దెలుపఁబడినవి. వానికంటె లక్షణసారమునను,నన్నిటికం
నప్పకవీయమునను విపులీకరింపఁబడినవి. షట్ప్రత్యయములలోని ప్రస
రము, వృత్తసంఖ్య మాత్రమే సులక్షణసారమునఁ గలవు. తక్కిన నా
విభాగములు గానరావు. కళికోత్కళికాదులగు చిత్రకవితారీతులు క
జనాశ్రయమునను, సులక్షణసారమునను లేనేలేవు. కావ్యాలంకారచు
డామణియందు లక్షణములు మాత్రముగలవు. కాని లక్ష్యముల
లేవు. ఆలక్షణములును సూక్ష్మములుగాఁ జూపఁబడినవి. ఇఁక లక్ష
సారమునను, అప్పకవీయమునను లక్ష్యలక్షణములతో విపులము
నున్నవి. అప్పకవి వివరించిన వ్యాకరణవిచార మిందు లేదుగాని యా
ధ్రలాక్షణికులు ప్రాచీను లెవ్వరును వివరింపని నాటకలక్షణము
త్రము సంస్కృతనాటకలక్షణానుసారముగాఁ జక్కగ వివరింపఁబడినది.

షట్ప్రత్యయవివేకము కవిజనాశ్రయముకంటె ననంతునిఛం
మున విపులముగానున్నది. లక్షణసారమున సూక్ష్మరూపముగా
యప్పకవీయమునఁ బరిపూర్ణతఁ గాంచినది. అప్పకవి యందఱికంటె
విపులముచేసి లక్షణము దీర్చినాఁడు. షట్ప్రత్యయములవిషయమై అ
కవికంటె నెక్కువ వివరించినవారు పూర్వులలో నెవరును లేర
మాటయే.

---

* వృత్తలక్షణములు ఛందోగ్రంథము లన్నిటియందును రెండు మూఁడు పాద
లలోఁ గాని యిమడనివి యిందొక్కొక్కపాదమునందే యిమడ్పఁబడియుండుటవ
విద్యార్థులు సులభముగాఁ గంఠస్థములు చేసికొన నగును.

చిత్రకవిత్వవైఖరులలో నీకవి మిగులఁ జాతుర్యమును జూపి యున్నాఁడు. అందుఁ గల్పితకల్పవల్లికాబంధము మిగుల మెచ్చఁదగినది. అప్పకవి యీతనిపోకడనే యనుకరించినవాఁడు. ఈబంధమున నాలుగు చంపకమాలావృత్తములనుండి పదునేడు వృత్తములు వెలువడుచున్నవి. ఇయ్యది తాళపత్రప్రతులందుఁ గ్రిమిదష్టమై వ్రాయసగాండ్రపొరపాటు వ్రాఁతలతో నిండియున్నది. అట్టిదానిని సర్థయుతముగాఁ గవిభావమునూహించి సంస్కరించి ప్రచురించిన సాహిత్యపరిషద్వ్యవహర్తలగు (Manager) బ్రహ్మశ్రీ వ్యాకరణ విద్యాప్రవీణ చిలుకూరి పాపయ్యశాస్త్రిగా రెంతయుఁ బ్రశంసార్హులు. వీరికిఁ బూర్వము వ్యవహర్తలుగానుండి పనిచేసి కీర్తిశేషులైన శ్రీయుత కొత్తపల్లి సూర్యరావుగారీగ్రంథప్రకటనమునకుఁ బూనుకొని 3. ఆ. ౭౭ ప. వఱకు మాత్రము ప్రకటించిరి. ఇట్టి గ్రంథములఁ బ్రకటించుటలోఁ గలకష్టము తాళపత్రప్రతులను జూచినవారికిఁగాని తెలియదు. మొట్టమొదట నట్టనడుమ నుపక్రమించి యిట్టి లక్షణగ్రంథమును సమగ్రముగా సంస్కరించుట దుష్కరకార్యమని వేఱ చెప్పనేల?

"ప్రాచీనగ్రంథముల నన్నిటిని బండితులు దిద్ది పాడుచేయుచున్నారనుచు ఘోషించు నాధునికవిమర్శకులకు వ్రేలెత్తి చూపనక్కఱ లేకుండఁ బలుతావుల గ్రంథపాతస్థలములను బూరింపక యట్లే యుంచినారు. లేఖకులప్రమాదములను సవరించిరి. తృతీయాశ్వాసమున 'వెలయఁ దొమ్మిదంకముల దేవిపరికాయ' మనిమూలముననున్నదనియు, శారదాతనయుని భావప్రకాశమునఁ "దొమ్మిదంకములతో దేవీపరిణయమను రూపక మొకటి చెప్పఁబడినది. కావున నియ్యది దేవీపరిణయమే కాని దేవిపరికాయము కా"దని సవరించిరి. సవరించిన వేవేని యున్నచో నిట్టివే కాని తమమతమున కనుకూలముగా నుండవలెనని సవరించిన భాగములు లేవనవచ్చును. కావున భాషాభిమానులగు విమర్శకు లాగ్రహింపకుందురు గాక.

"అన్నియుపసర్గలు స్వరసమన్వితముగ..."

మున్నగుచోట్ల "ఊష్మ,వర్గ,చిహ్నోపసర్గాదిశబ్దములు మువర్ణకరహితముగాఁ బ్రయోగించెను. "కవిప్రయుక్తము సర్వము గ్రాహ్యమే కాని, కాదన మీరెవ్వ"రనువారిఁ జెప్పి యొప్పింపఁ జాలము. కాని క్వాచిత్కములు, నేకదేశపతితములును, బ్రమాదములేకాని ప్రమాణములుకానేరవని యొప్పుకొను సహృదయులకుమాత్ర మెత్తి చూపక తప్పదు. ఎంతవానికేని ప్రమాదము రావచ్చును. ప్రమాదము ప్రమాదమే. ఊష్మాదిశబ్దములు చరిత్రాదులలోఁ జేర్చి సాధుత్వ మొకవేళ సాధించినను, శబ్దరత్నాకరములో వైకృతపదమని చెప్పఁబడిన 'ప్రాపు' శబ్దములోని 'ప్ర' యుపసర్గముగా సాధించుట సాధ్యమెట్లు? అయ్యది భ్రాంతిపతిత మనవలయును.

ఈభ్రాంతి యిటుండనిండు. బోడలకు లక్ష్యముగా నొసంగిన యీకందపద్యము తిలకింపుఁడు.

క. క్షితి ధృతి నిధిని నిలిపితివి
స్థితి నిక్కి దివికి నిగిడితి శిఖజగి నిర్జిం
చితి ద్విడ్విధి విరివి విడిచి
కృతిని వినిర్మించితి సితి ఘృణికి గిరి గృహీ. ఆశ్వా 3. ప ౧౨౯.

ఇందలి ధృతి, కృతి, ఘృణి, గృహీ, శబ్దములలోని వట్రసుళ్లను బూర్వకాలమున ధ్రితి, క్రితి, ఘ్రిణి, గ్రిహి, అని యికారవిశిష్టములుగా వ్రాయు సంప్రదాయ ముండుటవలన బోడలకు లక్ష్యముగాఁ గవి ప్రయోగించెను. కాని పరిష్కర్తలిప్పటిలిపి ననుసరించి వట్రసుడిగలదిగాఁ బరిష్కరించిరి. అట్లు పరిష్కరింపలేని నేటివారి కీమార్గము విపరీతముగా నుండుటనిజమే. కాని, దాని నా పుటయడుగుభాగమున వివరింపవలసినది. ఇట్టి వేవేని ప్రమాదము లున్నచోఁ బాఠకలోకము సవరించుకొని పఠింతురుగాక.

ఇట్లు,
విబుధవిధేయుఁడు,
అమలాపురం. 15—1—1940. విద్వాన్—వెంపరాల సూర్యనారాయణశాస్త్రి.

శ్రీరస్తు.

పరిషత్పుస్తక భాండాగారము

మూఁడవభాగము.

లక్షణగ్రంథములు.

---

1. లక్షణశిరోమణి — గ్రంథసంఖ్య-1297.

ఇది పొత్తపి వేంకటరమణకవిచే రచియింపఁబడినది. అఱువదిమూ
ము తాటియాకులపై వ్రాయఁబడియున్నది. ఇందుఁ బ్రథమ ద్వితీయా
శ్వాసములు పూర్ణముగను, తృతీయాశ్వాసము కొంతభాగమును గలవు.
గ్రంథాంతమున "కానాల నరసప్ప కొమారుడు వెంకట్రాయుడు వ్రాసిన
లక్షణశిరోమణి శ్రీరామార్పణమస్తు" అనికలదు. గ్రంథ మెప్పుడు వ్రాసి
నది యెప్పుడును సూచింపఁబడియుండలేదు. గ్రంథమున నున్నంతవఱకు
గ్రంథపాతములు లేవు. వ్రాఁతరీతియుఁ బ్రాచీనమే. వ్రాఁత తప్పులంత
గ లేవు.

గ్రంథారంభము.

క. శ్రీరామా రమణజయు
శ్రీరమ్యగుణాభిరామ శ్రీ వేంకట లో
కారాధ్య బ్రోవు మమ్ము ద
యారససుమధామ వేంకటాచలధామ!

... ...

క. ధరఁ గలుగు సకల విద్యా
పరిణతు నతిసుకవి సార్వభౌముని నస్మ
ద్గురు తరుణి వాయుకుల గురు
నరసింహకవీంద్రు నెమ్మనంబునఁ దలఁతున్.

ఈకవి తన్ను గూర్చి యిట్లు చెప్పుకొనియున్నాఁడు.

సీ. శ్రీనాథు చక్ర ప్రసిద్ధ బంధాభిజ్ఞ
ధీమునిఫణిబంధ పేశలంబు
శబ్దశాసనుని యిచ్ఛా వాగ్విలాసంబు
సోమ రసంతుని పాదగోపనగతి
భాస్కరు వరఖడ్గబంధసంధానంబు
ప్రబలు సోముని పద్మబంధ మహిమ
మాధవు శయ్యాచమత్కారము మురారి
కలితత్రిప్రాస సంఘటితపటిమ

గీ. భారవికవి పదార్థసత్కారవంబు
భారతీవృత్తి నీయందె పరిణమించి
నిలిచె పుంభావలీలమై నిక్క మహహ
రమణ సుకవీంద్ర సత్కవిరాజచంద్ర !

సీసమాలిక.
తత చిత్రబంధసంధానధౌరంధర్య
అక్షరలక్షణాధ్యక్షు దక్షు
ఆశుమాధుర్య విస్తార ధీచాతుర్య
ఘనవిధాయుధయుద్ధకౌశలజ్ఞు
కల్పితవృత్తాధికారజ్ఞు హల్లుగో
పన లక్ష్య లక్షణప్రాభవజ్ఞు
జ్యోతిషగ్రంథైక సారజ్ఞు వివిధావ
ధానమేధా నిదానచరిత్రు

కలినైకశేషఱకారోష్ఠ్యనైరోష్ఠ్య
కల్పితవృత్తసంకలితచతుర
వ్యస్తాక్షరాభిజ్ఞ వాస్తుశాస్త్రవిధిజ్ఞ
ఏకాక్షరీ ద్వ్యక్షరీధురీణు
ప్రాక్ప్రబంధోచిత ప్రక్రియాపద్య సం
గ్రహణధారణ నిరాఘాటపటిమ
సంతతనూతనేచ్ఛాకల్పితాద్భుత
కరలిపిప్రకటనోత్కట మనీషు
అధికచాతుర్య జిహ్వాచల జిహ్వాద్య
నేకచమత్క్రియా స్తోకతాఢ్యు

గీ. గణితభరతయతిప్రాసగణరసజ్ఞ
అతులతాత్పర్య పాదపద్యభ్రమక ర
చనసుధీనిధి లక్షణచక్రవర్తి
యనుచు ననుఁజాలఁ గవిరాజు లభినుతింప.

సీ. నందవరంబున నలువొందఁగా దశ
గ్రంథాలవారన గణుతి కెక్కి
పిన్నట రాయన ప్రగ్గడవారనఁ
దనరి తర్వాత పొత్తపి యనేటి
గ్రామనామమునఁ బ్రఖ్యాతిఁ గాంచి యనంత
రంబున ధర దుర్గరాజుపేర
పౌరుషేయంబునఁ బ్రాథిచే గౌతమ
గోత్రుండగు పసిఁడి కొండదుర్గ
రాజువేంగన పౌత్రుండ రామఘనుని
పుత్రుఁడ మదూరి కొండార్యపుత్రుఁడైన
మొలమిరఘునాథమంత్రి దౌహిత్రుఁడ కవి
రాజమిత్రుఁడ వేంకటరమణకవిని.

ఉదాహృతపద్యములఁబట్టి గ్రంథకర్తయొక్కసామర్థ్యమును వంశాదికమును విదితము లగుచునేయున్నవి.

ఇందు వర్ణగణవృత్తమిశ్రమాధికారమ్ములను నాలుగాశ్వాసములు కలవని కవి ప్రథమాశ్వాసమందలి గద్యయందుఁ జెప్పియున్నాఁడు. కాని యీప్రతి తృతీయాశ్వాసమందలి వృత్తాధికారములోఁ గొంతభాగము కలదు. తొలి రెండాశ్వాసములయందును వర్ణగణములనుగూర్చిన విషయమంతయు మిక్కిలి విపులముగఁ గలదు. గ్రంథాంతరగద్యలయందుఁ గూడఁ దాను వ్రాసిన విషయములన్నియుఁ గ్రమముగాఁ దెల్పియేయున్నాఁడు.

గ్రంథాంతభాగము:—

సీ. క్రమముతోఁ జక్రాదిఁగల యష్టపంక్తిలో
 సర్వంబు గురువుల సంజ్ఞ గలవి
క్రింది-నోలియం దమరిన లెక్క న
 లరిన వృత్తము లొక్కలఘువుగలవి
యావెన్క దానిలో నందిన వృత్తము
 లవియు రెండేసి లఘువులు గలవి
యీనాలుగవ విధియందలి వృత్తము
 లవియు మూఁడేసి లఘువులు గలవి
గీ. ఇటులఁగలపంక్తు లన్నింటి కిష్టకరణి
సంజ్ఞ తున్నపంక్తివృత్తముల్ సర్వలఘువు
లవి లగక్రియాప్రక్రియ యనఁగఁబరఁగు
ప్రత్యయము లీలగోపాలబాలకృష్ణ.

ఇయ్యది కేవలము లక్షణస్వరూపమునే దెలుపుచున్నది. ప్రతి లక్షణమునకు సంబంధించిన యితరకవుల లక్షణముల నాకాలమునకుఁ బ్రచారములోనుండిన లక్షణగ్రంథములనుండి గ్రహించి వ్యక్తపఱిచినాఁడు. ఈతఁడుపేర్కొనినలక్షణగ్రంథములు.

భీమనఛందస్సు, అనంతునిఛందస్సు లక్షణసారసంగ్రహము (చిత్రకవిపెద్దన) లక్షణదీపిక(వార్తాకవి రాఘవయ్య)అథర్వణచ్ఛందస్సు,

శ్రీధరచ్ఛందస్సు, గోకర్ణచ్ఛందస్సు, కవిసర్పగారుడము, కవిరాజ గజాంకుశము, వాదాంగచూడామణి మున్నగునవి. వాఙ్మయచరిత్రకారులకు విమర్శకులకు నియ్యది మిక్కిలియుపయోగించును.

లక్షణశిరోమణియను నింకొక పెద్దలక్షణగ్రంథము గణపవరపు వేంకటకవిచే రచింపఁబడినదిగలదు. అదియు నిదియు భిన్నమని పైవిషయముచే వ్యక్తమగుచున్నది.

2. లక్షణశిరోమణి. గ్రం. సం. 148.

ఈవఱకు వివరించిన గ్రంథమునకుఁ దరువాతిభాగమిందుఁ గలదు. ఇదియు నసమగ్రమే. ఇందు తృతీయాశ్వాసము పూర్ణముగను, చతుర్థాశ్వాసమునఁ గొంతభాగమును గలదు. ఇదికొండపల్లిపీచుకాగితముల పై వ్రాయఁబడియున్నది. నూటముప్పదిమూఁడు పత్రములు గలవు. వ్రాయసగాని పేరుగాని, కాలముగాని యెచ్చటను దెలుపఁబడియుండలేదు. వ్రాఁత ప్రాచీనమై కన్నడమోడీని కలదు. అచ్చటచ్చట వ్రాఁత తప్పులు పరిశీలింపఁబడి యున్నవి. కొన్నితావుల నాగరిలిపియందు శ్లోకములు టిప్పణములుగఁ గానవచ్చుచున్నవి.

తృతీయాశ్వాసమున వృత్తములనుగూర్చి విపులముగఁ జర్చింపఁబడినది. పెక్కుతావుల వృత్తరత్నాకరము ప్రమాణముగఁ గైకొనఁబడినది.

చతుర్థాశ్వాసమునఁగవిచెప్పఁబూనినవిషయము నిట్లుపేర్కొనియున్నాఁడు

సీ. జగతి విరతులు ప్రాసస్థానసంజ్ఞలు
వడులుప్రాసములు తత్ప్రాసవిధులు
రేఫఱకారముల్ బుధభక్తిక్రమ
సంధిసమాస విచారములును
దశవిధదోషభేదంబులు సవరస
సంగతుల్ చజయవసర లనియెడి

వర్ణసంకేతముల్ వ్రట్టువల్ ప్రకారలు
కవికల్పితములైన కవులకృతులఁ
జిత్రలక్షణకవితా విశేషములును
మఱియు రచనలఁగల యన్నిమార్గములును
కవులకృపచేత నిత్యాదికంబు లన్ని
తేటపఱచెద నవధారు దేవ కృష్ణ!

పై విషయములలో సమాసములవఱకుఁగల గ్రంథమంతయుఁ బూర్తిగఁ గలదు. ఇందు యతిప్రాసవిషయము నేఁడు మనకు లభించు చున్న లక్షణగ్రంథము లన్నింటికంటె విపులీకరింపఁబడియున్నది. పెక్కు ప్రాచీనగ్రంథములనుండి లక్ష్యములుగై కొనఁబడినవి. దీనిం బట్టిచూడ నీకవి అప్పకవికంటెఁ బూర్వుఁడుగఁ దలంపఁదగియున్నాఁడు.

మచ్చునకొక విషయము.

రఘునాథయ్యగారి దీపికయందు, ఆంధ్రకవి పితామహుని యలంకారంబున గీతిలక్షణముగాఁ బ్రయోగము వ్రాసినది.

గీ. ఇందురేఖాకలాప లోకైకసేవ్య
యురగకంకణ నుతవిబుధౌఘ యనిన
నెఱుఁగ నివి వృద్ధియతులన నరయుచీని
నెలవున నవారమైనను నిలుపవచ్చు.

మఱియు నీవఱకు లాక్షణికులుదాహరింపని పూర్ణార్థబిందు ప్రాస మిందుఁ జెప్పఁబడినది. ఇట్లే పెక్కు నూతనవిషయము లిందుఁ గలవు.

3. లక్షణశిరోమణి. గ్రం. సం. 31

ఇది 'ప్రబంధరాజ వేంకటేశ్వరవిలాసము'ను రచించిన గణపవరపు వేంకటకవి ప్రణీతమగు లక్షణగ్రంథము. ఇందు ఛందోవ్యాకరణాలంకారములఁ గూర్చి తెలుపు పదియుల్లాసములున్నట్లు తెలియవచ్చు చున్నను, పరిషత్పుస్తక భాండాగారమునందలి పై ప్రతియందు నాలుగుల్లాసములు సంపూర్ణముగను, ఐదవయుల్లాసమునఁ గొంతభాగమును

గలవు. ౯ంకుఁగల పత్రములు నూటయెనుబదియొకటి. వ్రాఁత బాగ
గనేయున్నది. అచ్చుటచ్చట పత్రములు క్రిమిదష్టములైనవి. ఆద్యంత
పత్రములు రెండును బూర్తిగ శిథిలమైనవి. ఉన్నంతవఱకు గ్రంథ
పాతములు లేవు.

ప్రథమోల్లాసము — మహాకావ్యస్వరూపకథనము.
ద్వితీయోల్లాసము — వేంకటేశాంధ్రనిఘంటువు.
తృతీయోల్లాసము — ఆంధ్రకౌముది.
చతుర్థోల్లాసము — ఛందోవిషయము.
పంచమోల్లాసము — రేఫఱకారనిర్ణయము.

ఈ గ్రంథమున నీకవి చెప్పఁబూనిన విషయములు తెలియుటకై
ప్రథమోల్లాసాంతగద్యము నుదాహరించుచున్నాము.

ఇది శ్రీమత్పెరంబూదూరి యతిరాజాచార్యవర్యకరుణాకటాక్ష
సంప్రాప్తాంధ్రకవితాసామ్రాజ్యధురంధర, నీతియుగంధర, నందవరకుల
కలశజలధిపూర్ణిమాచంద్ర, సత్యహరిశ్చంద్ర, వాసిష్ఠగోత్రపవిత్ర,
ప్రశస్తాశ్వలాయనసూత్ర, కార్యఖడ్గప్రవీణ, కామినీజనపంచబాణ,
కర్ణాటతుండీరచోళపాండ్యమండలాధీశప్రముఖాఖిల మహీమండలాఖం
డలదత్తమత్తసింధురసైంధవాందోళికా ఛత్రరత్నాంబరాదివస్తుప్రశస్త
మందిర నిరస్తరవసదిన్దిర, సకలకలావిచక్షణ, నిత్యశుభలక్షణ, లక్షణకవి
వేంకటపత్యమాత్యవిరచితంబును, మంగళాంబాసమేతగణపవరాప్పయ
మంత్రిమణివిఖ్యాతిమజ్జనకరూపాలవేల్మంగాసనాథతిరువెంగళనాథాంకి
తంబునగు లక్షణశిరోమణియను మహాకావ్యంబు నందలి ఛందోనిర్ణ
యంబునను, వాగ్దేవీస్వరూపంబును, విప్రకులమాతృకావిధంబును, లద
క్షరనిర్ణయంబును, దేవతిర్యగ్రౌరవగతిభేదంబును, కళాసంజ్ఞ చక్రస్థానఫలం
బును, అక్షరవర్ణప్రకారంబునువర్ణదేవతాశ్రమంబును, అన్యగ్రహనిర్ణ
యంబును, గ్రహమైత్రి విరోధప్రచారంబును, బీజాక్షరమార్గంబును,
సత్వాదిగుణాక్షరప్రకారంబును, శుభగ్రహపాపగ్రహపద్ధతియును, స్వేత

వర్ణాదిచంద్రఫలంబును, సాఙ్గాక్షరభేదంబును, అల్పప్రాణమహాప్రాణంబును, తారాప్రకారంబును, త్రిలింగవర్ణక్రమంబును, నక్షత్రయోని తద్గణమైత్రీవైరతత్ఫలప్రకారంబును, రాశి తద్రాశ్యాధిపతివిధంబును, పంచాశద్వర్ణ ఫలాఫలప్రకారంబును, గురులఘుస్వరూపంబును, గణనిరూపణంబును, ప్రాసభేదంబును, యతినిర్ణయంబును, కందగీతివృత్త సీసాది తత్తత్పద్యక్రమంబును, ద్విపదరీతియు, దండకవిధంబును, యక్షగానరూపకబిరుదగద్యచతుర్భద్రోదాహరణచాటుప్రబంధనిర్మాణంబును, సద్ధళిపద్ధళి కళ్యాణబిరుదావళి ఘాటిపంచక అష్టదిగ్గజనవరత్నకళామాలికాతారావళీశతకకందవృత్తసీసత్రయమాలికా రగడచౌపదప్రభృతి నానావిధవిశేషప్రకటనంబును, గణదోషమైత్రీస్థితియు, శుభగణనిర్ణయంబును, రేఫఱకారప్రాసనిర్ణయంబును, అష్టగణాదిగోత్రసప్తస్వరతదధిదైవతయోనికూట తారాగ్రహగణవర్ణన రాశిరసఫలప్రకరణంబును, కాలస్వరూపంబును, వాసరయామఘటికాదినిర్ణయంబును, నవరసమైత్రీవైర తద్దేవతానిరూపణంబును, నాయకోదాహరణంబును, నాయకప్రకరణంబును, దూతికాక్రమంబును, వృత్తిప్రశంసయు, రీతివిధంబును, పాకభేదంబును, అవస్థానిర్ణయంబును, దశగుణత్రిరూపదశప్రాణప్రకారంబును, విభావానుభావసాత్త్వికభావప్రపంచంబును, తచ్ఛృంగారరసస్థాయిభావనిర్ణయంబును, రసప్రకరణంబును, సంభోగవిప్రలంభశృంగారక్రమంబును, భావహావవిలాసరీతియు, సంచారిభావసర్వరససాధారణతామార్గంబును, రసాభాసవిధంబును, కవిసమయపద్ధతియు, భావోదయభావశాంతి భావసంధిభావశబలతాస్వరూపకథనంబును, వీరరసత్రయనిర్ణయంబును, కవిలక్షణంబును, అష్టాదశవర్ణననిరూపణంబును, చిత్రకవిత్వబంధాదిస్వరూపంబును, ప్రబంధదోషవాక్యదోష నిరూపణంబును, షడ్విరోధనిరూపణంబును, తద్దోషఫలప్రకారంబును, మహాకావ్యస్వరూపంబునునగు ప్రథమోల్లాసము.

ఆంధ్రవాఙ్మయమునఁగల లక్షణగ్రంథములలో నీ లక్షణశిరోమణి
యు, పొత్తపి వేంకటరమణకవి రచితలక్షణశిరోమణియు సంపూర్ణ ము
ఛందోవ్యాకరణములనుగూర్చి తెలుపుచున్నవి. ఈగ్రంథకర్త లిరువురు
ను క్రీ. శ. 17 వ శతాబ్దమువారయ్యును, అపూర్వములయిన ప్రాచీ
గ్రంథముల నుద్ధరించిరి. ఈవిషయ మాంధ్రవాఙ్మయచరిత్ర రచయిత
కెంతేని యుపయుక్తము. ఈగ్రంథములకుఁ బ్రచారము లేనికారణము
వీని నెవ్వరును దడవినట్లగపడదు. ఇవి ముద్రింపఁబడినచో నాంధ్రవా
యమున నూతనశక మేర్పడు ననుటలో సందియము లేదు.

4. సకలలక్షణసారసంగ్రహము. 3471 గ్రం. సం.

ఇదియొక సంకలితలక్షణగ్రంథము. తొలియాఱుపత్రములం
తుదిమైదుపత్రములంకును సులక్షణసారము యాదవామాత్యచ్ఛందమ
లును గలవు. ఏడవ పత్రము మొదలు 25 పత్రములవఱకును సకలలక్ష
సారమను ఛందస్సుగలదు. ఆవెనుక రెండుపత్రములలోఁ గొన్నిబ్రట
పద్యములు, ఒక తిట్టుదండకమును గలవు. కాఁగా నిందు సంపూర్ణ
గ నున్నది సకలలక్షణసారసంగ్రహ మొక్కటియే యని చెప్పనగును
ఇది రత్నాకరము గోపాలకవి ప్రణీతము. వ్రాఁత చక్కనిది. తప్పులం
గా లేవు. గ్రంథపాతము లేదు. పరాభవనామసంవత్సర జ్యేష్ఠబహు
౧౦ గురువారమువఱకు గుడిమెట్ల వేంకటప్పయ్య వ్రాసికొనిన తా
పత్రగ్రంథము అనికలదు.

రత్నాకరము గోపాలకవి తాను గ్రంథమునఁ జెప్పినవిషయమ
ను గ్రంథాంతమున నిట్లు తెలిపినాఁడు.

క. అందంబుగ దశవిధముల
ఛందంబుల లక్షణముల సకలకృతులలోఁ
జెందిన ప్రయోగవితతులఁ
బొందికగాఁ గూర్చినాఁడ బుధులౌననఁగన్.

ఇందులఁ బ్రయోగములు రాజశేఖరచరిత్రము, కమలాకర చరిత్రము,అంబాలభాణము మున్నగు నపూర్వగ్రంథములనుండి కైకొనఁ బడినవి. గ్రంథాదిని ఛందస్సుఁగూర్చియు, విశ్రమములఁ గూర్చియు, విషయములు సులక్షణసారమునుండియే తీసికొనఁబడినవి. పద్యముల యం దేమియు మార్పు లేదు. మచ్చునకొక ఘట్టము.

వికల్పప్రాసము:—

గీ. సానునాసికలై వర్గ హల్లు లవి ద్వి
తయలు కవికల్పప్రాసమై యలరు ప్రాజ్ఞ
గంబుపై రవిదోఁచె నగ్నివోలె
ప్రాఙ్ముఖుండయి వినుతించె వాగ్మి యనఁగ.

లక్ష్యము—పద్మావతిచరిత్రము:—

క. పద్మాసమానమగు నా
పద్మావతిఁ జూచి ధరణిపాలసుతుండు
ద్మన్మోదంబునఁ దనముఖ
పద్మము నలరించె ననుచుఁ బరిజను లలుకన్.

'సౌగంధికప్రసవాపహరణ'మను ద్విపదకావ్యము రచియించిన రత్నాకరము గోపాలకృష్ణకవికి నీ గోపాలకవి మనుమఁడో లేక ముని మనుమఁడో కానోపును. గోపాలకృష్ణకవి క్రీ. శ. 1560 ప్రాంతము వాఁడు. సకలలక్షణసార సంగ్రహమున 'సారంగధరచరిత్రము' మున్నగు ప్రబంధములయందలి పద్యములుండుటచే నీతఁడు క్రీ. శ. 1630 తరు వాతివాఁడని చెప్పనొప్పును.

కవినిగూర్చిన వివరము తెలియుటకై గ్రంథాంతగద్య మీక్రింద నుదాహరింపఁబడినది.

ఇది శ్రీ మద్వేంకటాచలాధ్యక్ష సంలబ్ధాసాధారణ ప్రజ్ఞావిచక్ష ణాక్షీణప్రబంధాంధ్రశబ్దసారలక్షణ బహుచిత్రకవిత్వరచనాచమత్కార రత్నాకరకృష్ణమరాజ గర్భరత్నాకరసుధాకర గోపాలసత్కవిరాజప్రణీ తంబయిన సకలలక్షణసారసంగ్రహము సంపూర్ణము.

5. సుకవికర్ణామృతము. 850 గ్రం. సం.

కొలూరి ఆంజనేయకవి విరచితము. ఇది యేఁబదియెనిమిది తాళ పత్త్రములు గలది. వ్రాయసగాని పేరుగాని, కాలముగాని తెలియదు వ్రాఁత యొకమాదిరిగ నున్నది. తప్పులంతగ లేవుగాని, మూఁడువంత లకుఁబైఁగఁ బత్త్రములచివరలు పోయినవి.

ఈ గ్రంథమునకు "కుకవికర్ణకఠోర" మను వేఱొకనామమున గలదు. యతిప్రాసప్రకరణములు రెండుమాత్రమే యిందుఁ గలవు తొలిప్రకరణమున గురులఘునిర్ణయము, గణవిభజనము మున్నగువిష యములు తెలుపఁబడియున్నవి. ఈగ్రంథము శోభనాద్రీశ్వరునకుఁ గృతి యొసంగఁబడినది. గ్రంథాదిని ప్రాచీనసంప్రదాయానుసారముగ సంస్కృతశ్లోకము వ్రాయఁబడినది.

శ్లో॥ శ్రియ మధిగణ్యతే గుణవశీకరణాయ భవత్పదామ్బుజా
శ్రయధిషణవ్రతాయ చ నిశమ్య భవత్సుగుణాన్ భవత్సదా
క్షయదయేభిషిశా సలవిసారి విహారి దయారసస్య హే
క్షిలుతనశోభనాద్రి నరసింహకరోమి నమ స్సదా.

ఈ లక్షణగ్రంథమున లింగమకుంట తిమ్మన్న "బాలబోధచ్ఛ దస్సు"నుండియు, చిత్రకవి పెద్దన "లక్షణసారసంగ్రహము"నుండియు లక్షణములు గైకొనఁబడినవి. ఈకవికాలము తెలియరాదు. లాక్షణి కోదాహృతులఁబట్టి పదునాఱవశతాబ్దిప్రాంతమువాఁడని యూహింప నగును. ప్రకరణాంతమున నిట్లు గలదు.

ఇది శ్రీ వరలక్ష్మీనృసింహప్రభావ భవత్కృపార్హ విలసదాంజనేయ విరచితంబైన కుకవికర్ణకఠోరంబను సుకవికర్ణామృతమునందు...... ప్రకరణము.

6. లక్షణమంజరి—4506 గ్రం. సం.

ఇది నైషధము తిమ్మకవి ప్రణీతము. ఒకే యాశ్వాసము కలది నూటయిరువదిమూఁడు పత్రములు కలది. గ్రంథమునఁ గొన్నిచోట్ల

బ్రతములు విరిగియున్నను గ్రంథపాతము లేదు. వ్రాఁత బాగుగనున్నది. వ్రాఁత రీతి కన్నడమోడీ నున్నదని చెప్పనగును. తప్పులంతగ లేవు. ఇది ఛందోవిషయికమైనను గొలఁదిగ వ్యాకరణవిషయమునుగూడఁ దెల్పు గ్రంథము. లక్షణలక్ష్యముల రెండిటిని కవి స్వయముగానే రచియించి నాఁడు. ఈగ్రంథము గరళపురీశ్వరునకుఁ గృతియొసంగఁ బడినది. కావున నే దీనికి "గరళపురీచ్ఛంద"మను పేర వ్యవహారమును గలదు.

ఇందలి తొలిపద్యము:—

క. శ్రీ రజితశైల మందిర
సారసభవ ముఖ్యదివిజ సన్నుతవిశ్వా
ధార నిరామయ భవశుభ
కారణ దేవప్రకాశ గరళపురీశా !

ఈగరళపురము మైసూరురాజ్యమునఁ గలదు. ఈగ్రంథ మాప్రాంతములోనిదే యన్నట్లు పై వ్రాఁత తీరు చెప్పుచున్నది.

గ్రంథవిషయిక ప్రతిజ్ఞ.

క. యతులును గుణములు ప్రాసము
లతులంబగు సంధివిధము లక్షరఫలముల్
వితతాంధ్ర మహిమలెల్లను
జతురత వివరింతు సుకవిజాలము మెచ్చన్.

ఈపద్యమువలన నీగ్రంథమం దుదాహరింపఁబడిన విషయము విదితమగును. ఈతఁ డితరలాక్షణికులకంటె విలక్షణముగ నేఁబదియతు లను చేర్చినాఁడు. వాని స్వరూప మిట్లున్నది.

౧ శుద్ధస్వరయతి ౨ స్వరప్రధానయతి 3 ఉభయస్వరప్రధాన యతి ౪ స్వరసంబంధయతి ౫ వృద్ధిస్వరయతి ౬ గూఢస్వరయతి ౭ ఋయతి ౮ ఋత్వహితయతి ౯ ఋత్వనిమిత్తయతి ౧౦ సమయతి ౧౧ సంయుక్తయతి ౧౨ వర్గయతి ౧3 బిందుయతి ౧౪ పోలికయతి ౧౫ చక్కటియతి ౧౬ భిన్నవర్గయతి ౧౭ మకారయతి ౧౮ అభేదయతి

౧౯ అభేదవర్గయతి ౨౦ ప్రకారసంధియతి ౨౧ వికల్పయతి ౨౨ సరసయతి ౨౩ అనునాసికయతి ౨౪ తద్భవయతి ౨౫ యక్కటియతి ౨౬ భిన్నయతి ౨౭ ఊష్మయతి ౨౮ ప్రత్యేకయతి ౨౯ చిత్రయతి ౩౦ శకంధుయతి ౩౧ షష్ఠీసమాసయతి ౩౨ ప్రాదియతి ౩౩ ఆదేశయతి ౩౪ అఖండయతి ౩౫ శబ్దద్వయయతి ౩౬ సహోర్థయతి ౩౭ అవ్యయసంధియతి ౩౮ విభాగయతి ౩౯ ప్లుతయతి ౪౦ ఉభయప్లుతయతి ౪౧ ఆగమయతి ౪౨ చతుర్థీవిభక్తియతి ౪౩ పంచమీవిభక్తియతి ౪౪ ప్రభునామయతి ౪౫ దేశ్యనిత్యసమాసయతి ౪౬ ప్రాసయతి ౪౭ మిశ్రయతి ౪౮ అభేదవర్గయక్కటియతి ౪౯ అనుస్వారసంయుక్తప్రాదియతి ౫౦ సంయుక్తోష్మసహోర్థయతులును.

ఆశ్వాసాంతగద్యము.

ఇతి శ్రీ మదుదయాద్రీశ్వర కృపాకటాక్షసమాసాదిత సంస్కృతాంధ్రభాషాధారేయ శివపూజావిధేయ నైషధాన్వయరాకాసుధాకర మహితచరిత్రపాపయామాత్య పుత్త్ర సకల విద్వత్కవిజనాధార...... సరసగుణాభరణ సావిత్రీమనోరమణ మదనసౌందర్య తిమ్మయామాత్య వర్యప్రణీతంబైన లక్షణమంజరి యను ఛందంబునందు సర్వంబు నేకాశ్వాసము.

7. కవితాలక్షణసారము—4478 గ్రం. సం.

రామయకవి ప్రణీతము. ఇది యేకధ్యాయములుగల ఛందోగ్రంథము. ముప్పదియేడు పత్త్రములున్నవి. వ్రాఁత మంచిది. గ్రంథపాతములేదు. చాలవఱకుఁ దప్పులు పరిశోధనచేయఁబడినవి. "విశంబిసంవత్సర భాద్రపదబహుళ త్రయోదశీ శుక్రవారము మాతృకనున్న క్రమాన వ్రాసినాఁడు" ఈఛందము నాల్గవవంతు అవసరాల వేంకటరాయఁడు వ్రాసినాఁడు, అని యున్నది.

ఇందు "కవిచింతామణి" మొదలగు లక్షణగ్రంథములనుండి యుదాహరణములు గైకొనఁబడినవి. ఇంతియేగాక ఉదాహరణములు,

భోగావళి, బిరుదావళి, గుణావళి, చక్రవాక, చతుర్భద్ర, చతురంతర, చాళోత్తర, త్యాగఘోష, జయఘోష మొదలగు రగడలక్షణములును, లక్ష్యములును, సంస్కృతాంధ్రముల యందుఁ గలవు.

గ్రంథారంభము.

క. శ్రీ జానకీ మనోహర
  రాజీవదళాక్ష, నిఖిలరాజన్యనుతా !
  తేజోవిశేష సుజన వి
  రాజితకైవల్యనాథ రఘుకులనాథా !

గ్రంథాంతగద్య మిట్లున్నది.

శ్రీ విష్ణుచరణారవిందయుగళనిరంతర శేషవిశేషవాత్సల్య సుకవిజన వినుతచారిత్ర హరితసగోత్రపవిత్రనిత్యసత్యవ్రతకుతూహల అనంత యామాత్య పుత్త్ర రామయనామధేయ ప్రణీతంబైన కవితాలక్షణసారం బను ఛందము సర్వమును.

8. చిత్రబంధదర్పణము—2063 గ్రం. సం.

ఇదియొక సంకలితలక్షణగ్రంథము. ఇందుఁ దొలి తొమ్మిదిపత్రములు చిత్రబంధదర్పణ మను నీగ్రంథమునకు సంబంధించినవి. పిమ్మట నెనిమిదిపత్రములలోఁ బ్రాస్తావిక శ్లోకములు కలవు. ఆవెనుక నెనిమిది పత్రములు నరకాసుర విజయవ్యాయోగము. ఉన్నంతదనుక గ్రంథ పాతము లేదు. వ్రాఁత బాగుగనేయున్నది. పత్రము లచ్చటచ్చటఁ బురుగులచే నమిలివేయఁబడినవి. ఈ చిత్రబంధదర్పణము నడిమింటి వేంకట పతి ప్రణీతము. అసమగ్రము. నరకాసురవిజయవ్యాయోగ మీావఱకు ముద్రితమైనదే. ప్రాస్తావికపద్యములు ప్రచారములో నున్నవియే. కొన్నిశ్లోకములు, వానికిఁ దెనుఁగుఁబద్యములును గలవు.

వేంకటపతి గ్రంథమునందు చిత్రబంధలక్షణములు, లక్ష్యములు చెప్పఁబడినవి. అందులక్షణములు చాలవఱకు చిత్రకవి పెద్దన "లక్షణ సారసంగ్రహము" నుండి కైకొనఁబడినవి. లక్ష్యములకుఁ దెలుఁగుఁ బద్య

ములుగాక సంస్కృతశ్లోకములు వేదాంతదేశికుల పాదుకాసహస్రము
చిత్రబంధరామాయణము, మున్నగువానినుండి గైకొనఁబడినవి. బం
ముల పటములుకల భాగములేదు. కాని పటములో నే యే వలయము
లం దేయేనామములు వచ్చునో కవి తెలిపియున్నాఁడు.

గ్రంథారంభము.

క. శ్రీమత్సమస్త సద్గుణ
ధామా, దనుజకులభీమ తారకనామా !
కోమల జలదశ్యామా,
రామా రఘువంశసోమ రాజలలామా !

గీ. అలరు తావక కరుణాకటాక్షమహిమ
రావుకొండలరాయఁడు రమ్యమైన
సంస్కృతాంధ్ర కవీంద్రులసత్ప్రబంధ
రచిత చిత్రంబులెల్ల నేర్పఱచి కూర్చి,

గీ. తదనుగతిఁ గొన్ని చిత్రబంధములు కల్పి
తములుగావించి యందులఁ దగిన పద్య
వితతి నడిమింటి వేంకటపతి కవీంద్రుఁ
డెలమి రచియింప నవి కవిహితముగాఁగ.

గీ గ్రంథవిస్తరమ్మ కడుఁజోళియనఁబడు
గాన సంగ్రహార్థఘటన లీలఁ
దనరు చిత్రబంధదర్పణం బనుపేరఁ
గృతి యొనర్తు సుకవివితతి పొగడ.

గ్రంథాంత భాగము.

సర్వతోభద్రకు పాదుకాసహస్రే
జయామ పాలయా జయామహే దఁదహేవాలయ మహేశకా
హేమపాదుకా మమ కారోదుకా.

9. లక్షణదీపిక 1391 గ్రం. సం.

ఇది గౌరన విరచితము. ఈ ప్రతియందిరువది పత్రములుగలవు
తొలి తొమ్మిదిపత్రములలో కేతన 'ఆంధ్రభాషాభూషణము'ను వి

లిన పదునొకండు పత్రముల నీలక్షణ దీపికయునుగలవు. వ్రాఁత చక్కం గనున్నది. తప్పులంతగలేవు. గ్రంథపాతములేదు. పత్రము లచ్చటచ్చటం గ్రిమిదష్టములైనవి.

ఇందైదు పరిచ్ఛేదములుగలవు. వీనిలోఁ గ్రమముగ, అక్షరములు వానిప్రయోగమునఁ గలుగు శుభాశుభఫలములు, వర్ణాధిదేవతలు, రూక్షస్నిగ్ధవర్ణవిచారము, గణములు గణాధిదేవతలు, తత్తద్గణప్రయోగమునఁ గలుగు శుభాశుభఫలములు, మిత్రామిత్రగణవిచారము, నక్షత్రములు, రాసులు, మాతృకార్చన మున్నగు విషయములు చర్చింపఁబడినవి.

గ్రంథారంభము:—

ప్రణమ్య విద్వజ్జనపారిజాతం
కవీంద్రవిప్రార్చిత పాదపఙ్కజమ్
విభుం ప్రభుం విశ్వసృజం మహేశం
సంవక్ష్యతే లక్షణదీపికేయమ్.

అస్య గద్యప్రబంధానాం ఛందో లక్షణ నియామకస్యాదౌ తావత్ప్రకారః పఠ్యతే.

ఒకలక్షణమును వివరించునపుడు ఆలక్షణమునకు సజాతీయమగు నితరలాక్షణికుల పద్యములను శ్లోకములనుగూడ నుదాహరించినాఁడు. మచ్చున కొక ఘట్టము.

అథనగణస్య సాహిత్యచంద్రోదయే:—

నగణస్యసమీపస్థో దుర్గణస్సుభదో భవేత్

తథా కవిరాజగజాంకుశే :—

పర్వతానాం యథా మేరు స్సురాణాం శంకరో యథా
మృగాణాం చ యథాసింహో గణానాం నగణ స్తథా.

ఆంధ్రగోకర్ణఛందే

ఆంధ్రసాహిత్యపరిషత్తు—ప్రతిష్ఠాపకులు.

శ్రీమహారాజా రావు వేంకటకుమారమహీపతి సూర్యారావుబహద్దరువారు పిఠాపుర మహారాజావారు, పరిషదాద్యపోషకాధ్యక్షులు.

కీ. శే. శ్రీ వేంకటగిరి మహారాజావారు

కీ. శే. శ్రీ బొబ్బిలిమహారాజావారు

ఉద్ధారకులు.

శ్రీరాజా వేంకటాద్రి అప్పారావుబహద్దరువారు-ఉయ్యూరు జమీందారువారు

ఆంధ్రసాహిత్యపరిషత్కార్యనిర్వాహకసభావర్గము.

కార్యనిర్వాహకసభాధ్యక్షులు.

జయంతి రామయ్యపంతులుగారు బి. ఏ, బి. ఎల్.

కార్యదర్శులు.

కిలాంబి రాఘవాచార్యులుగారు ఎం. ఏ., బి. ఎల్.

వింజమూరి వెంకన్నపంతులుగారు ఎం. ఏ.

కార్యనిర్వాహకసభాసభ్యులు.

దివాన్ బహద్దర్ కొమ్మిరెడ్డి సూర్యనారాయణమూర్తినాయుఁడుగారు (కోశాధ్యక్షులు

పెద్దాడ రామస్వామిగారు, ఎం. ఏ.

చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు.

సాహిత్యవిశారద కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రిగారు.

శ్రీమాన్ గొడవర్తి జగన్నాథస్వామిగారు ఎం. ఏ. ఎల్. టి.

దర్భా వేంకటశివరామరాజుగారు బి. ఏ., బి. ఎల్.

ఆకెళ్ల వేంకట్రామయ్యగారు.

కేశవరపు కామరాజుగారు.

కోటా వేంకటసుబ్బారావునాయుఁడుగారు.

ఓలేటి వేంకటరామశాస్త్రిగారు, శతావధాని.

పానుగంటి లక్ష్మీనరసింహారావుపంతులుగారు.

పిళ్ళారిసెట్టి రంగబ్రహ్మరావునాయుఁడుగారు.

సగము వెల.

ఆంధ్ర సాహిత్య పరిషత్కార్యాలయమునఁ బ్రకటింపఁబడిన సూర్యరాయాంధ్రనిఘంటువుతప్ప తక్కిన గ్రంథములును, ఇరువదిరెండు సంవత్సరములనుండియుఁ బ్రకటింపఁబడిన పరిషత్సంచికలును ది 1-7-39 మొదలు 31-10-39 వఱకు సగము వెలలకీయఁబడును. విమర్శకులకు, ద్వాన్ శిరోమణి పరీక్షార్థులకును నుపయోగించెడి వ్యాసరాజము సంచికలందుఁ బెక్కులుగలవు.

వలయువారీ క్రిందిచిరునామాకు వ్రాయుఁడు.

ఆంధ్రసాహిత్యపరిషత్కార్యదర్శులు.
సూర్యరావుపేట,
కాకినాడ.

Printed by N. Achutaramiah at the Cocanada Printing works Cocanada and Published by K. Raghavacharyulu, Secretary, Telugu Academy, Cocanada.